


వైసీపీ సభ్యులు అవినీతి బయటపడుతుందనే భయంతో సభకు రాకుండా తప్పించుకుంటున్నారు. ప్రజలు వారి దుష్ప్రచారాలను నమ్మడం మానేశారు. అరాచకాలకు విసిగిన ప్రజలు ప్రతిపక్ష హోదా ఇవ్వలేదు. బాధ్యత లేకుండా ప్రవర్తించడం శోచనీయం. అసత్యాలతో ప్రజలను ఎప్పటివరకు మోసం చేస్తారు?

**ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఎమ్మెల్సీ**



శనివారం 20.09.2025

INK OF TRUTH


# జర్నలిస్ట్ ఫైల్

తెలుగు దినపత్రిక

సంపుటి - 33 సంచిక - 155 www.journalistfile.com పేజీలు 8 వెల : రూ.5.00

# సాగునీటి ... సంకల్పం



- సాగునీటి ప్రాజెక్టులకు 5 ఏళ్లల్లో రూ. 60 వేల కోట్లు
- సమర్థ నీటి నిర్వహణతోనే అభివృద్ధి సాధ్యం
- ప్రాధాన్యత క్రమంలో రాయలసీమ-ఉత్తరాంధ్ర ప్రాజెక్టులు పూర్తి
- సాగు నీటి వ్యవస్థను ఛిన్నాభిన్నం చేసిన గత పాలకులు
- నదుల అనుసంధానంతోనే అందరికీ లబ్ధి

2లో

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** సమర్థ నీటి నిర్వహణతో రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చెప్పారు. రాష్ట్రంలో నీటి సమర్థ నిర్వహణ అంశంపై శుక్రవారం అసెంబ్లీలో చర్చ జరిగింది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రసంగించారు. రాష్ట్రంలో ఇరిగేషన్ ప్రాజెక్టులకు కూటమి ప్రభుత్వం ఇప్పటి వరకు ఏం చేసిందనేది వివరించారు. అలాగే భవిష్యత్తులో ఏమేం చేయబోతున్నామనేది ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. అలాగే ఇరిగేషన్ రంగానికి సంబంధించిన అంశంపై సీఎం పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. దీంతో పాటు.. గత ప్రభుత్వం ఇరిగేషన్ రంగంలో ఆడిన డ్రామాలపై రూపొందించిన వీడియోను ముఖ్యమంత్రి సభలో ప్రదర్శించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.."ఏపీలో 1.06 కోట్ల ఎకరాలకు నీటిని అందిస్తున్నాం. కూటమి అధికారంలోకి వచ్చాక రూ. 12 వేల కోట్లు ఖర్చు పెట్టాం. మొత్తం ఐదేళ్లలో రూ. 60 వేల కోట్లను జలవనరుల శాఖకు ఖర్చు చేస్తాం. 94 శాతం రిజర్వాయర్లలో నీళ్లు నింపిన జలవనరుల శాఖకు అభినందనలు. 1040 టీఎంసీల నీళ్లు ప్రస్తుతం నిల్వ ఉన్నాయి. వాటర్ యూజర్స్ కమిటీలకు కూడా కూటమి అధికారంలోకి వచ్చాకే ఎన్నికలు నిర్వహించి ప్రతినిధుల్ని నియమించాం. రాష్ట్రంలో భూగర్భ జలాలను కూడా పెంచడానికి చర్యలు చేపట్టాం. ఈసారి 2.1 శాతం వం-ర్షపాతం తక్కువగా పడింది. అయినా నీటి నిర్వహణ వల్ల గతంతో పోలిస్తే 1.5 మీటర్ల మేర భూగర్భ జలాలు పెరిగాయి. ప్రస్తుతం 8.43 మీటర్ల మేర భూగర్భజలాలు ఉన్నాయి. భూగర్భంలో 697 టీఎంసీల నీరు ప్రస్తుతం అందుబాటులో ఉన్నాయి. సమర్థ నీటి నిర్వహణ ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న చెరువులను నింపాలి. భూగర్భ జలాలను రీఛార్జి చేసుకోవాలి. నీటిని సమర్థవంతంగా వినియోగించుకుంటే కరవు అనే మాట రాష్ట్రంలో ఉండదు. ఏపీని కరవు రహిత రాష్ట్రంగా తయారు చేసే బాధ్యత కూటమి తీసుకుంటుంది." అని సీఎం చెప్పారు.

## ఉల్లి రైతులకు అండగా ఉంటాం



**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్రంలో ఉల్లి ధరలు పతనం కావడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని గ్రహించిన సీఎం చంద్రబాబు కీలక నిర్ణయం తీసుకున్నారని వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. శుక్రవారం సీఎం క్యాంప్ ఆఫీస్ వద్ద మీడియా తో మాట్లాడుతూ ఉల్లి పంట పండించిన రైతులకు హెక్టారుకు రూ.50,000 ఆర్థిక సాయం అందజేయాలని సీఎం చంద్రబాబు నిర్ణయం తీసుకున్నారని మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. ఈ నిర్ణయంతో ప్రభుత్వంపై సుమారు రూ.100 కోట్లు అదనపు భారం పడనుందని అన్నారు. కర్నూలు ఖరీఫ్ సీజన్ లో 45,278 ఎకరాల్లో ఉల్లి పంట సాగు చేసారని, 24, 218 మంది రైతులు లబ్ధిపొందుతున్నట్లు మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని తీసుకున్న ఈ చర్యకు రాష్ట్రవ్యాప్తంగా రైతులు స్వాగతం పలుకుతున్నారని పేర్కొన్నారు. పంటకు ధర పలికినప్పుడే ఉల్లిని విక్రయించాలని రైతులకు మంత్రి సూచించారు. మార్కెట్లో సమయానుసారం ధరలు లభించే వరకు రైతులు సహనంతో ఉండాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ ఆర్థిక సాయం రైతులకి తక్షణ ఉపశమనం లభిస్తుందన్నారు. మిగతా 2లో...

## సవితకు స్కోచ్ అవార్డు



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత శనివారం ఢిల్లీ పర్యటించనున్నారు. న్యూఢిల్లీలోని ఓక్ హాల్ లో జరిగే కార్యక్రమంలో బీసీ సంక్షేమ శాఖ మంత్రిగా సవిత స్కోచ్ అవార్డును అందుకోనున్నారు. మెగా డీఎస్సీ, సివిల్ సర్వీసెస్ పోటీ పరీక్షలకు బీసీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో బీసీ నిరుద్యోగ యువతకు బీసీ సంక్షేమ శాఖ ఉచిత శిక్షణ అందజేసిన విషయం విధితమే. బీసీ స్టడీ సర్కిళ్ల ఆధ్వర్యంలో మెగా డీస్సీకి ఆన్ లైన్, ఆఫ్ లైన్ ద్వారా బీసీ అభ్యర్థులకు ఉచిత శిక్షణ అందజేశారు. అన్ని జిల్లా కేంద్రాల్లోనూ బీసీ స్టడీ సర్కిళ్ల ద్వారా నిర్వహించిన శిక్షణా కేంద్రాల్లో 1,674 మంది, ఆన్ లైన్ ద్వారా మరో 4,774 మందికి ఇలా మొత్తం 6,470 మందికి ఉచిత శిక్షణ అందజేశారు. శిక్షణ పొందిన వారిలో 241 మంది బీసీ అభ్యర్థులు టీచర్లగా ఎంపికయ్యారు. విజయవాడలోని బీసీ స్టడీ సర్కిల్ ద్వారా 83 మందికి సివిల్ సర్వీసెస్ ఉచిత కోచింగ్ అందజేయగా, మిగతా 2లో...

## ఆరోగ్యశ్రీ నిలిచిపోలేదు



- కూటమి పాలనలో భారీగా పెరిగిన డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవ లబ్ధిదారులు, వ్యయం
- మొదటి ఏడాదిలో 7 శాతం పెరిగిన లబ్ధిదారులు, 8 శాతం పెరిగిన వ్యయం
- గత ప్రభుత్వం పెట్టిన రూ.2,221 కోట్ల బకాయిల చెల్లింపు
- నెట్వర్క్ ఆసుపత్రులపై పటిష్టం చేసిన నిఘా
- శాసన సభలో వివరాల్ని వెల్లడించిన మంత్రి సత్యకుమార్ యాదవ్
- ఉచిత వైద్యసేవలపై దుష్ప్రచారాన్ని ఖండించిన మంత్రి

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** కూటమి ప్రభుత్వ పాలనలో డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవ కింద ఉచిత సేవలు పొందే లబ్ధిదారులు, అందుకు సంబంధించిన వ్యయంలో భారీ వృద్ధి నమోదైందని వైద్యారోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడించారు. శుక్రవారం ఉదయం శాసన సభలో ప్రశ్నోత్తరాల కాల సమయంలో ఇందుకు సంబంధించిన వివరాల్ని తెలిపారు. ఉచిత వైద్య సేవల పథకం అమలుపై కొందరు చేస్తున్న దుష్ప్రచారాన్ని ఈ వాస్తవాలు ఎండగట్టాయని మంత్రి స్పష్టం చేశారు. ఈ విషయంపై సభ్యుడు మహమ్మద్ నజీర్ అడిగిన ప్రశ్నకు మంత్రి వివరాణాత్మక సమాధాన్నిచ్చారు.

**నాటికి నేటికి వ్యత్యాసం :** కూటమి ప్రభుత్వ పాలనలో మొదటి ఏడాదైన 2024-25లో డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవ లబ్ధిదారుల సంఖ్య 6.68 శాతం పెరిగి 13,42,673కు చేరుకుందని మంత్రి తెలిపారు. 2023-24లో లబ్ధిదారుల సంఖ్య 12,53,065 అని తెలిపిన మంత్రి కూటమి ప్రభుత్వ పాలనలో లబ్ధిదారుల సంఖ్య దాదాపు 90,000 పెరిగిందని తెలిపారు. ఈ కాలంలో ప్రిఆథరైజేషన్ ద్వారా ప్రభుత్వం అనుమతించిన వ్యయం 7.88 శాతం పెరిగిందని మంత్రి చెప్పారు.

ఉచిత వైద్య సేవలకు సంబంధించిన వ్యయం వివరాల్ని కూడా మంత్రి వెల్లడించారు. డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవ కింద ఉచిత సేవల నిమిత్తం జూన్, 2024 నుండి సెప్టెంబరు 1, 2025 వరకు గణనీయంగా పెరిగి రూ.6,458 కోట్ల మేరకు ఉండవచ్చని మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. మిగతా 2లో...

## పంచాయతీల్లో కొత్త యుగం

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** ఆంధ్రప్రదేశ్ పల్లెల్లో పట్టణ స్థాయి సౌకర్యాలను అందించేందుకు పంచాయతీరాజ్ వ్యవస్థలో విస్తృత సంస్కరణలకు ఉప ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ నాంది పలికారు. డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం కలలు కనే 'గ్రామాభివృద్ధి - పట్టణ సౌకర్యాలు' సాకారం దిశగా పాలనను పునర్వ్యవస్థీకరించే ప్రక్రియకు శ్రీకారం చుట్టారు.


**సమీక్షా సమావేశంలో మార్గదర్శకాలు :** శుక్రవారం శాసనసభలో జరిగిన సమీక్షా సమావేశంలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, సాధారణ పరిపాలన, ఆర్థిక, న్యాయశాఖల అధికారులు పాల్గొన్నారు. ప్రస్తుత పంచాయతీ వ్యవస్థ లోపాలు, క్లస్టర్ విధానంలోని సమస్యలు, సిబ్బంది కొరత వంటి అంశాలపై పవన్ కళ్యాణ్ సమగ్రంగా చర్చించారు. అధికారుల ప్రజెంటేషన్ అనంతరం కొత్త విధానాలపై ఆయన స్పష్టమైన దిశానిర్దేశం చేశారు.

**సగం శతాబ్దం పాత సిబ్బంది నమూనాకు ముగింపు :** దాదాపు 50 ఏళ్లుగా మార్పులేకుండా కొనసాగుతున్న సిబ్బంది నమూనాను రద్దు చేసి, సమయానుకూలంగా కొత్త నియామకాలతో వ్యవస్థను బలోపేతం చేయాలని నిర్ణయించారు. ఇకపై ప్రతి పంచాయతీకి ప్రత్యేక కార్యదర్శి ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు.


**ఆదాయం ఆధారంగా కాదు.... విభిన్న ప్రమాణాలతో గ్రేడ్లు:**

ఇప్పటివరకు ఆదాయం ఆధారంగా పంచాయతీల గ్రేడ్లు నిర్ణయించేవారు. ఇకపై జనాభా, మండల కేంద్రం స్థాయి, గిరిజన-గిరిజనేతర ప్రాతిపదిక, ఆదాయ స్థితి వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని నాలుగు గ్రేడ్లుగా విభజించనున్నారు.

**సంస్కరణల పథకాలు ప్రారంభం :** మంత్రి పదవి చేపట్టిన తొలి రోజు నుంచే పవన్ కళ్యాణ్ పలు సంస్కరణలు ప్రవేశపెట్టారు. సర్పంచుల గౌరవాన్ని కాపాడేందుకు మిగతా 2లో...



## కరవు రహితంగా ఏపీ



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** ఆంధ్రప్రదేశ్‌ను కరవు రహిత రాష్ట్రంగా మార్చేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. నీటిపారుదల శాఖను ప్రక్షాళన చేసుకుంటూ ముందుకెళ్తున్నట్లు చెప్పారు. శాసనసభలో జలవనరులపై లఘు చర్చను ప్రారంభించిన సందర్భంగా ఆయన ఈమేరకు ప్రసంగించారు. డెల్టా ప్రాంతాలను తలదన్నేలా రాయలసీమలో పంటలు పండుతున్నాయన్నారు. సీఎం చంద్రబాబును అభినవ కృష్ణదేవరాయలుగా పేర్కొన్నారు. "ప్రాధాన్య క్రమంలో తొలి ఏడాది ప్రాజెక్టుల నిర్మాణ పనులు చేపడుతున్నాం. వచ్చే ఏడాది ఉత్తరాంధ్ర ప్రాజెక్టులు ప్రాధాన్యంగా చేపడతాం. 20-30 ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఉత్తరాంధ్ర ప్రాజెక్టుల పూర్తికి సీఎం చంద్రబాబు ఆదేశాలు ఇచ్చారు. ఈ మేరకు లక్ష్యాలు నిర్దేశించుకుని పనిచేస్తున్నాం. కృష్ణా జలాలను ఆఖరి మైలు వరకు తీసుకెళ్లే ప్రయత్నం చేస్తున్నాం. 2026 జులై నాటికి వెలిగొండ ప్రాజెక్టు పూర్తి చేయడమే మా లక్ష్యం. పోలవరం ఎడమ కాలువ జలాలు ఈ ఏడాది అనకాపల్లి వరకు తీసుకెళ్లే యోచనలో ఉన్నాం. ప్రాజెక్టులు, రిజర్వాయర్ల పేర్లు చెబితే తెదేపా గుర్తుకు వస్తుంది. వైకాపా పేరు చెబితే ఇసుక, గనులు, మద్యం, భూ మాఫియాలు గుర్తుకు వస్తాయి. వైకాపా పాలనలో ప్రాజెక్టుల నిర్వహణ సరిగా లేదు. ఈ నేపథ్యంలో తొలి ఏడాది నిర్వహణకు మూడు విడతల్లో రూ.800 కోట్లు కేటాయించాం. గత ప్రభుత్వ తప్పిదాలను ఒక్కొక్కటీ సరిచేస్తున్నాం. ఆర్థిక పరిస్థితి సరిగా లేకపోయినా జలవనరులశాఖకు నిధులు కేటాయించాం" అని నిమ్మల రామానాయుడు తెలిపారు.

## ఏపీ మద్యం కుంభకోణం కేసులో 'ఈడీ' సోదాలు




**దిల్లీ:** ఏపీ మద్యం కుంభకోణం కేసులో మనీలాండరింగ్ నిరోధక చట్టం కింద ఈడీ సోదాలు చేపట్టింది. దేశవ్యాప్తంగా 20 ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించింది. హైదరాబాద్, బెంగళూరు, చెన్నై, తంజావూరు, సూరత్, రాయ్‌పుర్, దిల్లీ, ఆంధ్రప్రదేశ్‌లలో ఈడీ అధికారులు సోదాలు చేపట్టారు. ప్రభుత్వ ఖజానాకు రూ.4000 కోట్ల నష్టం వాటిల్లిందని సీఐడీ నమోదు చేసిన ఎఫ్ఐఆర్ ఆధారంగా ఈడీ దర్యాప్తు చేపట్టింది. సోదాల్లో పలు కీలకమైన దస్త్రాలను స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. సోదాలు నిర్వహించిన ప్రాంతాల్లో లెక్కల్లో చూపని రూ.38 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నారు.

## టిడిపిలోకి ముగ్గురు ఎమ్మెల్సీలు



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** వైసిపికి చెందిన ముగ్గురు ఎమ్మెల్సీలు బి కళ్యాణ చక్రవర్తి, కర్రి పద్మశ్రీ, మర్రి రాజశేఖర్ శుక్రవారం సాయంత్రం సిఎం చంద్రబాబు నాయుడు సమక్షంలో టిడిపిలో చేరారు. వీరికి టిడిపి కండువా కప్పి చంద్రబాబు పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మీడియాతో మాట్లాడుతూ.. మిగతా 2లో...

## చరిత్ర సృష్టించిన అంతిమ్



**జాగ్రెబ్(క్రొయేషియా):** ప్రపంచ రెజ్లింగ్ ఛాంపియన్‌షిప్‌లో మహిళా యువ రెజ్లర్ అంతిమ్ పంగల్ చరిత్ర సృష్టించింది. ప్రపంచ రెజ్లింగ్ ఛాంపియన్‌షిప్‌లో రెండుసార్లు పతకాన్ని సాధించిన ఏకైక మహిళా రెజ్లర్‌గా రికార్డు నెలకొల్పింది. వినేశ్ ఫోగాట్ ఒకసారి ఈ పోటీల్లో పతకాన్ని సాధించగా.. అంతిమ్ 2023 తర్వాత 2025లోనూ కాంస్య పతకంతో మెరిసింది. గురువారం జరిగిన మహిళల 53కిలోల రెజ్లింగ్ కాంస్య పతక మిగతా 2లో...

## పంచాయతీల్లో కొత్త యుగం

(మొదటి పేజీ తరువాయి)

జాతీయ పండుగల నిధులను భారీగా పెంచారు. మైనర్ పంచాయతీలకు రూ. 100 నుండి రూ. 10,000, మేజర్ పంచాయతీలకు రూ. 250 నుండి రూ. 25,000కు పెంచి చారిత్రక నిర్ణయం తీసుకున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 13,326 పంచాయతీల్లో ఒకేసారి గ్రామ సభలు నిర్వహించి ప్రత్యేక రికార్డు నెలకొల్పారు.

**ఉద్యోగులకు ఊరట** : దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న పదోన్నతులను ఒకే దెబ్బకు 10 వేల మందికిపైగా ఉద్యోగులకు మంజూరు చేసి ఉద్యోగుల నమ్మకం పొందారు.

**కేంద్ర రూర్బన్ పథకంతో ముందుకు** : ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రవేశపెట్టిన రూర్బన్ పథకం సహకారంతో పంచాయతీల్లో పట్టణ స్థాయి మౌలిక వసతులు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ముందుకు వెళ్తోందని పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు. గత ప్రభుత్వంలో ఆర్థిక సంఘం నిధులు మళ్లించబడిన కారణంగా పంచాయతీల్లో కష్టాలు తలెత్తగా, ఇప్పుడు 15వ ఆర్థిక సంఘం నిధులు సమయానికి ఖాతాల్లో జమవుతున్నాయని వివరించారు.

సమీక్షలో ఎస్.ఎస్. రావత్, శశిభూషణ్ కుమార్, వినయ్ చంద్, కృష్ణతేజ, ప్రతిభాదేవి, వెంకటకృష్ణ తదితర అధికారులు పాల్గొన్నారు.

## ఉల్లి రైతులకు అండగా ఉంటాం

(మొదటి పేజీ తరువాయి)

2016లో ఉల్లి ధరలు పడిపోతే 7723 మంది రైతులనుండి 2.77 లక్షల క్వింటాళ్ళు కొనుగోలు చేసి 7 కోట్ల రూపాయలు రైతులకు చెల్లించామని, 2018లో మరొక సారి 9740 మంది రైతుల నుండి 3.48 లక్షల క్వింటాళ్ళ ఉల్లి కొనుగోలు చేసి 6.45 కోట్లు చెల్లించామని తెలిపారు. జగన్ హయాంలో 2020 సంవత్సరంలో వైసీపీ ప్రభుత్వంలో ఉల్లి ధరలు పడిపోతే, నామ మాత్రంగా క్వింటాకి రూ. 770/-లు మద్దతు ధర ప్రకటించి, ఏ ఒక్కరి దగ్గరా ఉల్లి కొనుగోలు చేయకుండా, కేవలం 250 మంది రైతుల దగ్గర 75 లక్షలు ఇచ్చి ఉల్లిని కొని రైతులని నిండా ముంచారని మండిపడ్డారు. రైతుల అభివృద్ధి కోసం కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి స్పష్టం చేశారు. రైతుల సంక్షేమం, వ్యవసాయ రంగ అభివృద్ధి తమ ప్రభుత్వానికి ప్రాధాన్యతమని ఆయన అన్నారు. రైతుల శ్రమకు గౌరవం కల్పించేందుకు, వారికి న్యాయమైన ధరలు లభించేలా కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. వర్షాభావం, ప్రకృతి వైపరీత్యాల సమయంలో రైతులకు భరోసా కల్పించే విధంగా పంటలకు కొనుగోలు ధరలు తగ్గితే ప్రభుత్వమే కొనుగోలు చేస్తూ రైతులకు అండగా నిలబడుతుందన్నారు. కూటమి ప్రభుత్వం రైతుల పక్షాన నిలిచి, వారిని ఆర్థికంగా బలపరిచే విధంగా పలు సంస్కరణలు, సంక్షేమ కార్యక్రమాలు తీసుకొస్తోందని అన్నారు. కేవలం మాటలకే పరిమితమైపోయిన గత ప్రభుత్వం మాదిరి కాకుండా, మా ప్రభుత్వం రైతులకు సాక్షాత్కారమైన లాభాలను అందజేస్తుందని అన్నారు. రైతుల సమస్యలను పరిష్కరించడం తమ ప్రభుత్వ ధ్యేయమని, భవిష్యత్తులో కూడా మరింత బలమైన విధానాలతో వ్యవసాయ రంగాన్ని అభివృద్ధి చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు.

## సవితకు స్కోచ్ అవార్డు

(మొదటి పేజీ తరువాయి)

వారిలో గ్రూప్ 2 మెయిన్స్ కు 12 మంది, ఆర్.ఆర్.బి లెవల్ - 1కు పది మంది ఎంపికయ్యారు. ఎఫ్.ఆర్.వో ప్రిలిమ్స్ కు ఇద్దరు, మెయిన్ కు ఒకరు అర్హత సాధించారు. పోలీసు కానిస్టేబుల్ ఉద్యోగాలకు మరో మరో ఆరుగురు, ఆర్.ఆర్.బి లోకో పైలట్ గా మరో అభ్యర్థి ఎంపికయ్యారు. మరికొన్ని ప్రభుత్వ ఉద్యోగాలకు మరికొందరు అర్హత సాధించారు. బీసీ నిరుద్యోగ యువతకు పోటీ పరీక్షల్లో ఉచిత శిక్షణ అందజేసినందుకు గాను ప్రతిష్టాత్మక స్కోచ్ అవార్డు బీసీ సంక్షేమ శాఖకు వరించింది. న్యూఢిల్లీలోని ఓక్ హాల్ లో జరిగే కార్యక్రమంలో బీసీ సంక్షేమ శాఖ మంత్రిగా సవిత స్కోచ్ అవార్డును అందుకోనున్నారు. ఇందుకోసం ఆమె న్యూఢిల్లీకి శుక్రవారం రాత్రి పయనమయ్యారు. మంత్రి సవిత వెంట బీసీ సంక్షేమ శాఖ ఉన్నతాధికారులు ఉన్నారు.

## చరిత్ర సృష్టించిన అంతిమ్

(మొదటి పేజీ తరువాయి)

పోటీలో అంతిమ్.. స్వీడన్‌కు చెందిన జొన్నా ఎమ్మా మల్మోగ్రేన్‌ను 9-1పాయింట్ల తేడాతో మట్టి కరిపించింది. 2023లోనూ తొలిసారి మాల్మోగ్రేన్‌ను ఓడించి కాంస్య పతకం సాధించిన అంతిమ్.. తాజాగా మరోసారి ఆమెపైనే విజయం సాధించి కంచు పతకాన్ని కైవసం చేసుకోవడం విశేషం. అనంతరం మాట్లాడుతూ.. 2023లో తొలిసారి సీనియర్ విభాగంలో పతకం సాధించానని, ఈసారి స్వర్ణ పతకమే లక్ష్యంగా బరిలోకి దిగినా.. సెమీస్‌లో పారిస్ ఒలింపిక్స్ రజత పతక విజేత లూసియా యెపెజ్ గుజ్‌మాన్ చేతిలో 3-5పాయింట్ల తేడాతో ఓటమితో నిరాశకు గురయ్యాయని పేర్కొంది. 2022లో తొలిసారి జూనియర్ ప్రపంచ రెజ్లింగ్ టైటిల్ గెలిచిన అంతిమ్.. బంగారు పతకం సాధించిన తొలి భారత మహిళా రెజ్లర్‌గా రికార్డు నెలకొల్పింది. అలాగే 19ఏళ్లకే ఆసియా క్రీడల్లో కాంస్య పతకం సాధించి 2024 పారిస్ ఒలింపిక్స్ బెర్త్ దక్కించుకొంది.

## టిడిపిలోకి ముగ్గురు ఎమ్మెల్సీలు

(మొదటి పేజీ తరువాయి)

తాము వైసిపికి, ఎమ్మెల్సీ పదవులకు రాజీనామా చేశామన్నారు. మండలిలో తమ రాజీనామాలను ఛైర్మన్ ఆమోదించడం లేదన్నారు. రాజీనామాల ఆమోదం కోసం ఆరు నెలలుగా వేచి చూశామన్నారు. రాజీనామా ఆమోదిస్తారన్న నమ్మకం లేదన్నారు. మండలి ఛైర్మన్ వెనుక వైసిపి పెద్దలు కొంతమంది తమ రాజీనామాలను ఆమోదించకుండా అడ్డుకుంటున్నారని మర్రి రాజశేఖర్ దుయ్యబట్టారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు, ఎంపి లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యేలు సునీల్, విజయశ్రీ, పులివర్తి నాని, ఎమ్మెల్సీలు ఆలపాటి రాజేంద్ర ప్రసాద్, పేరాబత్తుల రాజశేఖర్, రామ్‌గోపాల్‌రెడ్డి, కంచర్ల శ్రీకాంత్, బిటి నాయుడు, మాజీ ఎమ్మెల్సీ మంతెన సత్యనారాయణ, ఫారెస్టు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ సుజయకృష్ణ రంగారావు తదితరులు పాల్గొన్నారు.

## నేడు "స్వస్త్ నారీ సశక్త్ పరివార్"




**బ్రహ్మంగారిమఠం(జర్నలిస్ట్ ఫైల్ )** : బ్రహ్మంగారిమఠం మండలం స్థానిక ప్రాథమిక ఆరోగ్యకేంద్రం నందు ఈరోజు "స్వస్త్ నారీ సశక్త్ పరివార్" కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు డిప్యూటీ డిఎంహెచ్వో డాక్టర్ మల్లేష్ తెలిపారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాల్సిన ఆవశ్యకతను తెలియజేయాల న్నారు. కార్యక్రమంలో రక్తపోటు మధుమేహం నోటి క్యాన్సర్ రొమ్ము క్యాన్సర్ గర్భాశయ క్యాన్సర్ వంటి వ్యాధుల స్క్రీనింగ్ వివరాలను అడిగి తెలుసుకోనున్నారు మహిళలు తమ ఆరోగ్యం పట్ల నిర్లక్ష్యం చేయకుండా ఇలాంటి కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమం మహిళల ఆరోగ్య పరిరక్షణకు ఒక ముఖ్యమైన ముందడుగు అని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు స్పెషలిస్టు వైద్యులు పీహెచ్సీ వైద్యులు మరియు వైద్యేతర సిబ్బంది పాల్గొంటారని ఓ ప్రకటనలో తెలిపారు.

# సాగునీటి.. సంకల్పం

(మొదటి పేజీ తరువాయి)



**గత పాలకులు పట్టిసీమ వద్దన్నారు... పోలవరాన్ని నాశనం చేశారు** : "రాష్ట్ర విభజన తర్వాత పోలవరం ప్రాజెక్టును జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించారు. జూన్ 2 తేదీ కంటే ముందే 7 ముంపు మండలాలను కలపాలని ప్రధానిని కోరాను. పార్లమెంటు సమావేశాని కంటే ముందు ముంపు మండలాలు కలుపుతూ ఆర్డినెన్సును తెచ్చాం. ఆ నిర్ణయంతోనే పోలవరం ప్రాజెక్టు ముందుకు వెళ్లింది. భూసేకరణ, కాంట్రాక్టుల వివాదాలు, కుడి కాలువ లాంటి సమస్యలను దాటుకుని 2019 నాటికి 72 శాతం ప్రాజెక్టు నిర్మాణం పూర్తి చేశాం. స్పిల్ వే, స్పిల్ ఛానల్, గేట్లు, కాఫర్ డ్యామ్ పనులు, కుడి కాలువ పనులు వంద శాతం పూర్తి చేశాం. గతంలో రూ. 400 కోట్లతో డయాఫ్రం వాల్ నిర్మించాం. గత పాలకుల అసమర్థత వల్ల డయాఫ్రం వాల్ కొట్టుకు పోయింది. కూటమి ప్రభుత్వం వచ్చాక... మళ్లీ రూ. 1000 కోట్లతో కొత్తగా మళ్లీ నిర్మిస్తున్నాం. 2025 డిసెంబరు నాటికి డయాఫ్రం వాల్ పూర్తి చేస్తాం. పోలవరం ఎడమ కాలువ పనుల్ని రూ. 960 కోట్లతో చేపడుతున్నాం. దీనిని పూర్తి చేసి ఉత్తరాంధ్రకు నీళ్లిస్తాం. రూ. 894 కోట్ల నిధులు నిర్వాసితులకు నిధులు ఇచ్చాం. 2019-24 మధ్య పోలవరం ప్రాజెక్టులో చేసిన పనులు 3.84 శాతం మాత్రమే. 2021కి పూర్తి కావాల్సిన ప్రాజెక్టును 7 ఏళ్లు వెనక్కు నెట్టారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణాన్ని ముందుకు తీసుకెళ్లింది మనమే. ఐదేళ్ల పాటు పోలవరం పనులను పక్కన పెట్టేశారు. ఇప్పుడు ఆ ప్రాజెక్టును జాతికి అంకితం చేసే అవకాశం ఎన్డీఏ ప్రభుత్వానికే దక్కింది. 2027 డిసెంబరు నాటికి ప్రాజెక్టును పూర్తి చేసి నీళ్లిస్తాం. పట్టిసీమ ప్రాజెక్టు ద్వారా 439 టీఎంసీల నీటిని కృష్ణా డెల్టాకు తరలించాం. పొదుపు చేసిన నీటిని శ్రీశైలం నుంచి రాయలసీమ ప్రాంతానికి తరలించి నీరిచ్చాం. గత ప్రభుత్వం పట్టిసీమ ఎత్తిపోతలను వినియోగించలేదు. ప్రజాధనంతో కట్టిన పట్టిసీమను వాడకుండా వదిలేశారు. టీడీపీ ప్రభుత్వంలో పట్టిసీమ కట్టారని... దాని తాము వాడడం ఏంటనే అహంభావంతో ఆ ప్రాజెక్టును పక్కన పెట్టారు. రెండేళ్ల పాటు అసలు నీటిని తరలించలేదు. మూడో ఏడాది కరువు వస్తే.. ఇంకా నీటిని విడుదల చేయకుంటే తంతారని పట్టిసీమ ప్రాజెక్టును వినియోగించారు. బేషజంతో ప్రభుత్వ ఆస్తులను వినియోగించకుండా ప్రజలను, రైతులను నష్టపరిచే ప్రయత్నం చేశారు. టీడీపీకి పేరు వస్తుందనే పట్టిసీమను ఐదేళ్లలో వినియోగించలేదు. ప్రజావేదికను కూల్చి విధ్వంసంతో మొదలుపెట్టి విధ్వంసంతోనే ఓడిపోయారు." అని చంద్రబాబు వివరించారు.

**హంద్రీ-నీవాతో సీమలో హర్షం** : "1987లో ఎన్టీఆర్ సంకల్పించిన హంద్రీనీవా కాలువ ద్వారా 738 కిలోమీటర్ల నీటిని తరలించి చిట్టచివరి ప్రాంతానికి తీసుకెళ్లాం. వంద రోజుల్లోనే రూ. 3800 కోట్లను మంజూరు చేసి 3850 క్యూసెక్కుల నీటిని పారిస్తున్నాం. పులివెందుల చెరువుకు కూడా నీటిని కూటమి ప్రభుత్వమే ఇస్తోంది. హంద్రీ-నీవాపై ఇప్పటి వరకూ రూ. 13 వేల కోట్ల రూపాయల మేర ఖర్చు పెట్టాం. 40 టీఎంసీల మేర నీటిని తరలించుకోవచ్చు. 497 చెరువులను నింపే ప్రయత్నం చేస్తున్నాం. రాయలసీమలోని అన్ని రిజర్వాయర్లలోనూ నీటిని నింపేలా ప్రణాళికలు చేసుకున్నాం. ఆగస్టు 30 తేదీన కుప్పానికి నీళ్లిచ్చి జలహారతి ఇవ్వటంతో నా జన్మ సార్థకం అయ్యింది. రాయలసీమ ప్రాంతంలో ఒకప్పుడు వేరు శనగ విత్తనాలు వేస్తే ఖర్చు కూడా రాని పరిస్థితి ఉండేది. నష్టపోయిన రైతులకు ఇన్ పుట్ సబ్సిడీ ఇచ్చి ఆదుకున్నాం. అలాంటి ప్రాంతానికి నీటిని తరలించేలా చేశాం." అని ముఖ్యమంత్రి చెప్పారు.

**ఉత్తరాంధ్ర-రాయలసీమ అభివృద్ధే లక్ష్యం...** : "ఉత్తరాంధ్రలో రూ. 185 కోట్ల ఖర్చు చేస్తే వంశధార ఫేజ్ 2 స్టేజ్ 2 పనులు పూర్తి అవుతాయి. తోటపల్లి తారకరామ తీర్థసాగర్, మహేంద్ర తనయ, హిర మండలం, వంశధార-నాగావళి మద్దువలస, నాగావళి-చంపావతి, జంఝావతి, గండిగెడ్డ ప్రాజెక్టులు రూ. 2097 కోట్లు వ్యయం అవుతుంది. కొత్త ఆయకట్టు 1.25 లక్షల ఎకరాలకు నీరివ్వటంతో పాటు ఇప్పటికే ఉన్న 2 లక్షల ఎకరాలు స్థిరీకరణ జరుగుతుంది. రెండేళ్లలో వీటిని పూర్తి చేసి ఉత్తరాంధ్రకు న్యాయం చేస్తాం. రాయలసీమలో అప్పర్ పెన్నా, పేరూరు రిజర్వాయర్, భైరవానితిప్ప హంద్రీనీవా నుంచి మడకశిర బ్రాంచ్ కెనాల్, అడవిపల్లి రిజర్వాయర్, నీవా బ్రాంచ్ కెనాల్, కల్యాణి డ్యామ్ తో పాటు గాలేరు నగరి ద్వారా కడప... రాజంపేట వరకూ నీళ్ళు తీసుకెళ్తాం. మొత్తం రూ. 7803 కోట్లను ప్రాధాన్యతా క్రమంలో ఖర్చు చేసి ప్రాజెక్టులు పూర్తి చేస్తాం. రాయలసీమకు నీళ్లిచ్చి రతనాల సీమగా మారుస్తాం." అని సీఎం వెల్లడించారు.

**గత పాలకులు నీటి వ్యవస్థలను దెబ్బ తీశారు** : "ఎత్తిపోతల ప్రాజెక్టులను ధ్వంసం చేసింది గత ప్రభుత్వం. 613 స్కీములు డీఫంక్ట్ అయ్యాయి. 6.5 లక్షల ఎకరాలకు నీళ్లిచ్చే పరిస్థితి ఉన్నా ఇవ్వలేకపోయింది. ఎత్తిపోతల ప్రాజెక్టుల కింద 8.30 లక్షల ఎకరాల ఆయకట్టు ఉంది. గతంలోనే 2.97 లక్షల ఎకరాలు స్థిరీకరించాం. రూ. 725 కోట్లు వ్యయం చేసి ఎత్తిపోతల ప్రాజెక్టులను ఈ ఏడాదే ఆపరేషన్ లోకి తీసుకువచ్చి నీళ్లిస్తాం. 2019-24 మధ్య సాగునీటి రంగాన్ని ధ్వంసం చేశారు. కాలువలు, వరదగట్లు దెబ్బతిన్నాయి. ఫించ, అన్నమయ్య ప్రాజెక్టులు కొట్టుకుపోయినా గత ప్రభుత్వం బాధితుల్ని పరామర్శించ లేదు. గుండ్లకమ్మ గేటు కొట్టుకు పోయింది. ఆ గేటును కూడా పెట్టలేకపోయారు. ప్రాజెక్టులను నిర్మించటం ఎంత ముఖ్యమో దాన్ని నిర్వహించటం కూడా అంతే ముఖ్యం. డ్యాములు, గేట్ల నిర్వహణకు ఓ మాన్యువల్ తయారు చేశాం. దాని ప్రకారమే ప్రాజెక్టుల నిర్వహణ చేశాం. కానీ గత పాలకులు ఐదేళ్లూ దాన్ని పక్కన పెట్టేశారు. ప్రాజెక్టులను ధ్వంసం చేశారు. తుంగభద్ర గేట్లు దెబ్బతిన్నాయి. దానిని పునరుద్ధరిస్తున్నాం. శ్రీశైలం డ్యామ్ లో స్పిల్ వే ప్రొటెక్షన్ కోసం రూ. 204 కోట్లు, ధవళేశ్వరం బ్యారేజీ కోసం రూ. 150 కోట్లు ఖర్చు చేస్తున్నాం. గుండ్లకమ్మ గేట్లు పూర్తి చేశాం. సోమశిల ప్రాజెక్టులో మరమ్మత్తులు కూడా వచ్చే సీజన్ నాటికి పూర్తి చేస్తాం." అని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు.

**వాళ్లు చేసిన తప్పులకు మేం ఫైన్లు కట్టాం** : "విధ్వంసమైన రాజకీయాలు చేస్తూ ప్రాజెక్టులకు అడ్డం పడుతున్నారు. అధికారంలో ఉన్నప్పుడు బాధ్యతగా ప్రవర్తించాలి. చిత్తూరు జిల్లాలో త్రీ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్లు నిర్మిస్తామని రూ. 2144 కోట్ల అంచనాతో ప్రాజెక్టు టేకప్ చేశారు. ఎలాంటి అనుమతులు లేకుండా ప్రారంభించారని... ఎన్జీటీ జరిమానా వేసింది. వాళ్లు చేసిన తప్పుకు రాష్ట్ర ప్రభుత్వ ఖజానా నుంచి రూ. 25 కోట్లు జరిమానా కట్టాల్సి వచ్చింది. రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టును గత ప్రభుత్వం చేపట్టింది. ఆ ప్రాజెక్టుకు పర్యావరణ అనుమతులు లేవంటూ ఎన్జీటీ పనులు నిలిపేసింది. నిలిచిపోయిన ప్రాజెక్టు కోసం రూ. 923 కోట్లు ఖర్చు పెట్టారు. వెలిగొండలో పనులు అసంపూర్తిగా ఉండగానే ప్రాజెక్టును జాతికి అంకితం చేసినట్టు డ్రామాలు ఆడారు. మేం దాన్ని పూర్తి చేస్తాం. రూ. 2059 కోట్లను ఖర్చు చేసి వచ్చే ఏడాది జూలై నాటికి వెలిగొండ నుంచి ప్రకాశం జిల్లాలోని గిద్దలూరు, కనిగిరి, మార్కాపురం, ఎర్రకొండ పాలెం తదితర ప్రాంతాలకు నీళ్లిస్తాం. వరికెపుడిశెల ప్రాజెక్టుకు త్వరితగతిన పూర్తి చేసేలా కార్యాచరణ రూపొందించాం." అని చంద్రబాబు చెప్పారు.

**నదుల అనుసంధానం చేసి తీరతాం...** : "దేశంలో నదుల అనుసంధానం చేస్తే అందరికీ ప్రయోజనం కలుగుతుందని చెబితే సురేష్ ప్రభు నేతృత్వంలో టాస్క్ ఫోర్సు ఏర్పాటు చేశారు. ప్రస్తుతం రాష్ట్రాల్లో ఇంట్రా లింకింగ్ ఆఫ్ రివర్స్ చేపడతారు. ఆ తర్వాత గంగా కావేరిని అనుసంధానించే ప్రక్రియ చేపడతారు. అందుకే దేశంలో తొలిసారిగా నదుల అనుసంధానాన్ని చేపట్టిన రాష్ట్రం ఆంధ్రప్రదేశ్. కృష్ణా-గోదావరి నదుల నుంచి ఈ సీజన్ లో ఇప్పటికి వరకూ 3782 టీఎంసీల నీళ్లు సముద్రంలోకి వృధాగా వెళ్లాయి. ఒక్క గోదావరి నుంచే 2882 టీఎంసీల నీరు, కృష్ణా నుంచి 892 టీఎంసీల నీళ్లు సముద్రంలో కలిశాయి. గోదావరి నుంచి రోజూ 50 టీఎంసీలు, కృష్ణాలో రోజూ 24 టీఎంసీల నీళ్లు సముద్రంలోకి కలిసిపోతున్నాయి. ఈ ఏడాది మొత్తంగా గోదావరి నుంచే 5 వేల టీఎంసీల నీరు సముద్రంలో కలుస్తుందని అంచనా. ఇలాంటి సమయంలో 200 టీఎంసీల నీళ్లు గోదావరి నుంచి బనకచర్లకు తీసుకెళ్తే... రాయలసీమ సస్యశ్యామలం అవుతుంది. అన్ని రాష్ట్రాలు అంతర్గతంగా తమ రాష్ట్రాల్లోని నదులు అనుసంధానం పూర్తి చేస్తే ప్రపంచానికే ఆహార ఉత్పత్తి చేసే అవకాశం ఉంటుంది. వంశధారలో వరద వస్తే పెన్నా నది ద్వారా సోమశిల, కండలేరులో నీటి నిల్వ చేసుకునేలా పరిస్థితి వస్తుంది. వంశదార- నాగావళి నదులను అనుసంధానిస్తాం. గోదావరి నుంచి కృష్ణా నీళ్లను పొదుపు చేసుకుని ఇతర ప్రాంతాలకు వాడుకోవచ్చు. కావాల్సింది విద్వేషాలు కాదని పొరుగు రాష్ట్రాలు అర్థం చేసుకోవాలి. సముద్రంలోకి వెళ్లే నీళ్లు సద్వినియోగం చేసుకుంటే తెలుగు రాష్ట్రాలకే ప్రయోజనం కలుగుతుంది. నీళ్లు సద్వినియోగం చేసుకుంటేనే మన అభివృద్ధి సాధ్యం. సాగునీటి ప్రాజెక్టులు కట్టి నీళ్లిస్తేనే ఎక్కువ తృప్తి కలుగుతుంది." అని సీఎం చెప్పారు.

**భూగర్భమే జలాశయం** : "భూగర్భాన్ని జలాశయంగా మార్చుకుని ఆ నీటిని సద్వినియోగం చేసుకోవాలి. ప్రస్తుతం ఏలూరు జిల్లాలో 202 గ్రామాల్లో 20 మీటర్ల కంటే దిగువన నీరుంది. ప్రకాశం జిల్లాలోనూ అదే పరిస్థితి ఉంది. ఏపీ రిమ్స్ పోర్టల్ ద్వారా అవేర్ ద్వారా రియల్ టైమ్ లో నీటి నిల్వలు ఇతర అంశాలపై సమాచారం సేకరిస్తున్నాం. సెన్సార్ల ద్వారా రిజర్వాయర్లలో నీటి నిల్వల్ని, రెయిన్‌గేజ్ లు ద్వారా వర్షపు నీరు, సాయిల్ మాయిశ్చర్ లాంటి అంశాలను తెలుసుకుంటున్నాం. రిజర్వాయర్లు , ఫ్లడ్ మేనేజ్మెంట్, గ్రౌండ్ వాటర్ తో రియల్ టైమ్ లోనే సమర్థ నీటి నిర్వహణ చేస్తున్నాం. సాగునీటికి, తాగునీటికి, పరిశ్రమలకు నీటి భద్రత కల్పిస్తే అభివృద్ధి సాధ్యం అవుతుంది. ఇది కియా కార్ల ఫ్యాక్టరీవిషయంలో నిజమైంది.

**బెదిరింపులతో సంస్కరణలు ఆగవు** : "మెడికల్ కాలేజీలపై కూటమి తీసుకున్న నిర్ణయం వల్ల ఎవరికీ నష్టం జరగదు. గతంలో మెడికల్ కాలేజీలు పెట్టి పేమెంట్ కోటా పెట్టారు. ప్రభుత్వంలో మేనేజ్మెంట్ అన్నారు. పీపీపీకి ఇస్తే సమర్థవంతంగా సేవలు అందుతాయి అన్ని సీట్లు ఉంటాయి. నాణ్యత ఉంటుంది. పేదలకూ ఉచిత సేవలు అందుతాయి. హైవేలను పీపీపీ విధానంలో నిర్మించారు. అలా అని ఆ హైవేలను నిర్మించిన వారికి ఇచ్చేసినట్టా...? ఆ ఆస్తి ప్రభుత్వానిదే. ప్రభుత్వమే వాటి యజమాని. నిర్మాణం చేపట్టి... రోడ్లను మెయిన్ టెన్ చేసి... గడువు ముగిసిన తర్వాత ప్రభుత్వానికి అప్పగిస్తారు. దూరదృష్టితో ఆలోచించే నిర్ణయం తీసుకున్నాం. ఎవరు అడ్డం పడినా మంచి నిర్ణయాలను ఆపేది లేదు." అని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

# ఆరోగ్యశ్రీ నిలిచిపోలేదు

(మొదటి పేజీ తరువాయి)



ఇందులో 2024-25కు సంబంధించి నిర్ధారణైన ఖర్చు రూ. 4,290.05 కోట్లని, ఇందులో ఇప్పటి వరకు రూ. 3,732.22 కోట్ల మేరకు కూటమి ప్రభుత్వం చెల్లింపులు చేయగా మరో రూ. 557.83 కోట్లు చెల్లించాల్సి ఉందని మంత్రి వివరించారు. దీనికి అదనంగా రూ. 2,168.16 కోట్ల బిల్లులు పరిశీలనలో ఉన్నాయని, వీటితో కలిపి కూటమి ప్రభుత్వ మొదటి 15 నెలల కాలంలోనే ఎన్టీఆర్ వైద్య సేవల ఖర్చు దాదాపు రూ. 6,500 కోట్ల వం-కు ఉంటుందని మంత్రి వివరించారు (గతంలో ఈ సేవలపై నెలవారీ ఖర్చు రూ. 300 కోట్లకు పైగా ఉండగా, కూటమి హయాంలో రూ. 400 కోట్లకు పైగా ఉంటుంది)

**గత ప్రభుత్వ బకాయిల చెల్లింపు** : కూటమి పాలనలో పెరిగిన ఉచిత వైద్య సేవలకు నెట్వర్క్ ఆసుపత్రులకు తగిన సమయంలో చెల్లింపులు చేయడంతో పాటు గత ప్రభుత్వం పెట్టిన రూ. 2,221.60 కోట్ల బకాయిలను ఈ తమ ప్రభుత్వం చెల్లించిందని మంత్రి తెలిపారు. ఈ మేరకు పెట్టిన బకాయిల రాశి ద్వారా పేదల వైద్యం పట్ల గత ప్రభుత్వానికి ఏ మేరకు చిత్తశుద్ధి ఉందో వెల్లడవుతోందని మంత్రి దుయ్యబట్టారు.

**దుష్ప్రచారాన్ని ఖండించిన మంత్రి** : డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవల లబ్దిదారుల సంఖ్య, వ్యయం కూటమి పాలనలో భారీగా వృద్ధి నమోదు చేసినా, ఉచిత వైద్య సేవల పథకం నిర్వీర్యమైందని కొందరు వ్యక్తులు, సంస్థలు దుష్ప్రచారాన్ని చేయడాన్ని మంత్రి సత్యకుమార్ యాదవ్ తీవ్రంగా ఖండించారు. ఈ పథకం ఆగిపోయిందని దుష్ప్రచారం చేసి, పేదల్ని సేవలకు దూరంగా ఉంచి తద్వారా కొందరు మరణిస్తే రాజకీయ లబ్ది పొందాలని వారి కుట్ర అని మంత్రి ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు.

**పెరిగిన నిఘా** : గత ప్రభుత్వ నిర్వాకాలతో ఉచిత వైద్య సేవల అమలులో అక్రమాలకు సంబంధించి పలు ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో వీటిని అరికట్టడానికి కూటమి ప్రభుత్వం నిఘా పెంచిందని తెలుపుతూ అందుకు సంబంధించిన వివరాల్ని సభలో మంత్రి వెల్లడించారు. 2023-24లో అక్రమాలకు సంబంధించి గత ప్రభుత్వం 28 నెట్వర్క్ ఆసపత్రులపై రూ. 7.68 కోట్ల మేరకు జరిమానాలు విధించి, అందులో కేవలం రూ. 3.75 కోట్లు (49 శాతం) మాత్రమే వసూలు చేసిందని తెలిపారు. దీనికి భిన్నంగా కూటమి ప్రభుత్వం రూ. 22.74 కోట్ల మేరకు జరిమానాలు విధించి అందులో రూ. 19.35 కోట్లు (85 శాతం) వసూలు చేసిందని, దీన్నిబట్టి అక్రమాల్ని అరికట్టే విషయంలో కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధి వెల్లడవుతోందని మంత్రి సభలో వివరించారు.

**నూతన ఆరోగ్య బీమా పథకం** : హైబ్రిడ్ విధానంలో రాష్ట్ర ప్రజలందరికీ ఆరోగ్య బీమా కల్పించే పథకాన్ని త్వరలో అమల్లోకి తెస్తామని మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. పేదరికంలో ఉన్న 1.43 కోట్ల కుటుంబాలు, పేదరిక రేఖపై ఉన్న 20 లక్షల కుటుంబాలకు రూ. 2.50 లక్షల మేరకు ఇన్సూరెన్స్ కంపెనీ ద్వారా బీమా కల్పిస్తామని మంత్రి అన్నారు. పేదరికంలో ఉన్న కుటుంబాలకు రూ. 2.50 లక్షలకు పైన రూ. 25 లక్షల వరకు డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్టు ద్వారా ఆరోగ్య సేవల ఖర్చును ప్రభుత్వమే భరిస్తుందని మంత్రి వివరించారు.

గుంటూరు జీజీహెచ్ కు కూటమి ప్రభుత్వం ఇప్పటి వరకు డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవ కింద రూ. 18.77 కోట్ల బకాయిలను చెల్లించదని, మరో రూ. 4.09 కోట్ల మేర చెల్లింపులు చేయాల్సి ఉందని మంత్రి తెలిపారు. క్యాన్సర్ సేవలకు సంబంధించి గుంటూరు జీజీహెచ్‌ను లెవల్-1 సెంటర్ గా తీర్చిదిద్దేందుకు ఆధునిక పెట్ సిటి స్కానింగ్ యంత్రాన్ని ఏర్పాటు చేశామని మంత్రి తెలిపారు. పూర్వ విద్యార్థుల సహాయంతో రూపుదిద్దుకుంటున్న నూతన ఎంసిహెచ్ బ్లాకు కోసం భారీ ఎత్తున పరికరాల్ని కొనుగోలు చేయడానికి కూటమి ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందని మంత్రి తెలిపారు.

## ఆర్.ఎం.పి. క్లినిక్‌లు సీజ్

**దువ్వూరు (కడప జిల్లా) (జర్నలిస్ట్ ఫైల్)** : దువ్వూరులో నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న నాలుగు ఆర్.ఎం.పి. క్లినిక్‌లను డిప్యూటీ డి.ఎం. హెచ్.ఓ. డాక్టర్ వి. మల్లేష్ ఆధ్వర్యంలో అధికారులు 19వ తేదీన సీజ్ చేశారు. ఈ ఆకస్మిక తనిఖీల్లో ఈ క్లినిక్‌లలో పరిమితికి మించి వైద్యం రోగులకు చికిత్స అందిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. ఈ తనిఖీల్లో భాగంగా, అధికారులు క్లినిక్‌లలో వాడిన యాంటిబయాటిక్స్, సెలైన్ బాటిల్స్‌తో పాటు, వాడిన వైద్య సామాగ్రిని కనుగొన్నారు. ఇది ఆర్.ఎం.పి.లు తమ పరిమితులకు మించి రోగులకు వైద్య సేవలు అందిస్తున్నారని స్పష్టం చేస్తోంది. సరైన అర్హతలు, అనుమతులు లేకుండా ఇలాంటి వైద్యం చేయడం రోగుల ఆరోగ్యానికి ప్రమాదకరం. ఈ కార్యక్రమంలో ఎం.పి. హెచ్.ఇ.ఓ. పి. రాజగోపాల్ సూపర్‌వైజర్లు ఎం. శివగంగ రాజు డి. వెంకటేశ్వర్లు, మరియు ఇతర ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు. నిబంధనలు ఉల్లంఘించే క్లినిక్‌లపై కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు.



## ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన కల్పిస్తాం



**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్)** : రాష్ట్రంలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌పై నిషేధం ఉందని.. క్షేత్రస్థాయిలో అది సరిగా అమలు జరగడం లేదని ఏపీ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ అన్నారు. ప్లాస్టిక్ నిషేధంపై గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి ప్రశ్నకు శుక్రవారం. పవన్ అసెంబ్లీలో. సమాధానం ఇచ్చారు. ఒకసారి వాడి పడేసే ప్లాస్టిక్ వల్ల పర్యావరణానికి చాలా నష్టం జరుగుతోంది. అసెంబ్లీలో కూడా సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధం అమలు జరగడం లేదు. ఫ్లెక్సీలను కూడా నిషేధించాలి. కానీ.. చాలా మంది ఉపాధి కోల్పోతారని ఆలోచిస్తున్నాం. బయోడీగ్రేడబుల్ ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలని సూచిస్తున్నాం. ప్లాస్టిక్ నిషేధంపై రాష్ట్రవ్యాప్తంగా ప్రజలకు అవగాహన కల్పిస్తాం. అసెంబ్లీలో ఈ అంశంపై పూర్తిస్థాయి చర్చ జరగాలి.

ప్పలపాడు పక్షుల కేంద్రం విషయంలో చర్యలు తీసుకుంటాం. గత ప్రభుత్వం కాలుష్య నియంత్రణ బోర్డు (పీసీబీ)లో ఎవరినీ నియమించలేదు. కాలుష్య నియంత్రణ స్థానిక సంస్థలతో సంబంధమున్న అంశం. పీసీబీలో ప్రత్యేకంగా ఉద్యోగులు లేరు. రాంకీ సంస్థకు షోకాజ్ నోటీసులు ఇచ్చి చర్యలు తీసుకున్నాం. వెంటనే చర్యలు తీసుకుంటే చాలా కుటుంబాలు రోడ్డున పడతాయి. కాలుష్య నియంత్రణ బాధ్యత పరిశ్రమలదే కాదు.. ప్రజలు, అధికారులది కూడా. రాంకీపై నిర్ణయం తీసుకుంటే గత ప్రభుత్వంలా కక్ష సాధింపు అనే ప్రచారం జరిగే ప్రమాదముంది. పారిశ్రామికవేత్తలను భయపెట్టడం మా ఉద్దేశం కాదు.. కూర్చోబెట్టి సమస్యను చెబుతాం. గతం ప్రభుత్వంలా ఇప్పుడు జరగదు" అని పవన్ అన్నారు.

## జగన్ మాటలకు జనం నవ్వుతున్నారు



**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్)** : జగన్ తనకు మైక్ ఇస్తేనే అసెంబ్లీకి వస్తా అనే షరతు పెట్టడం చిన్న పిల్లల మాటలా ఉందని తెదేపా సీనియర్ నేత, మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు శుక్రవారం ఎద్దేవా చేశారు. అసెంబ్లీలో పార్టీల బలాల ఆధారంగా సమయం కేటాయించడం స్పీకర్ అధికారమని చెప్పారు. వ్యక్తిగత కోరికల కంటే వ్యవస్థ గొప్పదని వ్యాఖ్యానించారు. జగన్ సొంత పార్టీకి చెందిన ఛైర్మన్ ఉన్న మండలిలోనూ అదే విధానం నడుస్తోందనే విషయాన్ని ఆయన గ్రహించాలన్నారు.

బిస్కెట్ ఇస్తేనే పాఠశాలకు వెళ్తాను అన్నట్టే ఉన్న జగన్ మాటలకు ప్రజలు నవ్వుతున్నారు. తన ప్రభుత్వం ఉన్నప్పుడు ఎన్నిసార్లు తెదేపా ఎమ్మెల్యేలకు మైక్ ఇవ్వకుండా సస్పెండ్ చేశారో గుర్తు చేసుకోవాలి. వైకాపా హయాంలో నడిపిన సభా విధానం ప్రజాస్వామ్య విరుద్ధం. జగన్ రాజ్యాంగ ప్రమాణాన్ని ఉల్లంఘిస్తున్నారు. గవర్నర్ ప్రసంగానికి హాజరు కావడం సభ హాజరుగా నమోదు కాదు" అని యనమల రామకృష్ణుడు అన్నారు.

# కొత్తమ్మతల్లి ఉత్సవాలకు అందరూ సన్నద్ధం కావాలి

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :**ఉత్తరాంధ్రుల ఇలవేల్పు కొత్తమ్మతల్లి ఉత్సవాలను రాష్ట్ర ప్రభుత్వ పండుగగా నిర్వహించేందుకు వరుసగా రెండో ఏడాది సన్నద్ధం అవుతున్న వేళ సంబంధిత అధికారులను అప్రమత్తం చేస్తూ, ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ ఘటనలు తలెత్తకుండా ఉండేందుకు వ్యవసాయ శాఖామాత్యులు కింజరాపు అచ్చెన్నాయుడు తనదైన మార్గ నిర్దేశం చేశారు. అమరావతిలోని వెలగపూడిలో సచివాలయం నుంచి జిల్లా అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. ఆలయ ఉత్సవాలకు వందేళ్లు పూర్తి అవుతుండడంతో అంగరంగ వైభవంగా ఈ సంబరాన్ని నిర్వహించాలని అన్నారు. చుట్టు పక్కల ప్రాంతాలకు చెందిన భక్తులతో పాటు పొరుగున ఉన్న ఒడిశా, ఛత్తీస్ గఢ్ నుంచి కూడా భక్తులు వచ్చే అవకాశాలు ఉన్నాయని ఇందుకు అనుగుణంగా క్యూలైన్ల ఏర్పాటు ఉండాలని తెలిపారు. ముఖ్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న పండుగ కావడంతో ఎక్కడా ఎటువంటి లోపాలూ తలెత్తకుండా చూడాలని ఆదేశించారు . జాతర సందర్భంగా... బాలింతలు, చిన్నారులు వచ్చే అవకాశం ఉండడంతో వారికి ఎటువంటి ఇబ్బందులు రాకుండా చూడాలని, అలానే వృద్ధులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా ముందస్తు ఏర్పాట్లు పకడ్బందీగా ఉండాలని స్పష్టం చేశారు. గతంలో పనిచేసిన విధంగా అదే స్ఫూర్తితో వేడుకలను విజయవంతం



చేసేందుకు అన్ని వర్గాల ప్రజల మన్ననలూ అందుకునేందుకు వివిధ శాఖల అధికారులు క్షేత్ర స్థాయిలో అంకిత భావంతో పనిచేయాలని అన్నారు.

**పనుల పర్యవేక్షణ తప్పనిసరి :** కొత్తమ్మ తల్లి ఉత్సవాల పనులను ప్రతిక్షణం పర్యవేక్షించాలని స్పష్టీకరణ చేశారు మంత్రి అచ్చెన్న. గతంలో వేడుకలు జరిగిన మాదిరిగానే ఈ సారి కూడా ఆలయ వేడుకలు అత్యంత ప్రతిష్టాత్మకంగా ఉత్తరాంధ్రుల ఆత్మ గౌరవ ప్రతీకగా నిలిచే విధంగా ఉండాలని, ఎక్కడా అధికారులు అలసత్వం వహించవద్దని, ఉత్సవ నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే ప్రభుత్వం తరఫున కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. కలెక్టర్, ఎస్పీ లాంటి ఉన్నత స్థాయి వ్యక్తులతో తాను ఎప్పటికప్పుడు మాట్లాడుతున్నానని, ఈ ప్రాంత ఖ్యాతిని పెంచే విధంగా ఈ సారి హెలి కాప్టర్ రైడ్ (కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు చొరవతో), అలానే లేజర్ షో లు నిర్వహిస్తున్నామని, వాటికి సంబంధించి కూడా సాంకేతిక సంబంధిత విషయాలపై ఎప్పటికప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలని, భారీ సంఖ్యలో ఈ రెండు కార్యక్రమాలకూ ప్రజలు వచ్చే అవకాశం ఉన్నందున తొక్కిసలాటకు తావు లేకుండా పోలీసు అధికారులు చర్యలు తీసుకోవాలని పదే పదే మౌఖిక ఆదేశాలు ఇస్తూ వచ్చారు.

**ప్రజలకు అసౌకర్యం కలగకుండా సమర్ధవంతంగా పనిచేయాలి :** కొత్తమ్మ తల్లి ఉత్సవాలకు ఎటువంటి నిధుల సమస్య లేదని, ముఖ్యంగా క్షేత్ర స్థాయిలో పారిశుధ్య పనులు, తాగునీటి ఏర్పాటు, అత్యవసర సేవలకు సంబంధించి అంబులెన్స్ సర్వీసులు, ఫైరింజన్ సర్వీసులు ఉంచాలని అన్నారు. స్వచ్ఛంద సేవా సంస్థల సహకారంతో తాగునీరు పంపిణీకి ఏర్పాటు చేయాలని, క్యూ లైన్ల క్రమబద్ధీకరణకు కూడా స్వచ్ఛంద సేవా సంస్థల కార్యకర్తలను పోలీసు వర్గాలకు అనుసంధానంగా ఉంచి, భక్తులకు ఇబ్బంది రాకుండా చూడాలని అన్నారు. ఎక్కువ సేపు క్యూలైన్లలో భక్తులు నిరీక్షించకుండా ఉండేందుకు తగు ఏర్పాట్లు చేస్తూ, అమ్మవారి దర్శనం సుగమం అయ్యేందుకు ఉన్న అన్ని అవకాశాలూ ముందుగానే పరిశీలించి అందుకు తగ్గ విధంగా పోలీసు యంత్రాంగం పనిచేయాలని ఆదేశాలు ఇచ్చారు.

**సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణకు అధిక ప్రాధాన్యత :** జిల్లా అధికారులంతా పరస్పర సమన్వయంతో పనిచేసి మూడు రోజుల పాటు జరగనున్న ఉత్సవాలను పకడ్బందిగా నిర్వహించాలని సూచించారు. అలానే ఉత్సవాలలో భాగంగా మన సంస్కృతినీ, కళా వైభవాన్నీ చాటే విధంగా శోభాయాత్రను నిర్వహిద్దామని అన్నారు. వీటితోపాటు సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణ, గ్రామీణ క్రీడా పోటీల నిర్వహణ కు సంబంధించి అన్ని ఏర్పాట్లూ చేయాలని, సంబంధిత సమాచారాన్ని ఎప్పటికప్పుడు ప్రజలకు వివిధ సామాజిక మాధ్యమాల ద్వారా చేరవేయాలని సూచించారు, అదేవిధంగా ఎప్పటికప్పుడు పరిసరాలు పరిశుభ్రంగా ఉండే విధంగా చర్యలు చేపడుతూ, ఉత్సవం అన్నది మరోసారి, ఇంకోసారి చరిత్రలో నిలిచిపోయే విధంగా ఉండాలని ఆకాంక్ష వ్యక్తం చేశారు. అలానే ఎక్కడికక్కడ వైద్య బృందాలు ఏర్పాటు చేయాలని, వృద్ధులకూ, వికలాంగులకూ, చిన్నారులకూ, గర్భిణులకూ ఏ ఇబ్బంది రాకుండా చర్యలు చేపట్టి, వివిధ విభాగాల అధికారుల పరస్పర సమన్వంతో పనిచేయాలని పిలుపు ఇచ్చారు.

# యువతలో నైపుణ్యాభివృద్ధి పై అవగాహనా సదస్సు రేపే



**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్) :** యువతలో నైపుణ్యాభివృద్ధి, ఆత్మవిశ్వాసం పెంపొందించేందుకు ఉచిత శిక్షణ తరగతులపై రెండవ అవగాహనా సదస్సు రేపు (21వ తేదీ ఆదివారం) ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు గుంటూరు మెడికల్ కాలేజీ ఎదురుగా ఉన్న ఎన్జీవో హెూంలో జరగనుంది. ఈ విషయాన్ని గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ తెలిపారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పోటీ పరీక్షలు...యుపిఎస్సి, ఎపిపిఎస్సి, ఎస్ఎస్సి, ఆర్ఆర్బి, ఎస్బిఐ తదితర పరీక్షలకు సంబంధించిన సిలబస్‌పై ఆరు నెలల పాటు ఉచిత శిక్షణ అందించనున్నట్లు తెలిపారు. శిక్షణకు సంబంధించిన షెడ్యూల్, అర్హతలు, రిజిస్ట్రేషన్ వివరాలు సదస్సులో విశదీకరించనున్నట్లు చెప్పారు.

సెప్టెంబర్ 8వ తేదీ నుంచి రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభమైందని, అవగాహనా సదస్సులో పాల్గొన్న వారు అప్పటికప్పుడు రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని తెలిపారు. మొదటి మరియు రెండవ సదస్సుల్లో రిజిస్ట్రేషన్ చేసుకున్న అభ్యర్థులందరికీ ఈనెల 28న ఆన్‌లైన్ ప్రవేశ పరీక్ష నిర్వహిస్తామని తెలిపారు. ఆ పరీక్షలో ఉత్తీర్ణులైన వారిలో ఇంటర్ వరకు చదివినవారిని ఒక గ్రూప్‌గా, డిగ్రీ పైగా చదివినవారిని మరో గ్రూప్‌గా విభజించి, విజయదశమి రోజైన అక్టోబర్ 2వ తేదీ నుంచి గుంటూరు లక్ష్మీపురంలోని ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ క్యాంపు ఆఫీసులో ఉచిత నైపుణ్యాభివృద్ధి తరగతులు ప్రారంభం కానున్నట్లు చెప్పారు.

ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీలు అశోక్ బాబు, ఏఎస్ రామకృష్ణ, విజయసాధన కిషోర్, ఎన్నారై ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ తిలక్ బాబు, బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ బుచ్చిరాం ప్రసాద్, ఏపీఎన్ఆర్టీ సీఈవో డాక్టర్ వేమూరి రవి, కోచింగ్ అధ్యాపకులు తదితరులు పాల్గొననున్నట్లు తెలిపారు.

# అసెంబ్లీకి రావడానికి ఆంక్షలా?

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** శాసనసభకు వచ్చి ప్రజా సమస్యలపై మాట్లాడకుండా వైసిపి ఎమ్మెల్యేలతో మాజీ సిఎం వైఎస్ జగన్ ఇంట్లోనే శాసనసభను పెట్టుకుంటున్నారని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఎద్దేవా చేశారు. అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. జగన్ మాదిరిగా అసెంబ్లీకి రావడానికి ఆంక్షలు పెట్టే ప్రజా ప్రతినిధి ఎవ్వరూ ఇంత వరకు లేరని తెలిపారు. మొత్తం సభ్యుల్లో 10 శాతం సీట్లు కూడా రాని వారికి ప్రతిపక్ష హెూదా ఎలా ఇస్తామని ప్రశ్నించారు. ఇప్పుడు ప్రతిపక్ష హెూదా ఇస్తే తరువాత సిఎం హెూదా కూడా అడుగుతారని వ్యంగ్యంగా అన్నారు. స్పీకరుతో మాట్లాడి తగిన సమయం ఇప్పిస్తామని హామీ ఇచ్చారు. 1994లో అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 294 సీట్లకు గానూ 26 సీట్లు అంటే 10 శాతం కంటే తక్కువ వచ్చినా పి జనార్ధన్‌రెడ్డి హుందాగా అసెంబ్లీకి వచ్చారని గుర్తు చేశారు.

# మద్యం కుంభకోణం కేసులో ఎంపీ మిథున్‌రెడ్డి విచారణ



**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్) :** మద్యం కుంభకోణం కేసులో వైకాపా ఎంపీ మిథున్‌రెడ్డిని సిట్ విచారిస్తోంది. రెండు రోజుల కస్టడీకి తీసుకున్న సిట్.. శుక్రవారం ఉదయం రాజమహేంద్రవరం జైలు నుంచి విజయవాడకు తీసుకొచ్చింది. సిట్ కార్యాలయంలో అధికారులు ఆయన్ను విచారిస్తున్నారు. వివిధ అంశాలపై సమాధానాలు రాబట్టే ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ కేసులో ఏ4గా మిథున్‌రెడ్డి ఉన్నారు. కుంభకోణంలో ఆయన కీలకంగా వ్యవహరించినట్లు సిట్ గుర్తించిన విషయం తెలిసిందే. శనివారం కూడా మిథున్‌రెడ్డి విచారణ కొనసాగనుంది.

# విజిబుల్ పోలీసింగ్ ముమ్మరం




**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్) :** గుంటూరు జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్... చట్ట వ్యతిరేక కార్యకలాపాలను అరికట్టేందుకు పట్టు బిగించారు. విజిబుల్ పోలీసింగ్ కార్యక్రమాలను జిల్లా వ్యాప్తంగా ముమ్మరంగా అమలు చేస్తున్నారు. ప్రధాన కూడళ్లు, రద్దీ ప్రదేశాలు, వ్యాపార సముదాయాలు, ఆసుపత్రులు, బ్యాంకులు, ఇతర సున్నిత ప్రాంతాల్లో పోలీసులు పహారా కాస్తున్నారు. ప్రజల భద్రతకు భంగం కలగకుండా కఠిన చర్యలు తీసుకుంటున్నారు.

**వాహనాలపై ఆకస్మిక తనిఖీలు :** జిల్లాలో ప్రాముఖ్యమైన ప్రదేశాల్లో ఆకస్మిక వాహన తనిఖీలు నిర్వహిస్తున్నారు. వాహన దొంగతనాలు, గంజాయి మరియు ఇతర మాదక ద్రవ్యాల అక్రమ రవాణా అరికట్టేందుకు వాహనదారుల వివరాలు సేకరించి సాంకేతిక పరికరాల ద్వారా పరిశీలిస్తున్నారు.

**అనుమానితులపై నిఘా :** పోలీసులు పకడ్బందీగా నిర్బంధ తనిఖీలు నిర్వహిస్తూ అనుమానాస్పద వ్యక్తుల వేలిముద్రలు సేకరిస్తున్నారు. వాటిని పోలీస్ డేటాబేస్‌లో చెక్ చేసి గత నేరాలు ఉన్నవారిపై నిఘా పెట్టుతున్నారు.

**రౌడీషీటర్లపై ఉక్కుపాదం :** జిల్లాలో ఇప్పటికే రౌడీషీటర్లు, గంజాయి కేసుల నిందితుల కదలికలపై నిఘా కొనసాగుతోంది. శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారు, చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడే వారిపై ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్ష ఉండదని పోలీసులు హెచ్చరిస్తున్నారు.

# పుస్తకావిష్కరణ చేసిన శ్రీ వెంకటాద్రి స్వామి



**బ్రహ్మంగారిమఠం (జర్నలిస్ట్ ఫైల్) :** జగద్గురు శ్రీమద్విరాట్ పోతులూరు వీరబ్రహ్మేంద్ర స్వామి వారి మఠం నందు మఠాధిపతి నివాసములో శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వాముల వారి భక్తి,ముక్తి జ్ఞాన మార్గము అనే పుస్తకాన్ని శుక్రవారం ఆవిష్కరించిన శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి వారి మఠం పూర్వపు మఠాధిపతులు శ్రీ వీర భోగ వసంత వెంకటేశ్వర స్వామి వారి జ్యేష్ట పుత్రుడు శ్రీ వెంకటాద్రి స్వాముల వారు. ఈ కార్యక్రమంలో శ్రీ సిద్దయ్య గారి మఠం మఠాధిపతులు శ్రీ చిన్న సిద్దయ్య స్వాములవారు మరియు శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి వారి శిష్యులు పాల్గొన్నారు.

# ప్రపంచ పర్యాటక దినోత్సవ ప్రచారానికి ఫ్లాష్ మాబ్స్ నిర్వహణ

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా సెప్టెంబర్ 26,27,28 తేదీల్లో బాపట్ల జిల్లా సూర్యలంక బీచ్‌లో నిర్వహించే బీచ్ ఫెస్టివల్ కు వినూత్న ప్రచారం కల్పించేందుకు రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాల భాగస్వామ్యంతో వివిధ ప్రదేశాల్లో ఫ్లాష్ మాబ్స్ నిర్వహించేందుకు ఏపీటీడీసీ సన్నద్ధమైంది. టూరిజం అండ్ సస్టెయినబుల్ ట్రాన్స్ ఫార్మేషన్ థీమ్ తో పర్యాటకానికి ప్రచారంతో పాటు యువత ప్రతిభను ప్రదర్శించే వేదికలుగా ఈ ఫ్లాష్ మాబ్స్ నిలవనున్నాయి. సూర్యలంకతో పాటు విజయవాడ, తిరుపతి, రాజమండ్రి, గుంటూరు, హైదరాబాద్ లలో జనసంచారం ఎక్కువగా ఉన్న ప్రదేశాల్లో ఫ్లాష్ మాబ్స్ నిర్వహించి యువతలో ఉత్సాహం కలిగించడంతో పాటు రాష్ట్ర సాంస్కృతిక వైభవం, బాధ్యతాయుత పర్యాటకాన్ని ప్రదర్శించనున్నామని ఏపీటీడీసీ ఒక ప్రకటనలో పేర్కొంది. ఇప్పటికే ఎస్ఆర్ఎం, కేఎల్, ఆచార్య నాగార్జున యూనివర్సిటీలు ఫ్లాష్ మాబ్ లకు ధృవీకరించినట్లు స్పష్టం చేసింది. మరికొన్ని యూనివర్సిటీలు తమ ఆసక్తిని ప్రదర్శించాయని, ధృవీకరించాల్సిన అవసరముందని ఈ సందర్భంగా ఏపీటీడీసీ పేర్కొంది. ఫ్లాష్ మాబ్స్ లో పాల్గొన్న విద్యార్థులను సెప్టెంబర్ 27న వరల్డ్ టూరిజం డే రోజున సీఎం చంద్రబాబునాయుడు చేతుల మీదుగా సత్కరించనున్నామన్నారు. సుందరమైన సూర్యలంక బీచ్ ఫెస్టివల్ లో సందర్శకులకు వాటర్ స్పోర్ట్స్, బీచ్ సైడ్ గేమ్స్, హౌస్ బోట్ రైడ్స్, జీడిపప్పు తోటల సందర్శన, స్థానిక సీ ఫుడ్ వంటకాలు, బ్యాక్ వాటర్ ఎక్స్




ప్లోరేషన్స్ తో పాటు ఆహ్లాదకరమైన అనుభవాలు, సాంస్కృతిక కార్యక్రమాలు, సెలబ్రిటీల కచేరీలు, తాటికల్లు రుచి తదితర కార్యకలాపాల ద్వారా విభిన్న అనుభవాలను అందిస్తామని ఏపీటీడీసీ వెల్లడించింది. ఫ్లాష్ మాబ్‌లలో పాల్గొనడానికి ఆసక్తి ఉన్న విశ్వవిద్యాలయాల నిర్వాహకులు %జూతీ.ఓశీఎఐఅఅఖ్‌అశీఅ2023ఏస్త్ర-ఝఅశ్రీ.ఓశీఎ% కు తమ వివరాలు పంపించాలని ఏపీటీడీసీ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొంది. పర్యాటక శాఖ ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఈ వేడుకకు ఏపీ, తెలంగాణతో పాటు వివిధ రాష్ట్రాల నుండి సందర్శకుడు అధిక సంఖ్యలో పాల్గొనే అవకాశముందని అంచనా వేసింది. స్వర్ణాంధ్ర విజన్ 2047లో భాగంగా యువత ఆధ్వర్యంలో జరిగే ఈ కార్యక్రమాలు రాష్ట్రంలో సుస్థిర పర్యాటకాభివృద్ధితో పాటు స్థానిక సమూహాలను బలోపేతం చేస్తాయని ఏపీటీడీసీ వెల్లడించది. మరిన్ని అప్ డేట్స్ కోసం ఇన్ స్టాగ్రామ్ లోని ఏ%ఖుఅస్త్రతీఖుజూతీఖుఎవంష్ట్రశీబతీఅంఎ%ను ఫాలో అవ్వాలని సూచించింది.

# ఆర్టీసి ఉద్యోగుల బకాయిలు తక్షణమే చెల్లించాలి



**విశాఖపట్నం(జర్నలిస్ట్ ఫైల్):** ఆర్టీసీ ఉద్యోగుల బకాయిలు, పెండింగ్ సమస్యలపై ఏపీ పిటిడి (ఆర్టీసి) ఎంప్లాయిస్ యూనియన్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. ప్రభుత్వ హామీలు ఇంకా అమలు కాలేదని రాష్ట్రాధ్యక్షులు పలిశెట్టి దామోదరరావు, ప్రధానకార్యదర్శి జి.వి.నరసయ్య స్పష్టం చేశారు. విశాఖపట్నం అల్లిపురం సిపిఐ కార్యాలయంలో విజయనగరం జోన్ నిర్మాణ మహాసభ జరిగింది. జోనల్ అధ్యక్షులు కె.జె.శుభాకర్ అధ్యక్షతన, కార్యదర్శి బాసూరి కృష్ణమూర్తి ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో పలిశెట్టి దామోదరరావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ – "ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను మరచిపోరాదు. 12వ పిఆర్సీ కమిషన్ ఏర్పాటు చేయకపోవడం, ఐఆర్ ప్రకటించకపోవడం, 11వ పిఆర్సీ బకాయిలు, డిఏలు, రిటైర్డు ఉద్యోగుల గ్రాట్యూటీ, లీవ్ ఎన్ క్యాష్‌మెంట్ చెల్లింపులు నిలిపివేయడం ఉద్యోగులలో తీవ్ర అసంతృప్తి కలిగిస్తున్నాయి" అన్నారు.

ప్రధాన కార్యదర్శి జి.వి.నరసయ్య మాట్లాడుతూ – "2020లో ఆర్టీసి విలీనం తర్వాత రిటైర్డు ఉద్యోగుల మెడికల్ స్కీమ్ నిలిపివేయడం బాధాకరం. కొత్తగా జారీ చేసిన జి.ఓ అమలులో ఆలస్యం వల్ల రిటైర్డు ఉద్యోగులు ఔషధాలు, వైద్య సదుపాయాల కోసం ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యను వెంటనే పరిష్కరించాలి" అని డిమాండ్ చేశారు.

ఉపప్రధాన కార్యదర్శి పి.బానుమూర్తి – "అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు మేనిఫెస్టోలో వాగ్దానం చేసినట్లుగానే సంక్షేమ పథకాలు వర్తింపజేయాలి. వేతనాలను చట్టప్రకారం పెంచాలి. ఆన్‌కాల్ డ్రైవర్లకు భద్రత కల్పించి, డబుల్ డ్యూటీకి సమాన పారితోషికం ఇవ్వాలి" అని కోరారు.

రాష్ట్ర కార్యదర్శులు చింతాడ వెంకట్రావు, నందమూరి రామారావు – "10 వేల లోపు పెన్షన్ పొందుతున్న రిటైర్డు ఉద్యోగులకు రేషన్ కార్డులు మంజూరు చేయాలి. మహిళా ఉద్యోగినులకు రెండు సంవత్సరాల చైల్డ్ కేర్ లీవ్ ఇవ్వాలి" అని డిమాండ్ చేశారు.

ఈ సమావేశంలో విజయనగరం జోన్ ఇ.యు కొత్త కమిటీని ఎన్నుకున్నారు. స్టీల్ సిటి డిపోకు చెందిన కె.శ్రీనివాసరావు జోనల్ అధ్యక్షుడిగా, పాలకొండ డిపోకు చెందిన బాసూరి కృష్ణమూర్తి జోనల్ కార్యదర్శిగా, సింహాచలం డిపోకు చెందిన కె.యస్.యస్.మూర్తి జోనల్ కోశాధికారిగా ఎన్నికయ్యారు. వీరితో పాటు మరో తొమ్మిది మంది కార్యవర్గ సభ్యులు కూడా ఎన్నికయ్యారు.


# తొలి ప్రయత్నం లోనే రెండు ఉద్యోగాలకు ఎంపిక

**కాకుమాను, (జర్నలిస్ట్ ఫైల్):**ఆడపిల్ల పుడితే భారమని భావించకుండా

కూలి పనులు చేస్తూ తాము పడుతున్న కష్టాలు తమ పిల్లలు పడకూడదనే తపనతో ఎన్నో వ్యయప్రయాసలను ఓర్చి తమ కూతురిని ఉన్నత చదువులు చదివించారు .తల్లి తండ్రుల కష్టాల కన్నీళ్ల ను ఆనంద భాష్పాలు గా మార్చిన ఓ తరుణి ...

వివరాలలోకి వెళితే కాకుమాను మండల పరిదిలోనీ కొండపాటూరు గ్రామానికి చెందిన చింతా.సుబ్బారావు, అన్నమ్మ ల కు ఇద్దరు కుమార్తెలు ప్రథమ కుమార్తె సునీత చిన్న నాటి నుండి చదువు పై ఉన్న ఆసక్తిని గమనించి తాము పడుతున్న కష్టాలు తమ తరువాతి తరం పడకూడదనుకొని సునీత ను ఉన్నత చదువులు చదివించారు. తల్లి తండ్రుల ఆశలను వమ్ము చేయకుండా సునీత బీఎస్సీ, బి ఈ డి,ఎం సి ఏ విద్యనభ్యసించారు.

అనంతరం ప్రకాశం జిల్లా తాటి వారిపాలెం కు చెందిన మద్దుమల.శ్రావణ్ తో వివాహం జరిపించారు. భార్య భర్తలు ఇరువురు ప్రభుత్వ కొలువు కొరకు ప్రయత్నాలు చేస్తూ ప్రైవేట్ సెక్టార్



లో ఉద్యోగాలు చేస్తూ ఇటీవల ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం నిర్వహించిన డీఎస్సీ లో మొదటి సారిగా ప్రయత్నం చేయగా ఎస్ ఏ మేథమేటిక్స్, టీ జి టి మ్యాథ్స్ రెండు పోస్టులకు ఎంపికయినట్లు తెలిపారు. తొలి ప్రయత్నం లోనే ప్రభుత్వ ఉద్యాగానికి ఎంపికవడం పట్ల కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

**కుటుంబ సభ్యుల ప్రోత్సాహం తోనే:చింతా. సునీత :** భావి భారత పౌరుల బంగారు భవిష్యత్ ను తీర్చిదిద్దే అవకాశం ఒక్క టీచర్ కు మాత్రమే ఉంటుందని తో ఈ కెరీర్ ను ఎంపిక చేసుకున్నట్లు తెలిపారు.

తొలి ప్రయత్నం లోనే రెండు ఉద్యోగాలు సాధించడం పట్ల తమ కుటుంబ సభ్యుల ప్రోత్సాహం మరువలేనిది అని చింతా. సునీత తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తనను తొలి నుండి తమ తల్లి తండ్రులు,చెల్లెలు,భర్త శ్రావణ్ ,అత్త మామ లు తనకు ఎంతగానో సహకరించారన్నారు. తాను పోటీ పరీక్షలు కు ప్రతిభ కనబరచడం లో సన్నద్దమవడం కొరకు తన భర్త తోడ్పాటు మరువలేనిదని తెలియజేశారు.

# అగ్రి "ఏడి" హఠాత్మరణం పట్ల మంత్రి ఫరూక్ దిగ్భ్రాంతి



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** నంద్యాల వ్యవసాయ శాఖ ఏడిగా పని చేస్తున్న బండారి ఆంజనేయ(58) శుక్రవారం తె ల్ల వా ర ు జా మ ు న హఠాత్మరణం చెందడం పట్ల రాష్ట్ర న్యాయ మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ మేరకు అసెంబ్లీ సమావేశాల సందర్భంగా అమరావతిలో ఉన్న మంత్రి ఫరూక్ విడుదల చేసిన ప్రకటనలో సంతాపం వ్యక్తం చేశారు. విధి నిర్వహణలో సౌమ్యుడుగా, వివాదరహితుడిగా, వ్యవసాయ ఉద్యోగుల సంఘంజిల్లా అధ్యక్షుడిగా ఉన్న ఆంజనేయ రెండు నెలల క్రితమే బదిలీపై వచ్చి నంద్యాల డివిజన్ ఏడిగా విధులు నిర్వహిస్తున్నారు. అనారోగ్య సమస్యలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆంజనేయ మృతి చెందడం ఎంతో బాధాకరమని మంత్రి ఫరూక్ సంతాపం వ్యక్తం చేశారు. వ్యవసాయ శాఖలో మంచి ఉద్యోగిగా పేరు సంపాదించుకున్న ఆంజనేయ మృతి తో, అతని సేవలు నంద్యాల ప్రాంత రైతులకు దూరం కావడం మనోవేదనకు గురయ్యానని మంత్రి ఫరూక్ పేర్కొన్నారు. ఆంజనేయ కుటుంబ సభ్యులు మనోధైర్యంతో ఉండాలని, ప్రభుత్వ పరంగా ఆంజనేయ కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామని మంత్రి ఫరూక్ సంతాపం వ్యక్తం చేశారు.

# నిర్ధేశించిన సమయంలోపు కట్టడాలకె బిపిఎస్ వర్తిస్తుంది



**తెనాలి,(జర్నలిస్ట్ ఫైల్)** పురపాలక సంఘ, భవన నిర్మాణ చట్టం ప్రకారం,పట్టణ పరిధిలో గృహ నిర్మాణాలు నిబంధనకు లోబడే జరగాలని, అందుకు భిన్నంగా గృహ నిర్మాణాలు చేపడితే, గతంలో మాదిరిగా చూస్తూ ఊరుకోలేమని, చర్యలు కఠినంగా ఉంటాయని మున్సిపల్ కమిషనర్ పి శ్రీకాంత్ పేర్కొన్నారు. మున్సిపల్ కార్యాలయంలోని కమీషనర్ చాంబర్ లొ, శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కమిషనర్ పి శ్రీకాంత్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అక్రమ భవన నిర్మాణాలను కట్టడి చేయడం లక్ష్యంగా, రాష్ట్ర వ్యాప్తంగా స్పష్టమైన నిర్ణయాలను అమలు చేయనుందని చెప్పారు. ఇందుకోసం బిపిఎస్ చట్టాన్ని తీసుకురానుందని తెలిపారు. 2025 ఆగస్టు 31 లోపున, అక్రమ భవన నిర్మాణాలు చట్టానికి సక్రమ పద్ధతులకు మార్చుకునేందుకు,

బిపిఎస్ ద్వారా అవకాశముందని అన్నారు, 31 ఆగస్టు తరువాత ఎటువంటి అక్రమ భవన కట్టడాలు చేస్తున్నా ,వాటిపై తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఆ కట్టడాలు బిపిఎస్ పరిధిలోకి రావన్నారు. పట్టణంలోని గృహ నిర్మాణదారులు భవన నిర్మాణ నిబంధనలకు, లోబడి నిర్మాణాలు చేపట్టాలని, అందుకు భిన్నంగా నిర్మాణాలు చేపట్టే వారిపై, చర్యలు కఠినంగా ఉంటాయన్నారు. పురపాలక సంఘ అధికారులు గతంలొ మాదిరిగా లోపాయకారిగా వ్యవహరించి, అక్రమ కట్టడాలపై,చర్యలు తీసుకోని పక్షంలొ, టౌన్ ప్లానింగ్ విభాగం,ఎ1,గా, మున్సిపల్ కమీషనర్ ఎ2 గా, పురపాలక సంఘ చట్టం ద్వారా ప్రభుత్వం చర్యలు తీసుకునేందుకు సిద్ధం కానుందని అన్నారు. టౌన్ ప్లానింగ్ విభాగం ఎసిపి వాణి మాట్లాడుతు రాష్ట్ర ప్రభుత్వం పట్టణ పరిధిలో గృహ నిర్మాణాల కార్యచరణ పై స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. అనుమతులు లేని లేఅవుట్లను, క్రమబద్ధీకరించే దిశగాఎల్ఆర్ఎస్, స్కీం ద్వారా, జూన్ ముప్పై, రెండువేల ఇరవైఐదు, లోపు అక్రమ లేఅవుట్లు, సక్రమానికి అవకాశం ఉంటుందని, ఆతరువాత ఏర్పాటు చేసే అక్రమ లేఔట్లకు వర్తించదన్నారు. అదేవిధంగా పట్టణంలో అవసరం నిమిత్తం వేసే ఫ్లెక్సీలు, ఆ కార్యక్రమం ముగిసిన వెంటనే ఫ్లెక్సీలు,వేసినవారె, స్వచ్ఛందంగా తొలగించాలని కోరారు. మున్సిపల్ సిబ్బంది తొలగించే సమయంలో సహకరించాలని కోరారు. మీడియా సమావేశంలో, ఎంహెచ్ఓ ఏసుబాబు, టౌన్ ప్లానింగ్ విభాగం సిబ్బంది ఉన్నారు.

# పిల్లలకు సురక్షిత నగరంగా హైదరాబాద్

## 'క్లాప్ ఫర్ చిల్డ్రన్' పోస్టర్‌ను ఆవిష్కరించిన మంత్రులు సీతక్క, పొన్నం



**హైదరాబాద్, సెప్టెంబరు 19(జర్నలిస్ట్‌ఫైల్):** హైదరాబాద్‌లో 'క్లాప్ ఫర్ చిల్డ్రన్- పిల్లల భద్రత కోసం నగరస్థాయి కార్యాచరణ ప్రణాళిక'ను తెలంగాణ ప్రభుత్వం, యూనిసెఫ్ సంయుక్తంగా ప్రారంభించింది. పిల్లలకు హైదరాబాద్‌ను సురక్షిత నగరంగా మార్చుతామని మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క, రవాణా, బీసి శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రకటించారు. క్లాప్ ఫర్ చిల్డ్రన్ పోస్టర్‌ను సచివాలయంలో గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ, హైదరాబాద్‌ను 'పిల్లలకి సురక్షిత నగరం'గా తీర్చిదిద్దడానికి కృషి చేస్తుందని.. ఇతర నగరాలు, రాష్ట్రాలకు ఆదర్శంగా ఉండేలా హైదరాబాద్‌ను తీర్చిదిద్దామన్నారు. ఈ ప్రయత్నంలో యూనిసెఫ్ సంస్థకు పూర్తి సహకారం అందిస్తామని వెల్లడించారు. ఈ ప్రణాళిక ద్వారా ప్రభుత్వ విభాగాలు, చట్టపరమైన సంస్థలు, సమాజం కలిసి పిల్లలు సురక్షితంగా, ఆరోగ్యంగా ఎదగడానికి కృషి చేయనున్నారు. చట్టపరమైన సంస్థలు, ఫ్రంట్‌లైన్ సేవలను బలోపేతం చేసి, మహిళా శిశు సంక్షేమ, పోలీసు, ఆరోగ్యం, విద్య, కార్మిక, జీహెచ్ఎంసి వంటి విభాగాల సమ న్వయంతో బుల్లీయింగ్, ఈవ్‌టీజింగ్, అసురక్షిత రవాణా, మాదకద్రవ్యాల వినియో గాన్ని నివారించడానికి చర్యలు చేపడతారు. బాలల రక్షణ సెల్‌లు, విజిలెన్స్ కమిటీల ద్వారా డేటా ఆధారిత మానిటరింగ్ జరుగుతుంది. అలాగే ఫ్రంట్‌లైన్ వర్కర్లకు, పిల్లలకు అనుకూలమైన, శిక్షణ ఇవ్వ నున్నారు. ఈ కార్యక్రమంలో మహిలా శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి శ్రీమతి అనితా రామచంద్రన్, యూనిసెఫ్ చీఫ్ ఆఫ్ ఫీల్డ్ ఆఫీస్ డా. జెలాలెం బిర్హాను టాఫెస్సే తదితరులు పాల్గొన్నారు.

# ఇంటర్ విద్యార్థిపై కాలేజీ ఫ్లోర్ ఇన్‌చార్జి దాడి

## మలక్‌పేట్ పోలీసులకు విద్యార్థి తల్లిదండ్రులు ఫిర్యాదు



పోలీస్‌స్టేషన్ ముందు నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థి కుటుంబసభ్యులు

**హైదరాబాద్ (మలక్‌పేట), సెప్టెంబరు 19 (జర్నలిస్ట్‌ఫైల్):** దిల్‌షుక్‌నగర్ గడ్డిఅన్నారం నారాయణ జూనియర్ కళాశాలలో ఇంటర్ ఎంపీసీ మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థిపై ఫ్లోర్‌ఇన్‌చార్జ్ దాడి చేయడంతో విద్యార్థి ఎడమ దవడ ఎముక విరిగిన సంఘటన మలక్ పేట పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు, బాధిత విద్యార్థి కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. అల్మాస్ గుడా ప్రాంతానికి చెందిన డి. సంతోష్ కుమార్ కుమారుడు దొంతిక సాయి పునీత్ దిల్‌షుక్‌నగర్ గడ్డిఅన్నారం నారాయణ జూనియర్ కళాశాలలో ఎంపీసీ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. ఈనెల 15వ తేదీ మధ్యాహ్నం మూడు గంటల 15 నిమిషాల సమయంలో ఇద్దరు విద్యార్థుల మధ్య జరిగిన వాగ్వాదం విషయంలో ఫ్లోర్ ఇంచార్జ్ మాలి సతీష్ జోక్యం చేసుకొని సాయి పునీత్ పై దాడి చేసి కొట్టడంతో సాయి పునీత్ ఎడమ దవడ ఎముక విరిగి పోయింది. సంఘటన గురించి కళాశాల నిర్వహాకులు తమకు తెలియ జేయలేదని, తమ కుమారుడు సాయిపునిత్ సంఘటన గురించి తమకు చెప్పడంతో దాడి గురించి తమకు తెలిసిందని విద్యార్థి తల్లిదండ్రులు పేర్కొ న్నారు. సంఘటన గురించి కళాశాల మేనేజ్మెంట్ నిర్లక్ష్యంగా వ్యవహరించిందని విద్యార్థి తల్లిదండ్రులు ఆరోపించారు. ఈ సంఘటన గురించి చర్యలు తీసుకోవాలని విద్యార్థి తల్లిదండ్రులు మలక్ పేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. విద్యార్థి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని మలక్ పేట ఇన్స్పెక్టర్ పిడమర్తి నరేష్ పేర్కొన్నారు.

# బస్తీల అభివృద్ధికి సమన్వయంతో పనిచేయాలి

## అభివృద్ధి కాలనీలకే పరిమితం కావొద్దు

## దిశ సమావేశంలో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి




సమావేశంలో మాట్లాడుతున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, చిత్రంలో హరిచందన తదితరులు

**హైదరాబాద్ (జూబ్లీహిల్స్), సెప్టెంబరు 19 (జర్నలిస్ట్‌ఫైల్):** హైదరాబాద్ అంటే జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, హైటెక్ సిటీ కాదని, నిజమైన హైదరాబాద్ బస్తీల్లో ఉందని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి అన్నారు. బస్తీలు, మురికివాడల్లో ఇంకా పేద ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వాటి పరిష్కారం కోసం అధికారులు ప్రణాళికలు రూపొందించి సమన్వయంతో పని చేయాలన్నారు. జూబ్లీహిల్స్‌లోని ఎంసీఆర్‌హెచ్ ఆర్డీలో గురువారం హైదరాబాద్ జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ(దిశ) సమావేశం గురు వారం కిషన్‌రెడ్డి అధ్యక్షతన జరిగింది. జీహెచ్ఎంసీ పరిధిలో అమలవుతున్న కేంద్ర ప్రభుత్వ, కేంద్ర సహాయక పథకాలు(సీఎస్ఎస్), ప్రాజెక్టుల అమలు స్థితిపై సమీక్షించారు. గత దిశ సమావేశం తరువాత తీసుకున్న చర్యలపై నివేదికలను పరిశీలించి పురోగతిని సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర పథకాలను సమయానుకూలంగా, సమర్థవంతంగా అమలు చేయాలని, శాఖల మధ్య సమన్వయం ముఖ్యమన్నారు. నగరంలో నిధుల కొరత ఉన్నప్పటికి లభ్యమవుతున్న నిధులను సమర్థవంతంగా వినియోగవించుకొని అభివృద్ధి చేయాలన్నారు. నగరంలో చిన్నపాటి వర్షం కురిసినా రోడ్లు జలమయమై ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. నాంపల్లిలో ఇద్దరు, హాస్టళ్లపై దృష్టి సారించి సమస్యలు పరిష్కరించాలన్నారు. తెలంగాణ ఏర్పడిన అనంతరం నగర అభివృద్ధికి నిధుల కొరత ఏర్పడిందన్నారు. సంక్షేమం, మౌలికసదుపాయాలు, అభివృద్ధి, విద్య తదితర అంశాలపై దిశా సమా వేశంలో చర్చించినట్లు స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఎంపీ ఈటల రాజేందర్, హైదరాబాద్ జిల్లా కలెక్టర్ హరి చందన, వివిధ శాఖల ప్రతి నిధులు, సీనియర్ అధికారులు పాల్గొ న్నారు. సనత్‌నగర్‌లో ఒక యువకుడు నాలాలో కొట్టుకు పోవడం దుర దృష్టకరమని అన్నారు. పార్లమెంటు సభ్యులు, ఎమ్మెల్యేలతో అన్ని శాఖల అధికారులు కలిసి పనిచేసి హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్‌ను పెంచాలన్నారు. పాఠశాలలు, సామాజిక భవ నాలు, అంగన్‌వాడీ కేంద్రాలు,

# మాదకద్రవ్యాల నివారణ అందరి బాధ్యత

## ప్రభుత్వ ఆసుపత్రుల్లో నాణ్యమైన వైద్యం : మంత్రి జూపల్లి

**హైదరాబాద్, సెప్టెంబరు 19(జర్నలిస్ట్‌ఫైల్):** యువత జీవితాలకు ప్రమాదకరంగా మారిన మాదకద్రవ్యాల నివారణ సమాజంలో అందరి బాధ్యత అని రాష్ట్ర పర్యాటక, ఆబ్కారీ, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. హైదరాబాద్‌లోని హిమాయత్ నగర్‌లో గల మఖ్దూమ్ భవన్‌లోని రాజ్ బహదూర్ గౌర్ హాల్లో గురువారం తెలంగాణ రాష్ట్ర ప్రజానాట్య మండలి నిర్వహించిన మాదకద్రవ్యాల వల్ల కలిగే ప్రమాదాల గురించి ప్రజలకు అవగాహన కల్పించేందుకు కళారూపాల వర్క్‌షాప్‌ను మంత్రి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ తెలంగాణ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఈటి నరసింహ, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కలవేణి శంకర్, సిపిఐ ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎస్ ఛాయాదేవి, సమితి సభ్యులు మరుపాక అనిల్ కుమార్, హైదరాబాద్ జిల్లా కార్యదర్శి బి స్టాలిన్, ప్రజానాట్య మండలి రాష్ట్ర అధ్యక్షులు కె శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి పల్లె నరసింహ, ఉపాధ్యక్షులు కె లక్ష్మీ నారాయణ తోపాటు కళాకారులూ పాల్గొన్నారు. మంత్రి మాట్లాడుతూ తెలంగాణ ప్రజా నాట్య మండలి నాటక బృందం మాదక ద్రవ్యాల నివారణ, అవగాహన కల్పించడానికి రాష్ట్రంలోని అన్ని విశ్వవిద్యాల యాలు, కళాశాలలు, పాఠశాలల వద్ద తమ కళారూపాలను ప్రదర్శించడం అభినందనీయమన్నారు. కార్పొరేట్ ఆసుపత్రులకు ధీటుగా ప్రభుత్వ ఆసుపత్రులను అన్ని వసతులు, సౌకర్యాలతో నాణ్యమైన వైద్యాన్ని అందిస్తున్నామని తెలిపారు.

# సామాజిక ఉద్యమంగా వనమహోత్సవం

## జిల్లాల వారీగా లక్ష్యాలపై ప్రిన్స్‌పల్ సెక్రటరీ అహ్మద్‌నదీమ్ సమీక్ష

**హైదరాబాద్, సెప్టెంబరు 19(జర్నలిస్ట్‌ఫైల్):** అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ఆదేశాల మేరకు 2025సంవత్సర వన మహోత్సవం కార్యక్రమాన్ని సామాజిక ఉద్యమంగా సాగుతుంది. జిల్లాలు, డిపార్టుమెంట్లవారీగా మొక్కలు నాటడంపై గురువారం సచివాలయంలోని అటవీశాఖ మంత్రి ఛాంబర్‌లో ఉన్నతాధికారులు సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశాన్ని అటవీ, పర్యావరణ శాఖ ప్రిన్స్‌పల్ సెక్రటరీ అహ్మద్ నదీమ్, పీసీసీఎఫ్ సువర్ణ నిర్వహించగా, అన్ని విభాగ అధికారులు పాల్గొన్నారు. ఇప్పటివరకు మొక్కలు నాటిన ప్రాంతాలకు జీయో టాగింగు పూర్తనట్టు గుర్తించారు. ఈ సంవత్సరం 18.03 కోట్ల మొక్కలు టార్గెట్ పెట్టుకోగా... 13.84 కోట్ల మొక్కలు ప్లాంటేషన్ పూర్తి చేసినట్టు వివరించారు. 77 శాతం టార్గెట్ పూర్తి చేసినట్టు స్పష్టం చేశారు. అయితే, తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా పచ్చదనాన్ని మరింత విస్తరింప చేయాలన్న లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ఏడాది మొక్కలు పెంచే కార్యక్రమాన్ని వన మహోత్సవం పేరిట చేపడుతున్న విషయం తెలిసిందే. అటవీ అధికారులు సిద్ధం చేసిన పీపీటీనీ ప్రిన్స్‌పల్ సెక్రటరీ, పీసీసీఎఫ్ వీక్షిం చారు. సమగ్రంగా వివరాలు అడిగి తెలుసు కున్నారు. అన్ని డిపార్టుమెంట్లలో ఈ మొక్కలు నాటుతున్నప్పుడు ఎదరవుతున్న ఇబ్బందులను ఉన్నతాధికారుల దృష్టి వచ్చింది. అయితే, గత ఏడాది అనుభవాల ఆధారంగా మరింత పక్కాగా ఏర్పాట్లు చేయాలని సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా అటవీ విస్తీర్ణాన్ని పెంచేందుకు వన మహోత్సవం కింద పకడ్బందీ కార్యచరణ రూపొందిం చాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో.. అన్ని మండలాలు, గ్రామాలు, మున్సిపాలిటీల్లో పెద్దఎత్తున మొక్కలు నాటేందుకు సన్నద్ధం అవ్వాలని ఆదేశించారు. ఈ సారి 100 శాతం మనం పెట్టుకున్న టార్గెట్ రీచ్ కావాలని మంత్రి సురేఖ ఆదేశించిన విషయాన్ని అధికారులు గుర్తు చేశారు.

# 30న సద్దుల బతుకమ్మ రోజును సెలవుదినంగా ప్రకటించాలి

## సిఎస్‌కు టిజిఎంప్లాయిస్ జెఎసి విజ్ఞప్తి

**హైదరాబాద్, సెప్టెంబరు 19(జర్నలిస్ట్‌ఫైల్):** సద్దుల బతుకమ్మ పండుగైన సెప్టెంబరు 30న సెలవు దినంగా ప్రకటించాలని తెలంగాణ ఎంప్లాయిస్ జేఏసి డిమాండ్ చేసింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె కృష్ణారావుకి టిజిఈజేఏసి గురువారం వినతిపత్రం సమర్పించింది. తెలంగాణ రాష్ట్రంలో ప్రతి సంవత్సరం మహిళలు సద్దుల బతుకమ్మ పండుగను పెద్ద ఎత్తున జరుపుకుంటారని అందుకే ఈ నెల సెప్టెంబర్ 30న జరిగే సద్దుల బతుకమ్మ పండుగ రోజును సెలవుదినంగా ప్రకటించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణ రావుని టిజిఈజేఏసి చైర్మన్ మారం జగదీశ్వర్ జేఏసి నేతలతో కలిసి కోరారు.

# రెండు ఆటోలు ఢీ

## భూత్పూరు వద్ద ఘోరప్రమాదం

## ముగ్గురు మృతి, పలువురికి గాయాలు

**భూత్పూర్, సెప్టెంబరు 19(జర్నలిస్ట్‌ఫైల్):** మహాబూబ్‌నగర్ జిల్లా భూత్పూర్ మండలం కొత్తమొల్గర గ్రామ శివారులో గురువారం ఘోర రొడ్డు ప్రమాదం జరిగింది. రెండు ఆటోలు పరస్పరం ఢీకొన్న సంఘటనలో ముగ్గురు అక్కడికక్కడే మృతి చెందగా మరో నలుగురికి తీవ్రగాయా లయ్యాయి. భూత్పూర్ పోలీస్ ఎస్సై చంద్రశేఖర్ తెల్పిన వివరాల ప్రకారం ఖిల్లాఘన్‌పూర్ నుంచి భూత్పూర్‌కు ఐదుగురు ప్రయాణీకులతో వస్తున్న టీజీ 32టీ 2284 నెంబరు గల ఆటో, మహబూబ్‌నగర్ నుంచి కూల్ డ్రింక్స్ లోడ్‌తో నాగర్‌కర్నూల్ వైపు వెళ్లే మరో ఆటో పర స్పరం ఢీకొన్నాయి.

ప్రమాదంలో ఐదుగురు ప్రయాణీకులతో ఖిల్లాఘన్‌పూర్ నుంచి భూత్పూర్ వైపు వస్తున్న ఆటోలో ప్రయాణించే ఖిల్లా ఘన్‌పూర్ గట్టుకాడిపల్లికి చెందిన గుంపల్లి వంశీ (24), ఇదే మండలం దొంతికుంటతండాకు చెందిన పాత్లావత్ సక్రి(33), భూత్పూర్ మండలం పోతుల మడుగుకు చెందిన చౌదరి నర్సింహారెడ్డి (56) మృతి చెందారు. ఇరువురు వంశీ, నర్సింహారెడ్డి అక్కడికక్కడే మృతి చెందగా, మరో మహిళ పాత్లావత్ సక్రి తలకు బలమైన గాయాలతో ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై చంద్రశేఖర్ తెలిపారు.

# రోడ్డు భద్రతలో ట్రాఫిక్ పోలీసుల పాత్ర కీలకం

## హైదరాబాద్ సిటీ సెక్యూరిటీ కౌన్సిల్ సదస్సును ప్రారంభించిన గవర్నర్ జిష్ణుదేవ్

**హైదరాబాద్ (బేగంపేట), సెప్టెంబరు 19 (జర్నలిస్ట్‌ఫైల్):** పిల్లలు పాఠశాల నుంచి సురక్షితంగా ఇంటికి చేరాలన్నా, రోగులు సమయానికి ఆస్పత్రికి చేరాలన్నా, ప్రజలు ఒత్తిడి లేకుండా ప్రయాణించాలన్నా ట్రాఫిక్ పోలీసుల పాత్ర ఎంతో కీలకమని గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ అన్నారు. గురువారం నెక్లెస్‌రోడ్డులోని జలవిహార్‌లో హైదరాబాద్ సిటీ పోలీసు సంయుక్తంగా నిర్వహించిన ట్రాఫిక్ రోడ్డు భద్రతా సమ్మిట్ 2025ను గవర్నర్ జిష్ణుదేవ్ ముఖ్య అతిధిగా పాల్గొని ప్రారంచారు. ఈ సమ్మిట్ రెండు రోజులుపాటు జరగనుంది. సమ్మి ట్‌లో నగరంలోని ట్రాఫిక్ నిపుణులు, పరిశ్రమ ప్రముఖులు, విద్యావేత్తలు తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని గవర్నర్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ ప్రమాదాలకు దూరంగా ఉండాలన్నారు. ప్రజలు, ప్రభుత్వ భాగస్వామ్యంగా హెచ్‌సీఎస్‌సీ ఇతర నగరాలకు ఆదర్శంగా నిలుస్తుందన్నారు. విద్యాసంస్థలు ఇతరులు ట్రాఫిక్ విభాగానికి సహకరించాలని కోరారు. నగర పోలీసు కమిషనర్ సివి ఆనంద్ మాట్లాడుతూ నగరంలో రోజు రోజుకు పెరుగుతున్న వాహనాలతో ట్రాఫిక్ కు అంతరాయం లేకుం డా ఉండేందుకు చేపట్టా ల్సిన అన్ని రకాలైన ముందస్తు జాగ్రత్త చర్యలు ఎప్పటి కప్పుడు చేపడుతున్నట్లు ఆయన పేర్కొ న్నారు. 92లక్షల వాహ నాలు, రోజుకు 1500కొత్త వాహనాలు రోడ్లపై ప్రయాణిస్తున్నాయ న్నారు. ట్రాఫిక్ నిర్వహణ నగర భద్ర తకు కీలకమని ఆయన అన్నారు. ప్రజల సహకారంతో ఎప్పటి కప్పుడు ట్రాఫిక్‌లో మార్పులు చేసుకుంటూ ప్రజలు, వాహన దారులకు ఇబ్బందులు రాకుండా చూసు కుంటు న్నామన్నారు. ప్రజల సహకారాన్ని పోలీసుల తరుపున అభినందిస్తున్నా మన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ సీపీ విక్రమ్ సింగ్‌మాన్, జాయింట్ సీపీ జోయల్ డేవిస్, హెచ్‌సీఎస్‌సీ ట్రాఫిక్ ఫోరం జాయింట్ సెక్రటరీ వి.రాజశేఖరరెడ్డి, ట్రాఫిక్, ఎల్అండ్‌ఓ విభాగాల అన్ని డీసీపీలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.



రోడ్డు భద్రతా సదస్సును ప్రారంభిస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ

# మైనారిటీ గురుకులాల్లోని టీచర్లకు వేతనాలు చెల్లించాలి

## కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉపాధ్యాయులను పర్మనెంట్ చేయాలి

## రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య డిమాండ్

**హైదరాబాద్ (సైఫాబాద్), సెప్టెంబరు 19 (జర్నలిస్ట్‌ఫైల్):** మైనారిటీ గురుకులాల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన పది నెలల వేతనం తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేస్తూ వందలాది మంది ఉపాధ్యాయులు గురు వారం నాడిక్కడ మైనార్టి గురుకుల కార్యాలయా న్ని ముట్టడించారు. బిసి సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, బిసి విద్యార్థి సం ఘం రాష్ట్ర అధ్యక్షుడు వేముల రామకృష్ణ ఆధ్వర్యంలో జరిగిన ఈ ముట్టడి కార్యక్రమంలో పాల్గొన్న టీచర్స్ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. అక్కడే మొహరించిన పోలీసులు ఈ ముట్టడిని అడ్డుకునేందుకు ప్రయ త్నించారు. దీంతో పోలీసులకు వ్యతిరేకంగా టీచర్స్‌కు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. కొద్ది సేపు ఉద్రిక్తత వాతావరణ ఏర్పడింది. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిధిగా పాల్గొన్న రాజ్యసభ సభ్యుడు, జాతీయ బిసి సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య టీచర్స్, పోలీసులను శాంతింప జేశారు. ఈ సందర్భంగా ఆర్.కృష్ణ య్య, పిజిఆర్‌టి రాష్ట్ర అధ్యక్షుడు వేమ్‌రెడ్డి దిలీప్‌రెడ్డి, ఎస్‌టియు అధ్యక్షుడు సదానందం మాట్లాడుతూ మైనార్టి గురుకులాల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్-ఔట్‌సోర్సింగ్ టీచర్లను పర్మినెంట్ చేయాలని, ఏడాదికి 12 నెలలకు వేతనాలు చెల్లించాని డిమాండ్ చేశారు. ఈ కాంట్రాక్ట్ టీచర్లకు రెగ్యులర్ టీచర్లకు ఉండే అన్ని అర్హతలు ఉన్నాయని, పోస్టులకు తగు బిఇడి, డిఇ విద్యార్హత ఉందని, నోటిఫికేషన్ ద్వారా, మేరిట్ కమ్ రోస్టర్ ద్వారా ఈ మేరకు ఎంపిక చేయడం జరిగిందన్నారు.

# సాంస్కృతిక శాఖ డైరెక్టర్‌గా ఏనుగు నరసింహారెడ్డి బాధ్యతలు స్వీకరణ



పదవీ బాధ్యతలు స్వీకరిస్తున్న డా. ఏనుగు నరసింహారెడ్డి, ఆచార్య నిత్యానందరావు, డా. ఎన్.బాలాచారి తదితరులు

**హైదరాబాద్ (రవీంద్రభారతి), సెప్టెంబరు 19 (జర్నలిస్ట్‌ఫైల్):** రాష్ట్ర భాషా సాంస్కృతికశాఖ సంచాలకుడుగా డా. ఏనుగు నరసింహారెడ్డి గురువారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు మహబూబ్‌నగర్ అదనపు కలెక్టర్ (రెవెన్యూ)గా పనిచేస్తున్న ఆయనను ప్రభుత్వం నిన్ననే సంచాలకుడుగా నియ మిస్తూ జీఓ విడుదల చేసింది. రెండు సంవ త్సరాలపాటు డిప్యుటేషన్ ప్రాతిపదికన నియమితులైన నరసింహారెడ్డి గురువారం రవీంద్రభారతి ప్రాంగణం కళాభవన్‌లోని భాషా సాంస్కృతికశాఖ కార్యాలయంలో సంబంధిత పత్రాలపై సంతకం చేశారు. తెలంగాణ రాష్ట్రం ఆవిర్భావం తర్వాత ఏర్పాటు చేసిన తెలంగాణ సాహిత్య అకాడమీలో తొలి ఛైర్మన్ డా. నందిని సిధారెడ్డితో కలిసి, తొలి కార్యదర్శిగా పనిచేసిన డా. ఏనుగు నరసింహారెడ్డి, ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన ప్రపంచ తెలుగు మహాసభలు విజయవంతం కావడానికి విశేష కృషిచేశారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర సాంస్కృతిక, పర్యాటక, ఎక్సైజ్‌శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు నరసింహారెడ్డికి పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. పదవీ బాధ్యతలు స్వీకరించిన వెంటనే సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షుడు ఆచార్య వెలుదండ నిత్యానందరావు, తెలంగాణ సాహిత్య అకాడమీ కార్యదర్శి డా. నామోజు బాలాచారిలతో పాటు పలువురు ప్రముఖులు, సాహిత్యవేత్తలు, సాంస్కృతిక సంస్థల ప్రతినిధులు, రవీంద్రభారతి, సాంస్కృతికశాఖ సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

# తహాశీల్దార్ కార్యాలయంలో ఎసిబి దాడులు

## లంచం కేసులో పట్టుబడిన ఇద్దరు అధికారులు

**వనపర్తి క్రైమ్, సెప్టెంబరు 19(జర్నలిస్ట్‌ఫైల్):** ఏసీబీ వలలో రెవెన్యూ అధికారులు ప్రభుత్వ ఉద్యోగుల్లో అవినీతి ఆగడాలు ఆపడానికి ఏసీబీ కఠిన చర్యలు కొనసాగిస్తోంది. ప్రతి రోజూ ఎక్కడో ఒకచోట లంచగొండి అధికారులు పట్టుబడుతున్నా, అవినీతి ఆగకపోవడం విచారకరం. తాజాగా వనపర్తి జిల్లా కొత్తకోట మండలంలోని తాహాసిల్దార్ కార్యాలయంలో ఏసీబీ దాడులు నిర్వహించి, రెవెన్యూ విభాగానికి చెందిన ఇద్దరు అధికారులను అదుపులోకి తీసుకున్నారు. మహబూబ్‌నగర్ జిల్లా ఏసీబీ డీఎస్పీ బాలకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం వనపర్తి జిల్లా కొత్తకోట మండలంలోని నిర్విన్ గ్రామానికి చెందిన రైతుకు చెందిన ఇనాం భూమి రద్దు కోసం వనపర్తి ఆర్డిఓకు దరఖాస్తు చేసుకున్నారు. దరఖాస్తును వనపర్తి ఆర్డిఓ కార్యాలయం నుండి సంబంధిత మండలం కొత్తకోట తహసిల్దార్ కార్యాలయానికి పంపించారు. ఆర్డిఓ ఆదేశాల మేరకు కొత్తకోట మండల తహసిల్దార్ ఆ కార్యాల యంలోని ఎంఆర్ఐ వాసు అదేవిధంగా డిప్యూటీ సర్వేయర్ నవీన్ రెడ్డిలకు దరఖాస్తును పరిశీలించాలని సూచించారు. దరఖాస్తును పరిశీలించిన అధికారులు అనుకూలంగా వివరణ అందించేందుకు రూ. 40,000 డిమాండ్ చేయగా రైతు ఎసిబిని ఆశ్రయించాడు. ఏసీబీ బృందం లింగస్వామి, జిలాని, కిషన్ నాయక్ లతో గురువారం కొత్తకోట మండల కార్యాలయంలో సంబంధిత అధికారులను విచారణ చేపట్టారు. కేసు నమోదు చేసి శుక్రవారం కోర్టులో హాజరు పరచనున్నట్టు తెలిపారు.



# సిఎం రేవంత్‌రెడ్డితో ఎన్వీఎస్ రెడ్డి భేటీ

**హైదరాబాద్, సెప్టెంబరు 19(జర్నలిస్ట్‌ఫైల్):** రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు (పట్టణ రవాణా)గా బాధ్యతలు స్వీకరించిన ఎన్వీఎస్ రెడ్డి గురువారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. సీఎంకు పుష్ప గుచ్ఛం ఇచ్చి కృతజ్ఞతలు తెలిపారు. నగర రవాణా వ్యవస్థను మరింత మెరుగుపరచడానికి తగు సలహాలు ఇవ్వవలసిందిగా ముఖ్యమంత్రి ఎన్వీఎస్ రెడ్డికి సూచించారు.

# ఎస్‌సి గురుకుల విద్యార్థులు జాతీయస్థాయిలో ప్రతిభ చాటేలా ప్రణాళికలు రూపొందించాలి

## గురుకుల కార్యదర్శి కృష్ణఆదిత్యకు మంత్రి అడ్లూరి లక్ష్మణ్ సూచన

**హైదరాబాద్, సెప్టెంబరు 19(జర్నలిస్ట్‌ఫైల్):** ఎస్‌సి గురుకుల సొసైటీ నూతన కార్యదర్శిగా ఇంటర్ విద్య డైరక్టర్ కృష్ణ ఆదిత్య గురువారం అదనపు బాధ్యతలు స్వీకరించారు. మాసబ్‌ట్యాంక్‌లోని డిఎస్ఎస్ భవన్‌లో బాధ్యతలు స్వీకరించారు. అనంతరం సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌ని సచివాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గురుకులాలపై మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ నూతన కార్యదర్శికి పలు సూచనలు చేశారు. మంత్రి మాట్లాడుతూ... గురుకుల విద్యాలయాల విద్యా ర్థులు జాతీయ స్థాయిలో ప్రతిభ చాటుకునేలా ప్రత్యేక ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. ఉపాధ్యాయులు, సిబ్బంది సమన్వయంతో విద్యా ర్థులకు స్నేహపూర్వక వాతావరణం కల్పించాలనీ, ప్రతి విద్యార్థి ఉన్నత లక్ష్యాలను సాధించేందుకు ప్రోత్సహించే విధంగా అకడమిక్ కార్యక్రమాలు అమలు చేయాలని సూచించారు. విద్యా ప్రమాణాల పెంపు దిశగా కృషి చేయాలని ఆకాంక్షి ంచారు.

గురుకుల కార్యదర్శిగా అదనపు బాధ్యతలు స్వీకరించిన కృష్ణ ఆదిత్య.. సిబ్బందికి పలు సూచనలు చేశారు. విద్యార్థుల విద్యా ప్రగతి, శిక్షణా ప్రమాణాల పెంపుపై మరింత దృష్టి సారించాలన్నారు. ప్రతి ఉద్యోగి తాను నిర్వహిస్తున్న బాధ్యతను సమగ్రంగా నిర్వర్తించాలని, పరి పాలనలో పారదర్శకత, క్రమశిక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ప్రతి ఒక్కరూ సమయ పాలనను కచ్చితంగా పాటించాలని స్పష్టం చేశారు.

# ముందు నీ పార్టీని చక్కబెట్టుకో

## జూబ్లీహిల్స్ ఉపఎన్నికల్లో దమ్ముంటే సత్తా చూపించు

## కెటిఆర్‌పై మంత్రి పొంగులేటి ధ్వజం



**ఏదులాపురం మున్సిపాలిటీ, 19(జర్నలిస్ట్‌ఫైల్):** నీకు విజన్ ఉందా? నీ నాన్నకు ఉందా తెలుసుకో కేటీఆర్ ... ముందు నీ ఇంటిని, నీ పార్టీని చక్కబెట్టుకో.. మూడున్నరేళ్ల తర్వాత వచ్చే ఎన్నికల్లో నువ్వు అమెరికాలో ఉంటావా.. ఇండియాలో ఉంటావా అన్నది కూడా రాష్ట్ర ప్రజలకు సందేహామే. దమ్ముంటే రానున్న జూబ్లీహిల్స్ ఉపఎన్నికల్లో మీ పార్టీ సత్తా చూపించండి" అంటూ తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి కేటీఆర్‌కు సవాల్ విసిరారు. గురువారం వరంగల్ క్రాస్ రోడ్‌లో కాంగ్రెస్ పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వివిధ పార్టీలకు చెందిన 80కుటుంబాలకు చెందిన వారు కాంగ్రెస్‌లో చేరగా వారికి మంత్రి స్వయంగా కండువా కప్పి ఆహ్వానం పలికారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభను ఉద్దేశించి మంత్రి పొంగులేటి మాట్లాడుతూ... రాష్ట్ర ప్రజలకు కాంగ్రెస్ పార్టీ చేసిన సేవలు ఎప్పటికీ మరవలేనివని గుర్తుచేశారు. బీఆర్ఎస్ పదేళ్ల పాటు ప్రజల కలలను ఛిద్రము చేసిందని మండిపడ్డారు. వారి హాయంలో ఒక లక్ష ఇళ్లు ప్రతి సంవత్సరం కట్టివుంటే, పది లక్షల పేద కుటుంబాలకు గృహాలు అందేవి. కానీ బీఆర్ఎస్ ప్రభుత్వం కాళేశ్వరం లాంటి ప్రాజెక్టుల కమీషన్లలో మునిగి పోయింది. పాము కొర్రల్లో విషం పెట్టుకున్నట్టే, వీరంతా ఒళ్ళంతా విషం నింపుకుని తిరుగుతున్నారని" ఘాటుగా విమర్శించారు. 2023లో జరిగిన ఎన్నికల్లో నీ నాయన పాలేరులో నన్ను ఓడించడానికి కంకణం కట్టుకుని తిరిగా కాంగ్రెస్ కార్యకర్తలు నన్ను భారీ మెజార్టీతో గెలిపించారని.. పార్టీ ముందు నువ్వెంత బచ్చాగాడివి.. అని మంత్రి పొంగులేటి హెద్దేవ చేశారు. వచ్చే ఎన్నికల్లో నువ్వు నిలబడతావా? నీ మీద బచ్చగాన్ని పెట్టి మళ్లీ పార్టీ గెలిపిస్తుందని కేటీఆర్‌కు సవాల్ చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ ప్రజలు బీఆర్ఎస్‌కు గట్టి బుద్ధి చెప్తారని, అసెంబ్లీ , లోక్ సభ ఎన్నికల్లోనే ప్రజలు వారిని పక్కన పెట్టేశారని మంత్రి వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో పేదలకు ఇళ్లు, సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులు కాంగ్రెస్ పార్టీ వచ్చాక జరుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి మద్దినేని బేబీ స్వర్ణకుమారి, టీపీసీసీ నాయకులు ధరావత్ రామ్మూర్తి నాయక్, బొర్రా రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



## దసరా ఉత్సవ ఏర్పాటులను పరిశీలించిన శాసనసభ్యులు సుజనా చౌదరి

విజయవాడ, సెప్టెంబర్ 19(జర్నలిస్ట్‌ఫైల్):

విజయవాడ దసరా ఉత్సవ ఏర్పాటులను పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు యలమంచిలి సత్యనారాయణ (సుజనా చౌదరి) గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెండింగ్ పనులను త్వరగా పూర్తి చేయాలని అధికారులు ఆదేశించారు.ఈ కార్యక్రమంలో దుర్గగుడి ఆలయ ఈవో వీకే శీనా నాయక్, జనసేన పార్టీ విజయవాడ ప్రచార కమిటీ కోఆర్డినేటర్ తిరుపతి సురేష్, కూటమి నేతలు పాల్గొన్నారు.

## టాఫిక్ రూల్స్ తో జీవితానికి రక్షణ

విజయవాడ పశ్చిమ, సెప్టెంబరు 19(జర్నలిస్ట్‌ఫైల్):



రహదారి ప్రయాణాల్లో ట్రాఫిక్ నియమాలు పాటించడం వల్ల ప్రజా జీవితానికి రక్షణ కలుగుతుందని మోటార్ వెహికల్ ఇన్ స్పెక్టర్ ఎం.డి. అలీ అన్నారు. రాష్ట్ర రవాణాశాఖ సహకారంతో కెబిఎన్ కళాశాల ఎన్ ఎస్ ఎస్, గ్రంథాలయ విభాగం సంయుక్త నిర్వహణలో గురువారం 'ట్రాఫిక్ రూల్స్' గురించి విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న అలీ మాట్లాడుతూ యువతరం ఉత్సాహంలో ట్రాఫిక్ నిబంధనలను అనేకవిధాలుగా ఉల్లంఘిస్తోందని, దీనివల్ల ఎందరో యువత ప్రాణాలు పోగొట్టుకుం టున్నారన్నారు. మితిమీరిన వేగం వల్ల వాహనం నడిపిన వారితో పాటు అమాయకులైన పాదచారులు కూడా ప్రమాదాల బారిన పడుతున్నారని చెప్పారు. వివిధ ట్రాఫిక్ నిబంధనల గురించి ఉదాహరణలతో వివరిస్తూ, నిబంధనలు పాటించే విషయంలో విద్యార్థులను చైతన్యపరిచారు. సబ్ ఇన్ స్పెక్టర్ ఆఫ్ పోలీస్ ట్రాఫిక్ నిబంధనలు పాటించడంతో పాటు యువతరం సమాజంలో ట్రాఫిక్ నిబంధనల పట్ల అవగాహన పెంచాలన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ జి.కృష్ణవేణి మాట్లాడుతూ తెల్లరేషన్ కార్డు ఉన్న మహిళలకు తమ కళాశాలలో ఉచితంగా స్కూటీ డ్రైవింగ్ శిక్షణ తరగతులు నిర్వహించడంతో పాటు, ట్రాఫిక్ నిబంధనల గురించి అవగాహన తరగతులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. హిందూ హై స్కూల్స్ కమిటీ పరిపాలనాధికారి డాక్టర్ వి.నారాయణరావు, గ్రంథాలయాధికారి శ్రీనివాసరాజు, ఎన్ ఎస్ ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ఎన్. సాంబశివరావు, వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ ఎం.వేంకటేశ్వరరావు, పి.ఎల్.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు కలెక్టరేట్‌లో డా. బోయి భీమన్న జయంతి ఉత్సవాలు

విజయవాడ, సెప్టెంబర్ 19(జర్నలిస్ట్‌ఫైల్):

రాష్ట్ర సృజనాత్మకత, సంస్కృతి సమితి ఆధ్వర్యంలో ఈనెల 19వ తేదీ శుక్రవారం ఎన్టీఆర్ జిల్లా కలెక్టరేట్ ప్రాంగణంలోని పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో ఉదయం 11.00 గంటలకు మహాకవి పద్మభూషణ్ డా. బోయి భీమన్న జయంతి సందర్భంగా అవార్డు ప్రదానోత్సవ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర సృజనాత్మకత, సంస్కృతి సమితి ముఖ్యకార్యనిర్వహణాధికారి ఆర్. మల్లికార్జునరావు ఒక ప్రకటనలో తెలిపారు.కార్యక్రమానికి పర్యాటక మరియు సాంస్కృతిక శాఖామాత్యులు కందుల దుర్గేష్, శాసన సభ్యులు, ఎన్టీఆర్ జిల్లా కలెక్టరు డా. జి లక్ష్మీశా, డా. బోయి భీమన్న సతీమణి హైమవతి తదితరులు ముఖ్య అతిథులుగా హాజరు కానున్నారన్నారు. కార్యక్రమంలో మంత్రి చేతుల మీదుగా, డా. బోయి భీమన్న పురస్కారాన్ని ప్రముఖ రచయిత డా. పూర్ణచందుకు ప్రదానం చేస్తారని, ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు, శాసన సభ్యులు, నామినేటెడ్ చైర్మన్లు, ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు కార్యక్రమానికి హాజరవు తారన్నారు. కార్యక్రమంలో భాగంగా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని రాష్ట్ర సృజనాత్మకత, సంస్కృతి సమితి ముఖ్య కార్యనిర్వహణ అధికారి ఆర్.మల్లికార్జునరావు తెలిపారు.

## ఉద్యోగులకు ఇచ్చిన హామీలు అమలులో పూర్తిగా విఫలం




ఇబ్రహీంపట్నం, సెప్టెంబర్ 19(జర్నలిస్ట్‌ఫైల్):

అధికారంలోకి వచ్చిన వెంటనే మెరుగైన పి.ఆర్.సి ఇస్తామని, ఉపాధ్యాయులకు బోధనేతర పనులు నుంచి విముక్తి కలిగిస్తామని చెప్పి, అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని పూర్తిగా విస్మరించడం బాధాకరం అని ఎస్టీయు ఎన్టీఆర్ జిల్లా ప్రధాన కార్యదర్శి గార్లపాటి అనుగ్రహ ప్రసాద్ అన్నారు. ఇబ్రహీంపట్నం మండల సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా మండలంలోని వివిధ పాఠశాలలకు వెళ్లి ఉపాధ్యాయుల సమస్యలు తెలుసుకోవడం జరిగింది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఈనెల 22 నుంచి దసరా సెలవులు ఇవ్వాలని, పెండింగ్ బకాయిలు వెంటనే చెల్లించాలని,భోధనేతర పనులు నుంచి మినహాయింపు ఇవ్వాలని కోరారు..ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి ఎమ్. బసవయ్య, జిల్లా ఉపాధ్యక్షులు కె. శ్యామ్ ప్రసాద్ మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు గోపాల కృష్ణ, ప్రమీల రాణి ఆర్థిక కార్యదర్శి బి. అమర్ ఉపాధ్యక్షులు బివి. కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# రాజకీయాలకతీతంగా సేవలు







- పేదల వైద్యానికి సీఎం సహాయ నిధి భరోసా
- విజయవాడ పశ్చిమ ఎమ్మెల్యే సుజనా చౌదరి

విజయవాడ, సెప్టెంబర్ 19(జర్నలిస్ట్‌ఫైల్):

పేద కుటుంబాలకు, అత్యవసర వైద్యానికి ముఖ్యమంత్రి సహాయనిధి ఎంతో భరోసాగా నిలుస్తోందని విజయవాడ పశ్చిమ ఎమ్మెల్యే సుజనా చౌదరి తెలిపారు. భవాని పురం ఎన్డీఏ కార్యాలయంలో పశ్చిమ నియోజకవర్గంలోని 18 మంది లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి కింద మంజూరైన చెక్కులను గురువారం సుజనా చౌదరి,గారు జనసేన పార్టీ నాయకురాలు తిరుపతి అనూష అందజేశారు. రూ 14 లక్షల 48 వేలను అందించినట్లు ఎమ్మెల్యే సుజనా తెలిపారు. ఆర్థికంగా, బలహీనంగా ఉన్న రోగులకు, పేద వర్గాలకు సీఎం సహాయనిధి ఎంతో ఉపయోగపడుతుందన్నారు. రాజకీయాలకతీతంగా , అవినీతికి తావు లేకుండా సీఎం సహాయనిధి చెక్కులను అందజేస్తున్నామని ఎమ్మెల్యే సుజనా చౌదరి తెలిపారు. పశ్చిమ ప్రజలకు ఎల్లవేళలా సేవలందించడానికి ఎన్డీఏ కార్యాలయం సిద్ధంగా ఉందని భరోసానిచ్చారు..ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్ , ఆర్య వైశ్య మహా సభ గౌరవాధ్యక్షుడు పెనుగొండ సుబ్బారాయుడు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బొమ్మసాని సుబ్బారావు,టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఎమ్ ఎస్ బేగ్,జనసేన పార్టీ ఆంధ్రా జోన్ కన్వీనర్ బాడిత శంకర్, జనసేన పార్టీ ప్రచార కమిటీ కో ఆర్డినేటర్ తిరుపతి సురేష్ , కార్పొరేటర్లు బుల్లా విజయ్ కుమార్, గుడివాడ నరేంద్ర రాఘవ, మరుపిళ్ళ రాజేష్ , అత్తలూరి ఆదిలక్ష్మి పెద్దబాబు,కూటమి నేతలు తిరుపతి అనూష, పైలా సురేష్, అవ్వారు బుల్లబ్బాయి, పచ్చి పులుసు శివప్రసాద్, రెడ్డిపల్లి రాజు, అబ్దుల్ ఖాదర్ , ఏలూరి సాయి శరత్, నున్న కృష్ణ, పగడాల కృష్ణ,డాక్టర్ సీ హెచ్ హనుమంతరావు, పీవీ చిన సుబ్బ య్య, అలుగుండ్ల సుబ్బారెడ్డి , గోళ్ళ విశ్వేశ్వరరావు, బడుగు వెంకన్న,చినబాబు, ఉమాకాంత్, వేవిన నాగరాజు, పొట్టి శ్రీహరి,మంగళపురి మహేష్ అజీజ్,బ్రహ్మారెడ్డి, సుజనా మిత్రా కోఆర్డినేటర్లు పాల్గొన్నారు.

# రెండు మండలాలను విజయవాడలో కలపండి

ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు

గన్నవరం, సెప్టెంబర్ 19(జర్నలిస్ట్‌ఫైల్):



తాగునీరు, చెత్త సమస్యతో తీవ్ర ఇబ్బందులు పడుతున్న గన్నవరం, విజయవాడ రూరల్ మండలాలను విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ లో విలీనం చేయాలని ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు ప్రభుత్వానికి కోరారు. గురువారం ప్రారంభమైన రాష్ట్ర శాసనసభ వర్షాకాల సమావేశాల్లో యార్లగడ్డ పలు సమస్యలను ప్రస్తావించారు. ప్రకాశం బ్యారేజీకి కూతవేటు దూరంలో ఉన్న గన్నవరం నియోజకవర్గంలోని విజయవాడ రూరల్ మండలం లో ఉన్న తొమ్మిది గ్రామాల ప్రజలు తాగునీటికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఈ తొమ్మిది గ్రామాల్లోని నీటిలో టీడీఎస్ (టోటల్ డిజాల్వ్ సాలిడ్స్ ) 2 వేల నుండి 3 వేల వరకు ఉందని ఈ నీటిని తాగునీటి అవసరాలకు వినియోగించడం సురక్షితం కాదన్నారు. ఈ గ్రామాలకు తాగునీటి అందించేందుకు విజయవాడ రూరల్ మండలం అంబాపురం గ్రామంలో రూ.2500 కోట్లతో చేపట్టిన పథకం వల్ల ఏమాత్రం ప్రయోజనం లేదన్నారు. దీనికి ప్రత్యామ్నాయంగా కరెన్సీ నగర్ వరకు ఉన్న తాగునీటి పైపులైను ను ముందుకు పొడిగిస్తే ఈ గ్రామాల ప్రజలకు తక్కువ ఖర్చుతో కృష్ణానది నీటిని అందించవచ్చని యార్లగడ్డ సూచించారు. విజయవాడ నగర ప్రజలతో సమానంగా పన్నులు చెల్లిస్తూ సరైన వసతులు లేక ఈ తొమ్మిది గ్రామాల్లోని ప్రజలు ద్వితీయ శ్రేణి పౌరులుగా జీవించాల్సి వస్తుందని ఎమ్మెల్యే వెంకట్రావ్ ఆవేదన వ్యక్తం చేశారు. అదేవిధంగా చెత్త సమస్య రోజురోజుకీ తీవ్ర రూపం దాలుస్తుందని దీని పరిష్కారం కోసం గన్నవరం నియోజకవర్గం విజయవాడ రూరల్ మండలంలోని తొమ్మిది గ్రామాలను, గన్నవరం మండలాన్ని విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ లో విలీనం చేయాలని శాసనసభ ద్వారా సంబంధిత మంత్రికి యార్లగడ్డ విజ్ఞప్తి చేశారు. ఏళ్ళ తరబడి ఒకే చోట పనిచేస్తున్న పిఏసిఎస్ కార్యదర్శులను బదిలీ చేయాలని గత అసెంబ్లీ సమావేశాల్లో కోరితే ఇంతవరకు స్పందించలేదని వీరిని బదిలీ చేసే ఆలోచన ప్రభుత్వానికి ఉందా లేదా అని సూటిగా ప్రశ్నించారు. విజయ డయిరీ బాపులపాడు మండలంలో నిర్మించిన కామధేను ప్లాంట్లో జరిగిన అక్రమాలకు సంబంధించిన ఆధారాలను ఇప్పటికే ప్రభుత్వానికి అందజేసి విచారణ కోరితే విచారణ జరిపిస్తామని ఇచ్చిన హామీ అమలు చేయలేదని విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకుంటారా లేదా అని యార్లగడ్డ నిలదీశారు.

# అసెంబ్లీ సాక్షిగా అబద్ధాలా?

- దమ్ముంటే కరేడుకు రండి
- కరేడు రైతులు స్వచ్ఛంధంగా భూములు ఇస్తున్నారా?
- కరేడు ఊరు పేరు కూడా పలకలేని మంత్రికి రైతుల ఉద్యమం కనిపించకపోవడం బాధాకరం
- ఇవే మాటలు అసెంబ్లీలో కాదు కరేడులో అని చూడండి... రైతుల రియాక్షన్ ఎలా ఉంటుందో
- కరేడు భూముల వ్యవహారంపై మంత్రి అనగాని సత్యప్రసాద్ వ్యాఖ్యలకు కౌంటర్ ఇచ్చిన రామచంద్రయాదవ్

అమరావతి, సెప్టెంబర్ 19(జర్నలిస్ట్‌ఫైల్):



కరేడు భూ సేకరణపై శాసనమండలిలో మంత్రి అనగాని సత్యప్రసాద్ అన్నీ అబద్దాలే చెప్పారని బిసివై పార్టీ అధినేత రామచంద్రయాదవ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కనీసం కరేడు పేరు కూడా పలకలేని మంత్రి... భూములు ఇచ్చేందుకు రైతులు స్వచ్ఛందంగా ముందుకు వస్తున్నారంటూ అబద్దాలను వల్లె వేశారన్నారు. ఈ మేరకు రామచంద్రయాదవ్ గురువారం ఓ పత్రికా ప్రకటన విడుదల చేశారు. ఇండో సోల్ సోలార్ ప్రాజెక్టు కు భూములు ఇవ్వబోమని రైతులు ఉద్యమం చేస్తుంటే... రైతులే స్వచ్ఛందంగా భూములు ఇస్తున్నారని అబద్దాలు చెప్పడం దారుణమన్నారు. సెంటు భూమి కూడా ఇచ్చేది లేదని తెగేసి చెబుతున్నా... ప్రభుత్వమే బలవంతంగా భూములను లాక్కుంటోందని ఆరోపించారు. దమ్ముంటే కరేడుకు వెళ్లి అక్కడ రైతులతో మాట్లాడి నిజాలు తెలుసుకోవాలన్నారు. శాసనమండలిలో చేసిన వ్యాఖ్యలు కరేడులో చేయగలరా? అని సవాల్ విసిరారు. కరేడు రైతుల సమస్యలను చెప్పుకునేందుకు బిసివై పార్టీ తరుపున అపాయింట్ మెంట్ అడిగితే ఇప్పటి వరకు సిఎం స్పందించలేదన్నారు. ఇండో సోల్ సోలార్ ప్రాజెక్ట్ కు వైసిపి, టిడిపిలో దోచి పెట్టేందుకు పోటీలు పడుతున్నాయన్నారు. ఇప్పటికైనా ఎవరో రాసిచ్చిన స్క్రిప్ట్ లు చదవడం మానేసి క్షేత్ర స్థాయిలో రైతులు పడు తున్న కష్టాలను తెలుసుకోవాలని రామ చంద్రయాదవ్ ఆ ప్రకటనలో హితవు పలికారు.

# లాటరీ ద్వారా బార్ల కేటాయింపు

విజయవాడ, సెప్టెంబర్ 19(జర్నలిస్ట్‌ఫైల్):




ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మూడేళ్ల కాలానికి (01.09.2025 నుండి 31.08.2028 వరకు) ప్రకటించిన కొత్త బార్ పాలసీలో భాగంగా ఎన్టీఆర్ జిల్లాలో సాధారణ కేటగిరీ విభాగంలో 130 బార్లు, గీత కులాల వారికి ప్రత్యేకంగా 10 బార్లు కేటాయించడం జరిగింది. తొలి విడత నోటిఫికేషన్ లో భాగంగా ఓపెన్ కేటగిరీలో 69 బార్లు, గీత కులాలవారికి కేటాయించిన 10 బార్లు మొత్తం 79 బార్ల కేటాయింపు గతంలో పూర్తి అయ్యింది. ఎన్టీఆర్ జిల్లాలో ఓపెన్ కేటగిరీలో మిగిలిపోయిన 61 బార్ల కేటాయింపునకు ఈ నెల 3వ తేదీన మళ్ళీ గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేయడం జరిగింది. గడువు ముగిసే సమయానికి (17.09.2025) ఓపెన్ కేటగిరీలో ప్రకటించిన 61 బార్లకుగాను 7 బార్లకు మాత్రమే మొత్తం 28 దరఖాస్తులు వచ్చాయి. 54 బార్లకు ఒక్క అప్లికేషన్ కూడా రాలేదు. వీటిలో నిబంధనల ప్రకారం కనీసం 4 దరఖాస్తులు వచ్చిన 7 బార్ల కేటాయింపు ప్రక్రియ ముందే ప్రకటించిన విధంగా గురువారం ఉదయం 8.00 గం. నుంచి విజయవాడలోని ఎన్టీఆర్ జిల్లా కలెక్టరేట్ శ్రీ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో జరిగింది. జిల్లా ప్రొహిబిషన్ %డ% ఎక్సైజ్ అధికారి ఎస్.శ్రీనివాసరావు, దరఖాస్తుదారుల సమక్షంలో ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి.లక్ష్మీశ చే లాటరీ విధానంలో పారదర్శకంగా బార్లు కేటాయించడం జరిగింది. రెండవ విడత నోటిఫికేషన్ ద్వారా బార్ల కేటాయింపు పూర్తయిన తరువాత ఇంకా 54 బార్లు దరఖాస్తులు రాని కారణంగా ఆగిపోయాయి. తిరువూరు నగర పంచాయతీ పరిధిలో ఒక బారు, జగ్గయ్యపేట మున్సి పాలిటీ పరిధిలో ఒక బారు, కొండపల్లి మున్సిపాలిటీ పరిధిలో ఆరు బార్లు మరియు విజయవాడ నగర పరిధిలోని 46 బార్లు మిగిలిపోయిన వాటిలో ఉన్నాయి. విజేతలైన దరఖాస్తుదారులు అందరూ నిర్ణయించిన సాంవత్సరిక లైసెన్సు ఫీజులో 6వ వంతు సొమ్ము ప్రభుత్వానికి చలానా రూపంలో చెల్లించాలి.

# కుంభవృష్టితో ఉత్తరాఖండ్ అతలాకుతలం



## నాలుగు గ్రామాల్లో 30 ఇళ్లు పైగా ధ్వంసం
## 20 మందికి గాయాలు, 14 మంది గల్లంతు
## తృటిలో తప్పించుకున్న ఎంపి అనిల్ బలూనీ

**డెహ్రాడూన్, సెప్టెంబరు 19:** ప్రకృతి విలయంతో ఉత్తరాఖండ్ అల్లాడుతున్నది. చమోలి జిల్లాలో కొండచరియలు విరిగిపడ్డాయి. నాలుగు గ్రామాల్లో 30కు పైగా ఇళ్లు ధ్వంసమయ్యాయి. 20 మంది గాయపడగా 14 మంది గల్లంతయ్యారు. శిథిలాల కింద వారు చిక్కుకుని ఉంటారని అనుమానిస్తున్నారు.

గురువారం భారీ వర్షం కారణంగా వరదలు సంభవించాయి. దీంతో చమోలి జిల్లాలోని నాలుగు గ్రామాల్లో కొండ చరియలు విరిగిపడ్డాయి. 30కుపైగా ఇళ్లు ధ్వంసమయ్యాయి. ఈ నేపథ్యంలో సుమారు 20 మంది గాయపడ్డారు. 14 మంది జాడ కనిపించడంలేదు. దీంతో అదృశ్యమైన వ్యక్తులు శిథిలాల కింద చిక్కుకున్నట్లు అనుమానిస్తున్నారు.

కాగా, జాతీయ, రాష్ట్ర విపత్తు ప్రతిస్పందన దళాలు ప్రభావిత ప్రాంతాలకు చేరుకున్నాయని ఉత్తరాఖండ్ సిఎం పుష్కర్ సింగ్ ధామి తెలిపారు. సహాయక చర్యలు కొనసాగుతున్నా యని చెప్పారు. తలకు గాయమైన చిన్నారితో సహా తీవ్రంగా గాయపడిన వారిని హెలికాప్టర్ ద్వారా రిషికేశ్‌లోని ఎయిమ్స్‌కు తరలించినట్లు వివరించారు. ప్రభావిత ప్రాంతాల్లో పరిస్థితిని సమీక్షిస్తున్నట్లు వెల్లడించారు.

**తృటిలో తప్పించుకున్న బిజెపి ఎంపీ**

డెహ్రాడూన్ రోడ్డుపైనా కొండచరియలు విరిగిపడ్డాయి. అదే రహదారిపై కాన్వాయ్‌లో వెళ్తున్న బిజెపి ఎంపీ తృటిలో తప్పించుకున్నారు. ఆ రోడ్డుపై కొండచరియలు విరిగిపడిన వీడియో క్లిప్‌ను ఆయన షేర్ చేశారు. ఉత్తరాఖండ్‌లో ఈ సంఘటన జరిగింది. గర్వాల్ బిజెపి ఎంపీ అనిల్ బలూనీ చమోలి, రుద్రప్రయాగ్‌లోని వరద ప్రభావిత ప్రాంతాలను సందర్శించారు. ఆ తర్వాత రిషికేశ్‌కు వెళ్లిన ఆయన తన కాన్వాయ్‌లో తిరుగు ప్రయాణమయ్యారు. దేవ్ ప్రయాగ్ సమీపంలోని బద్రీనాథ్ జాతీయ రహదారిపై కొండచరియలు విరిగిపడటాన్ని బిజెపి ఎంపీ అనిల్ గమనించారు. వెంటనే తన కాన్వాయ్‌ను నిలిపివేశారు. వాహనం నుంచి దిగిన ఆయన మిగతావాహనదారులను అప్రమత్తం చేశారు. ఇంతలో భారీగా కొండచరియలు ఆ రహదారిపై విరిగిపడ్డాయి. ఇది చూసి బిజెపి ఎంపీ అనిల్ కూడా భయాందోళన చెందారు. అక్కడి నుంచి దూరంగా వెళ్లారు. తన వాహనాలను వెనక్కి మళ్లించారు. మరోవైపు బిజెపి ఎంపి ఈ భయానక అనుభవాన్ని సోషల్ మీడియాలో పంచుకున్నారు. ఈ వీడియో క్లిప్‌ను ఎక్స్‌లో షేర్ చేశారు. 'ఈ సంవత్సరం ఉత్తరాఖండ్‌లో సంభవించిన తీవ్రమైన వర్షాలు, కొండచరియలు విరిగిపడటం చాలా మందికి లోతైన గాయాలను మిగిల్చాయి. వాటిని నయం చేయడానికి చాలా సమయం పడుతుంది. నిన్న సాయంత్రం, విపత్తు ప్రభా విత ప్రాంతంలో కొండచరియలు విరిగిపడిన భయానక దృశ్యాన్ని మీ అందరితో పంచుకుంటున్నా' అని పేర్కొన్నారు. ఉత్తరాఖండ్ ఎదుర్కొంటున్న తీవ్రమైన ప్రకృతి వైపరీత్యం గురించి ఇది చాలా చెబుతుందని అనిల్ బలూనీ తెలిపారు. సవాల్‌తో కూడిన పరిస్థితుల్లో రోడ్లపై పేరుకుపోయిన కొండ చరియల శిథిలాలు తొలగిస్తున్నకార్మికుల అంకిత భావంతో పాటు అధికారులందరినీ అభినందిస్తున్నట్లు వెల్లడించారు.



# ఓట్ల తొలగింపు ఆన్‌లైన్‌లో అసాధ్యం

**అదంతా నిరాధార ప్రచారం: స్పష్టం చేసిన కేంద్ర ఎన్నికల సంఘం**

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 19:** సాఫ్ట్‌వేర్ వాడి ఓట్లను తొలగిస్తున్నారంటూ కాంగ్రెస్ ఎంపి రాహుల్ గాంధీచేసిన విమర్శలను కేంద్రఎన్నికల సంఘం ఖండించింది. అదంతా నిరాధార, అసత్య ప్రచారమని వెల్లడించింది. ఆన్‌లైన్ వేదికగా ఓట్లను తొలగించడం సాధ్యం కాదని స్పష్టం చేసింది. ఈమేరకు ఒక ప్రకటన విడుదల చేసింది. సంబంధిత వ్యక్తికి సమాచారం ఇవ్వ కుండా ఏ ఒక్కరిఓటు తొలగించడం లేదు. ఆన్ లైన్‌లో మరెవరూ తొలగించలేరు. 2023లో అలంద్ అసెంబ్లీ నియోజకవర్గంలో ఓటర్ల తొల గింపునకు విఫల ప్రయత్నాలు జరిగాయి. ఆ వ్యవహారంపై దర్యాప్తు కోసం ఎన్నికల సంఘమే ఫిర్యాదు చేసింది. రికార్డుల ప్రకారం అలంద్ అసెంబ్లీకి 2018లో జరిగిన ఎన్నికల్లో బిజెపి అభ్యర్థి విజయం సాధించారు. 2023లో కాంగ్రెస్ నేత బిఆర్ పాటిల్ గెలుపొందారు అని ఇసి వెల్లడించింది. రాహుల్ తప్పుడు సమాచా రాన్ని ప్రచారం చేస్తున్నారని బిజెపి దుయ్య బట్టింది. రాహుల్‌కు రాజ్యాంగం, చట్టం అర్థం కావడంలేదు. 2014 నుంచి మోడీజీ సాధిస్తున్న విజయాలన్నీ నిజం కాదని ఆయన ఆరోపిస్తు న్నారు. ఈ వ్యాఖ్యలు దేశ ప్రజలకు, ఓటర్లకు అవమానం. ఆయన బాంబు గురించి మాట్లాడు తున్నారు. ఈ ప్రకటలను తీవ్రంగా ఖండిస్తున్నాను అని మాజీ కేంద్రమంత్రి రవిశంకర్ ఆగ్రహం వ్యక్తంచేశారు. హైడ్రోజన్ బాంబు పేలుస్తామని కాంగ్రెస్‌వాళ్లు అంటున్నారు. ఆ బాంబ్ ఇలాగే ఉంటుందా? వాళ్లు ఓటమిని చవిచూస్తున్నారు. ఈ సమయంలో వారు చేయాల్సింది దానిని అంగీకరించడం. కష్టపడి మీస్థాయికి వస్తామనేలా వారిమాటలుఉండాలి. అంతేకానీ దానికిబదులుగా వారు కోర్టుల జోక్యాన్ని కోరు కుంటున్నారు. లేకపోతే వేరొకరిపై నిందలు వేస్తున్నారు అని ఢిల్లీ మంత్రి మజీందర్ సింగ్ సిర్సా మండిపడ్డారు. బంగ్లాదేశ్, నేపాల్ తరహా అశాంతి భారత్‌లో సృష్టించాలని రాహుల్ భావిస్తున్నారని కమలం పార్టీ నేత అనురాగ్ ఠాకూర్ విమర్శించారు. రాహుల్‌నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ దాదాపు 90ఎన్నికల్లో ఓటమి చవిచూసిందని, దాంతో ఆయనఅసహనం రోజురోజుకూ పెరుగుతోందని ఎద్దేవా చేశారు. క్షమాపణలు కోరడం, కోర్టుమందలింపులు ఆయనకు పరిపాటిగా మారాయని అన్నారు.



## కష్టకాలంలో నేపాల్‌కు సంపూర్ణమద్దతు ఇస్తాం ప్రధాని సుశీల కర్కికి ప్రధాని మోడీ భరోసా

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 19:** కష్టకాలంలో ఉన్న పొరుగుదేశం నేపాల్‌కు భారత్ సంపూర్ణ మద్దతు ఇస్తుందని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ హామీ ఇచ్చారు. ఆ దేశ తాత్కాలిక ప్రభుత్వ నూతన ప్రధానిగా నియమితులైన సుశీల కర్కితో ఆయన ఫోన్‌లో మాట్లాడారు. ఈ సంభాషణ ఎంతో ఆత్మీయంగా, భరోసా ఇచ్చేదిగా జరిగిందని ప్రధాని మోదీ తెలిపారు. ఇటీవల నేపాల్‌లో జరిగిన నిరసనలు, సంభవించిన ప్రాణనష్టం పట్ల ప్రధాని మోదీ తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. ఈ క్లిష్ట సమయంలో నేపాల్‌కు అండగా నిలుస్తామని, అవసరమైన అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తామని ఆయన స్పష్టం చేశారు. నేపాల్‌లో శాంతి, స్థిరత్వాన్ని పునరుద్ధరించేందుకు సుశీల కర్కి చేస్తున్న ప్రయత్నాలకు భారత్ పూర్తి అండదండలు అందిస్తుందని ఆయన పునరుద్ఘాటించారు. ఈ సంభాషణ వివరాలను ప్రధాని మోదీ స్వయంగా 'ఎక్స్' వేదికగా వెల్లడించారు. "నేపాల్ తాత్కాలిక ప్రభుత్వ ప్రధాని సుశీల కర్కితో ఆత్మీయంగా మాట్లాడాను. ఇటీవల జరిగిన ప్రాణనష్టంపై నా ప్రగాఢ సానుభూతిని తెలియజేశాను. శాంతి, స్థిరత్వాన్ని నెలకొల్పే ఆమె ప్రయత్నాలకు మా సంపూర్ణ మద్దతు ఉంటుందని మరోసారి హామీ ఇచ్చాను" అని ఆయన తన పోస్టులో పేర్కొన్నారు. అదేవిధంగా, శుక్రవారం జరగనున్న నేపాల్ జాతీయ దినోత్సవాన్ని పురస్కరించుకుని సుశీల కర్కికి, నేపాల్ ప్రజలకు ప్రధాని మోడీ ముందుగానేశుభాకాంక్షలు తెలియజేశారు.

## పెన్సిల్వేనియాలో కాల్పులు.. ముగ్గురు పోలీసులు మృతి

**పెన్సిల్వేనియా (యుఎస్), సెప్టెంబరు 19:** అమెరికాలో మరోసారి కాల్పుల మోత మోగింది. పెన్సిల్వేనియాలో జరిగిన ఒకదారుణ ఘటనలో ముగ్గురు పోలీసు అధికారులు విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయారు. మరో ఇద్దరు అధికారులు తీవ్రంగా గాయపడ్డారు. గృహ హింసకు సంబంధించిన ఒక కేసు విచారణ కోసం వెళ్లిన వారిపై ఓ దుండగుడు కాల్పులకు తెగబడ్డాడు. ఈ ఘటనలో నిందితుడు కూడా హతమయ్యాడని అధికారులు తెలిపారు. పెన్సిల్వేనియాలోని కొడోరస్ టౌన్‌షిప్‌లో ఈ విషాదం చోటుచేసుకుంది. ఒక రోజు క్రితం ప్రారంభమైన కేసు విచారణలో భాగంగా పోలీసులు అక్కడికి వెళ్లారని స్టేట్ పోలీస్ కమిషనర్ క్రిస్టోఫర్ పారిస్ తెలిపారు. "ఇది గృహ హింసకు సంబంధించిన కేసు. విచారణలో భాగంగా వెళ్లిన అధికారులపై దాడి జరిగింది" అని ఆయన మీడియాకు వివరించారు.

## అన్ని మతాలను గౌరవిస్తా - చీఫ్ జస్టిస్ బిఆర్ గవాయ్

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 19:** నిజజీవితంలోనే కాకుండా వృత్తిపరంగా కూడా తాను అన్ని మతాలను గౌరవిస్తానని సిజెఐ బీఆర్ గవాయ్ పేర్కొన్నారు. ఖజురహో ఆలయ సమూహంలో ఉన్న విష్ణు దేవుడి విగ్రహానికి చెందిన వివాదంపై స్పందిస్తూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. యునెస్కో ప్రపంచ వారసత్వ సంపద ఖజురహో ఆలయ సమూహంలో ఉన్న జవారి టెంపుల్‌లో ఏడు అడుగుల విష్ణుమూర్తి విగ్రహం ఉన్నది. అయితే ఆ విగ్రహాన్ని ధ్వంసం చేశారని, దాని స్థానంలోమరో విగ్రహాన్ని ప్రతిష్ఠించాలని సుప్రీంకోర్టులో పిల్ వేశారు. ఆ పిల్‌పై మంగళవారం వాదనలు జరిగాయి. ఆ సమయంలో చీఫ్ జస్టిస్ బీఆర్ గవాయ్ వివాదాస్పద వ్యాఖ్యలు చేసినట్లు ఆరోపణలు వస్తున్నాయి. రాకేశ్ దలాల్అనేవ్యక్తి పిటీషన్‌వేశారు. మొఘల్ రాజులకాలంలో డ్యామేజ్ అయినవిగ్రహాన్ని తొలగించి కొత్తవిగ్రహాన్ని ఏర్పాటుచేయాలని కోరారు.

# డ్రగ్స్‌ఎక్కువ ఉన్న దేశాల్లో భారత్‌ను చేర్చిన అమెరికా!

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 19:** మాదకద్రవ్యాల ఉత్పత్తి, రవాణాకు ప్రధాన కేంద్రాలుగా ఉన్న దేశాల జాబితాను అమెరికా విడుదల చేసింది. అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అమెరికా కాంగ్రెస్‌కు సమర్పించిన అధికారిక నివేదికలో మొత్తం 23 దేశాల పేర్లను వెల్లడించారు. ఆందోళన కలిగించే విషయం ఏమిటంటే, ఈ జాబితాలో భారత్‌తో పాటు పొరుగు దేశాలైన చైనా, పాకిస్థాన్, ఆఫ్ఘనిస్థాన్, బర్మా కూడా ఉన్నాయి. తమ దేశంలోకి అక్రమంగా ప్రవేశిస్తున్న మాదకద్రవ్యాల ముప్పును ఎదుర్కొనేందుకు కట్టుబడి ఉన్నామని ట్రంప్ ఈ సందర్భంగా స్పష్టం చేశారు. ఈ జాబితాలో ఉన్న ఇతర దేశాలలో మెక్సికో, కొలంబియా, వెనిజులా, బొలీవియా, ఈక్వెడార్, పెరూ, పనామా, కోస్టారికా, జమైకా, లావోస్ వంటి దేశాలు ఉన్నాయి. అయితే, ఈ జాబితాలో ఒక దేశం పేరు ఉండటం అనేది ఆ దేశ ప్రభుత్వ వైఫల్యాన్ని సూచించదని అమెరికా తన నివేదికలో స్పష్టం చేసింది. భౌగోళిక, వాణిజ్య, ఆర్థిక కారణాల వల్ల కొన్ని దేశాలు మాదకద్రవ్యాల రవాణాకు అనుకూలంగా మారతాయని, అందుకే వాటిని ఈ జాబితాలో చేర్చినట్లు తెలిపింది.

ప్రభుత్వాలు డ్రగ్స్‌పై కఠిన చర్యలు తీసుకుంటున్నప్పటికీ ఈ పరిస్థితి ఉండొచ్చని పేర్కొంది. గత 12 నెలలుగా మాదక ద్రవ్యాల నియంత్రణ ఒప్పందాలను పాటిం చడంలో, చర్యలు తీసుకోవడంలో 'దారుణంగా విఫలమైన' దేశాలుగా ఆఫ్ఘనిస్థాన్, బొలీవియా, బర్మా, కొలంబియా, వెనిజులా పేర్లను ట్రంప్ ప్రత్యేకంగా ప్రస్తావించారు.

ఇటీవల భారత నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో (ఎన్‌సీబీ) పనితీరును భారత్‌లోని అమెరికా రాయబార కార్యాలయం ప్రశంసించడం గమనార్హం. ఓ అంతర్జాతీయ డ్రగ్స్ ముఠాను ఎన్‌సీబీ ఛేదించిన నేపథ్యంలో 'అక్రమ మాదక ద్రవ్యాల నుంచి అమెరికన్లను రక్షించడంలో, వారి ప్రాణాలను కాపాడటంలో సహాయం చేస్తున్నందుకు భారత ఎన్‌సీబీకి ధన్యవాదాలు" అని అమెరికా ఎంబసీ పేర్కొంది. ఈక్రమంలో ఇపుడు తాజా జాబితాలో భారత్ పేరు రావడం చర్చనీయాంశం అయింది.


# హిండెన్‌బర్గ్ ఆరోపణలపై ఆదానికి సెబీ క్లీన్‌చిట్!



**న్యూఢిల్లీ, సెప్టెంబరు 19:** ఆదానిగ్రూప్ సంస్థలపై అమెరికాకు చెందిన షార్ట్‌సెల్లర్ సంస్థ హిండెన్‌బర్గ్‌రీసెర్చి చేసిన ఆరోపణల్లో ఆధారాలు లేవని, ఎలాంటి నంబంధనలు ఉల్లంఘించిందన్న ఆరోపణలపై హిండెన్‌బర్గ్ ఆధారాలు చూపించలేకపోయిందనిసెబీ క్లీన్‌చీట్ ఇచ్చింది. ప్రత్యేకించి ఆదానిగ్రూప్ ఛైర్మన్ గౌతమ్ ఆదాని, గ్రూపు కంపెనీలపై హిండెన్‌బర్గ్ చేసిన ఆరోపణలు నిరాధారమని సెబీ తేల్చిచెప్పింది. 2023 జనవరిలో హిండెన్‌బర్గ్ రీసెర్చి ఆదాని మరో మూడు కంపెనీలు షేర్ల లావాదేవీలకు సంబంధించి పలు అవకతవకలకు పాల్పడుతున్నట్లు ఆరోపించింది. ఆదికార్ప్ ఎంటర్‌ప్రైజెస్, మైల్‌స్టోన్‌ట్రేడ్‌లింక్స్, రెహవార్ ఇన్‌ఫ్రా సంస్థలద్వారా ఆదానిగ్రూప్‌లోకి నిధులను మళ్లిస్తోందని ఆరోపించింది. సెబీ గురువారం జారీచేసిన రెండు ఉత్తర్వుల్లోనూ ఎలాంటి నిబంధనల ఉల్లంఘనలు జరగలేదని ధృవీకరించింది. సంస్థ నిర్వహించిన సంబంధంలేని పార్టీలతో ఉన్న డీల్స్‌ను సంబందం ఉన్న పార్టీల డీల్స్‌గా పరిగణించలేమని, 2021లో వచ్చిన సవరణల తర్వాత నిర్వచనం కూడా మారిందని సెబీ వెల్లడించింది. అన్ని రుణాలను కూడా తిరిగి చెల్లించారని, నిదులు సమీకరణ ఎందుకోసం చేసారో వాటికి మాత్రమే సెబీ వినియోగించిందని సెబీ తన నివేదికలో వెల్లడించింది. అందువల్ల ఆదాని గ్రూప్‌పై చేపట్టిన అన్ని విచారణలను నిలిపివేస్తున్నట్లు సెబీ ప్రకటించింది.

సెబీ ఉత్తర్వులపై ఆదాని ఛైర్మన్ గౌతమ్ ఆదాని స్పందించారు. హిండెన్‌బర్గ్ ఆరోపణలు నిరాధారమని సెబీ ఉత్తర్వులతో నిర్ధారణ అయిందని పేర్కొంటూ సెబీ తీర్పును స్వాగతించారు. విషప్రచారంచేసిన వారు దేశానికి క్షమాపణలు చెప్పాలని కోరారు. సత్యమేవ జయతే, జైహింద్ అంటూ ఆయన తన ఎక్స్ ఖాతలోపోస్టుచేసారు. జాతికి సేవలందించడంలో రాజీలేని మార్గంలోనే ముందుకువెళతామని, భారత్‌లో మాసంస్థలు అందుకు ప్రతీకగా నిలుస్తాయని గౌతమ్ ఆదాని అన్నారు.

# ఎంపి కంగనా దక్షిణాదికి వస్తే చెంపదెబ్బకొట్టాలి!



## డిఎంకె నేత అళగిరి వ్యాఖ్యలపై దుమారం

**చెన్నై, సెప్టెంబరు 19:** బిజెపి ఎంపీ కంగనారనౌత్ దక్షిణాదికి వస్తే చెంపదెబ్బ కొట్టాలని అళగిరి అన్నారు. ఆయన చేసిన వ్యాఖ్యలపై పలువురు మండిపడుతున్నారు. అయితే, రూ.100 చెల్లిస్తే మహిళా కార్యకర్తలను నిరసనల్లోనే పాల్గొనేందుకు నియమించుకోవచ్చంటూ కంగనా గతంలో చేసిన ప్రకటనపై అళగిరి స్పందించారు. ఈ సందర్భంగా మండి ఎంపీపై విరుచుకుపడ్డారు. బిజెపి ఎంపీ అహంకారంతో మాట్లాడుతుందని విమర్శించారు. ఆమె దక్షిణాది రాష్ట్రాల సందర్శనకు వస్తే అదే సమయంలో ఆమెను చెంపదెబ్బ కొట్టాల్సిందేంటూ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. గతంలో ఇలాంటి వ్యాఖ్యలు కంగనా గతంలో చేసిందని గుర్తుచేశారు. ఢిల్లీ విమానాశ్రయంలో ఓ మహిళా సిఐఎస్ఎఫ్ సిబ్బంది ఆమెను చెంపదెబ్బ కొట్టిన విషయాన్ని గుర్తు చేశారు. రైతుల ఉద్యమాన్ని ఉద్దేశించి కంగనా చేసిన వ్యాఖ్యలకు నిరసనగా చెంపదెబ్బ కొట్టిందని, అవమానించే వ్యాఖ్యలు చేస్తే ఎవరికైనా ఆగ్రహం వస్తుందని అళగిరి తెలిపారు.

ఈసారి దక్షిణాదికివస్తే మరిచిపోకుండా కంగనాను చెంపదెబ్బ కొట్టాల్సిందేనని అప్పుడే ఆమెకు తప్పు తెలిసివస్తుందన్నారు. కాగా అళగిరిచేసిన వ్యాఖ్యలపై కంగనారనౌత్ స్పందించింది. భారత్‌లో ఎక్కడికైనా వెళ్లవచ్చని ఎవరూ ఆపలేరన్నారు. ద్వేషించేవారు కొందరుంటే ప్రేమించే వారు చాలా మందే ఉన్నారన్నారు. వరద బాధితులను కలిసేందుకు వెళ్లిన ఆమె ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడారు. అళగిరి వ్యాఖ్యలపై స్పందించారు. తమిళనాడు సీఎం తలైవి జయలలిత పాత్రను సినిమాలో పోషించానని కానీ ఓటింగ్ సమయంలో సభలో ఉన్న ప్రతిపక్ష ఎంపీలు కూడా వరుసలో వెళ్తుండగా తనను తలైవి అని సంబోధించారన్నారు. మహిళలపై ఇలాంటి అగౌరవకరమైన వ్యాఖ్యలు చేయకూడదని ఇది ప్రజలకు తప్పుడు సందేశాన్ని పంపుతుందన్నారు.

ఇదిలా ఉండగా.. కులు జిల్లాలోని మనాలి సబ్ డివిజన్‌లోని సోలాంగ్, పాల్చన్‌లోని వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించారు. ఇక్కడ తన రెస్టారెంట్ ఉందని ఇక్కడ కేవలం రూ.50 వ్యాపారం మాత్రమే జరిగిందని రూ.15లక్షలు జీతాలు చెల్లిస్తున్నట్లు తెలిపారు. బియాస్ నది ఉప్పొంగుతున్నందున సోలాంగ్ గ్రామంలో కొండ చరియలు విరిగిపడే ప్రమాదం ఉందని స్థానికులు ఎంపీకి తెలిపారు.

# శబరిమల ఆలయం స్వర్ణాభరణ వివాదంపై విజిలెన్స్ దర్యాప్తు



**తిరువనంతపురం, సెప్టెంబరు 19:** కేరళలోని ప్రసిద్ధ శబరిమల ఆలయంలో విగ్రహాల బంగారు పూతపూసిన తాపడాలను అనుమతి లేకుండా తొలగించడం ఇటీవల వివాదాస్పదమైంది. తాజాగా ఇందుకు సంబంధించిన మరో కీలక విషయం వెలుగులోకి వచ్చింది. ఈ విగ్రహాల తాపడాలపై బంగారం బరువు తగ్గడాన్ని కేరళ హైకోర్టు తీవ్రంగా పరిగణించింది. దీనిపై విజిలెన్స్ కమిటీ దర్యాప్తు చేపట్టాలని న్యాయస్థానం ఆదేశించింది. శబరిమలలో గర్భగుడి ముందు ఉన్న ద్వారపాలక విగ్రహాలపై బంగారు పూత పూసిన రాగి తాపడాలను 2019లో మరమ్మతుల నిమిత్తం తొలగించారు. వాటిని సరి చేయించి కొత్త బంగారు పూత తాపడాలను అందిస్తానని ఉన్నికృష్ణన్ అనే దాత తీసుకెళ్లారు. ఈ పనిని చెన్నైలోని ఓ సంస్థకు అప్పగించారు. 2019లో వాటిని తొలగించే సమయంలో తాపడాల బరువు 42.8 కిలోలుగా ఉన్నట్లు రికార్డుల్లో ఉంది. అయితే ఆ తాపడాలను తమ వద్దకు తెచ్చినప్పుడు బరువు 38.28 కిలోలు మాత్రమే ఉందని సదరు కంపెనీ తెలిపింది. అంతేగాక ఆలయం నుంచి తాపడాలను తొలగించిన దాదాపు 40 రోజుల తర్వాత వాటిని చెన్నైలోని కంపెనీకి అందించినట్లు తెలిసింది. ఈ పరిణామాలపై తాజాగా కోర్టు అనుమానం వ్యక్తం చేసింది. ఉన్నట్లుండి తాపడాల బరువు 4.524 కేజీలు తగ్గడాన్ని తీవ్రంగా పరిగణించింది. వీటిని తిరిగి అమర్చినప్పుడు ఎందుకు బరువును సరిచూడలేదని ప్రశ్నించింది. ఈ తగ్గుదలకు ఏకైక కారణంగా బంగారు పూత తగ్గడమే అని న్యాయస్థానం అభిప్రాయపడింది. లేదంటే దాత వాటి స్థానంలో మరో తాపడాల సెట్‌ను కంపెనీకి ఇచ్చే అవకాశం కూడా ఉన్నట్లు పేర్కొంది. ఇందులో లోపాలు కనిపిస్తున్నాయని, బరువు ఎలా తగ్గిందో తెలుసుకునేందుకు విజిలెన్స్‌కమిటీ దర్యాప్తుకు ఆదేశించింది. ఇందుకు సహకరించాలని ట్రావెన్‌కోర్ దేవస్థానం బోర్డుకు సూచించింది. దీనిపై మూడు వారాల్లోగా నివేదికను అందచేయాలని స్పష్టం చేసింది. అనంతరం ఈ కేసు విచారణను సెప్టెంబర్ 30వ తేదీకి వాయిదా వేసింది.

## ఓట్ల తొలగింపునకు సాఫ్ట్‌వేర్ వాడుతున్నారు -కాంగ్రెస్ అగ్రనేత రాహుల్



**న్యూఢిల్లీ, సెప్టెంబరు 19:** కేంద్ర ఎన్నికల సంఘంపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ మరోసారి తీవ్ర ఆరోపణలు చేశారు. 2023 అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీకి పట్టున్న ప్రాంతాల నుంచి ఓట్లను తొలగించారని విమర్శించారు. రాష్ట్రం వెలుపలి నుంచి నకిలీ లాగిన్లు, ఫోన్ నెంబర్లను ఉపయోగించి ఓటర్ ఐడిలను తొలగించినట్లు వ్యాఖ్యానించారు. సాఫ్ట్‌వేర్‌ను వినియోగించి కేంద్రీకృత పద్ధతిలో ఈ చర్యలకు పాల్పడినట్లు ఆరోపించారు. ఈ మేరకు ఢిల్లీలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ ఓట్ల తొలగింపు అంతా వ్యక్తులతో గాకుండా సాఫ్ట్‌వేర్‌ను ఉపయోగించి చేస్తున్నారు. అదంతా ఒక ప్రక్రియ ప్రకారం జరుగుతోంది. ప్రతిపక్షాలకు ఓట్లు వేసే కమ్యూనిటీలను లక్ష్యంగా చేసుకుంటున్నారు. ఇందుకు సంబంధించి మేం 100 శాతం ఆధారాలను గుర్తించాం. నేను ఈ దేశాన్ని, రాజ్యాంగాన్ని ప్రేమిస్తున్నాను. ఈ ప్రజాస్వామ్య ప్రక్రియను ఇష్టపడతాను. ఈ ప్రక్రియను నేను రక్షిస్తున్నాను. ఇక దీనికి ఎలా స్పందించాలనేది మీ చేతుల్లోనే ఉంటుంది. కర్ణాటకలోకి అలంద్‌లో ఆరువేల ఓట్లను తొలగించే ప్రయత్నం జరిగింది అని విమర్శించారు. అలాగే ఓట్ల చోరీకి పాల్పడేవారిని ఎన్నికల సంఘం చీఫ్ రక్షిస్తున్నారని, ఈ వ్యవహారంపై విచారణ జరపాలన్న అభ్యర్థనలను విస్మరిస్తున్నారని అన్నారు. ఇది హైడ్రోజన్ బాంబు కాదని, దానిని త్వరలో పేలుస్తానని వెల్లడించారు.

# సంక్షిప్తంగా..

## అమెరికాలో ట్రంప్ పసిడి విగ్రహాం!



**వాషింగ్టన్, సెప్టెంబరు 19:** అమెరికా చట్టసభల భవనం క్యాపిటల్ ఎదురుగా ట్రంప్ బంగారు విగ్రహం ఏర్పాటుపై అమెరికాతోపాటు ప్రపంచదేశాల్లోను ఆసక్తిపెరిగింది. కొందరు ఈ చర్యపై విమర్శలు కూడా గుప్పిస్తున్నారు ట్రంప్ చేతిలో క్రిప్టో కరెన్సీ ఉన్నట్లు 12 అడుగుల ఎత్తు ఉండేలా ఈ విగ్రహాన్ని డిజైన్ చేశారు. దీని కోసం క్రిప్టోకరెన్సీ పెట్టుబడిదారులు నిధులు సమకూర్చారు. అమెరికా ఫెడరల్ రిజర్వ్ ప్రామాణిక వడ్డీ రేటును 25 బేస్ పాయింట్ల మేర తగ్గించిన నేపథ్యంలో విగ్రహం ఏర్పాటు ఆసక్తికరంగా మారింది. దీన్ని చూసేందుకు జనాలు తండోపతండాలుగా తరలివస్తున్నారు. డిజిటల్ కరెన్సీ భవిష్యత్తు, రిజర్వ్ బ్యాంకుల విత్త విధానాలు, ఆర్థిక రంగ మార్కెట్‌లో ప్రభుత్వం పాత్ర తదితర అంశాలపై జనాల్లో అవగాహన, చర్చను ప్రారంభించేందుకు ఈ విగ్రహం ఏర్పాటు చేసినట్లు క్రిప్టో ఇన్వెస్టర్లు కొందరు పేర్కొన్నారు.

## పాక్-సౌదీ మధ్య కీలక రక్షణ ఒప్పందం

**రియాద్, సెప్టెంబరు 19:** దాయాది పాకిస్థాన్, సౌదీ మధ్య కీలక రక్షణ ఒప్పందం కుదిరిన విషయం తెలిసిందే. ప్రస్తుతం సౌదీ అరేబియా పర్యటనలో ఉన్న పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ ఆ దేశ ప్రిన్స్ మహమ్మద్ బిన్ సల్మాన్‌తో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా వ్యూహాత్మక రక్షణ ఒప్పందాన్ని కుదుర్చుకున్నారు. రెండు దేశాల్లో దేనిపైన అయినా దాడి జరిగితే అది ఇద్దరిపైనా జరిగిన దాడిగా భావిస్తారు. అప్పుడు రెండు దేశాలూ దాడి చేసిన దేశంపై పోరాడేలా ఈ ఒప్పందం కుదుర్చుకున్నారు. పహల్గాం ఉగ్రదాడి తర్వాత పాక్-భారత్ మధ్య ఉద్రిక్తతలు నెలకొన్న వేళ ఈ ఒప్పందం జరగడం ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ ఒప్పందంపై భారత్ తాజాగా స్పందించింది. ఈ ఒప్పందం పరిణామాలను అర్థం చేసుకునేందుకు అధ్యయనం చేస్తున్నట్లు పేర్కొంది. జాతీయ ప్రయోజనాలను కాపాడుకోవడానికి, అన్ని రంగాల్లో సమగ్ర జాతీయ భద్రతను నిర్ధారించడానికి అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని వెల్లడించింది.

## ఎయిర్ ఇండియా ప్రమాదం.. బోయింగ్‌పై అమెరికాలో దావా



**న్యూయార్క్, సెప్టెంబరు 19:** అహ్మదాబాద్‌లో జరిగిన ఎయిరిం డియా విమానప్రమాదం యావత్ దేశాన్ని దిగ్భ్రాంతికి గురి చేసింది. ఈఘటనలో మృతులకు సంబంధించిన నాలుగు కుటుంబాలు విమాన తయారీ సంస్థ బోయింగ్‌పై అమెరికాలో దావావేశాయి. ఈ పిటిషన్‌లో విడిభాగాల తయారీ సంస్థ హనీవెల్ పేరునుకూడా చేర్చాయి. ఈ మేరకు ఆ కుటుంబాలు మంగళవారం దాఖలు చేసిన ఈ దావాలో.. ఇంధన స్విచ్‌లు లోపభూయిష్టంగా ఉండటం వల్లే ప్రమాదం జరిగిందని ఆరోపించాయి. 787 డ్రీమ్‌లైనర్ విమానం డిజైన్, దాని విడిభాగాల అభివృద్ధి సమయంలోనే లోపాలు వారికి తెలు సని.. అయినా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోలేదని పేర్కొన్నారు. 'ఇంధన సరఫరా, విమాన థ్రస్ట్‌నియంత్రణకు సంబంధించిన డిజైన్‌లో లోపంఉంది' అని బాధిత కుటుంబాలు ఆరోపించాయి. అంతేకాక.. అకస్మాత్తుగా వచ్చిపడే ప్రమాదాలను నిలువరించేందుకు ఆ రెండు సంస్థలు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోలేదన్నాయి. స్విచ్‌లకు తనిఖీలు, మరమ్మతులు అవసరమని విమానాయాన సంస్థలను హెచ్చరించలేదన్నారు.

## వైష్ణోదేవి యాత్ర పునఃప్రారంభం

**డెహ్రాడూన్, సెప్టెంబరు 19:** భారీ వర్షాలు, వరదలతో తీవ్ర ఆటంకాలు ఎదుర్కొన్న శ్రీ మాతా వైష్ణోదేవి యాత్ర ఈ రోజు తిరిగి ప్రారంభమైంది. ప్రతికూల వాతావరణం కారణంగా బుధవారం నిలిపివేసిన యాత్రను, వాతావరణం మెరుగుపడటంతో అధికారులు పునరుద్ధరించారు. దీంతో భక్తులు, స్థానిక వ్యాపారులు ఊపిరి పీల్చుకున్నారు. గురువారం ఉదయం 6 గంటల నుంచే యాత్రకు భక్తులను అనుమతించారు. బేస్ క్యాంప్ నుంచి ఆలయం వరకు అన్ని సౌకర్యాలు అందుబాటులోకి తెచ్చినట్లు శ్రీ మాతా వైష్ణో దేవి పుణ్యక్షేత్ర మండలి అధికారులు తెలిపారు. పొగమంచు కారణంగా తాత్కాలికంగా నిలిచిపోయిన హెలికాప్టర్ సేవలను కూడా తిరిగి ప్రారంభించారు. తొలిరోజే 3,500 మందికి పైగా భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారని, ఉదయం నుంచి భక్తుల రాక నిరంతరాయంగా కొనసాగుతోందని వారు వెల్లడించారు.

## జీజీహెచ్ కు మరిన్ని నిధులు కేటాయించాలి



- అసెంబ్లీలో గళం వినిపించిన ఎమ్మెల్యే నసీర్
- సానుకూలంగా స్పందించిన వైద్య శాఖ మంత్రి సత్యకుమార్

**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో, (జర్నలిస్ట్ ఫైల్):** నిరుపేదల వైద్యానికి వరప్రదాయినిగా ఉన్న గుంటూరు ప్రభుత్వాస్పత్రి అభివృద్ధిపై అసెంబ్లీ సాక్షిగా గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనారిటీస్ కమిటీ చైర్మన్ నసీర్ గళం వినిపించారు. శుక్రవారం అసెంబ్లీ సమావేశాల్లో ఎమ్మెల్యే నసీర్ మాట్లాడారు. సీఎం చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గుంటూరు ప్రభుత్వాస్పత్రి అభివృద్ధికి తీసుకున్న అభివృద్ధికి కార్యక్రమాలను వివరిస్తూనే.. జీజీహెచ్ కు రోజురోజుకు పెరుగుతున్న రోగుల సంఖ్యను బట్టి మౌలిక వసతులు కల్పించాల్సిన విషయాన్ని ప్రస్తావించారు. జీజీహెచ్ కు ఎన్టీఆర్ వైద్య సేవ నిధుల బకాయిలు పెండింగ్ లో ఉన్నాయని, వీటిని వెంటనే విడుదల చేయించాలని కోరారు. ప్రతి రోజూ 3 నుంచి 4 వేల వరకు మంది ఔట్ పేషెంట్లు వస్తున్నారని, 1500 వరకు బెడ్లు ఉన్నాయని వివరించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో ప్రభుత్వాస్పత్రులను అభివృద్ధి చేస్తున్నారని, ఈ క్రమంలో ప్రజలకు జీజీహెచ్ పై నమ్మకం పెరిగిందని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా జీజీహెచ్ ప్రజలకు వరప్రదాయినిగా మారిందని, దాతలు కూడా ఉదార స్వభావంతో నిధులు అందిస్తున్నారని వివరించారు. ఈ నేపథ్యంలో జీజీహెచ్ కు మరిన్న మౌలిక సదుపాయాల కల్పనకు నిధులు కేటాయించాలని విన్నవించారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఆరోగ్యశ్రీ పేరిట ప్రైవేటు ఆస్పత్రులకు నిధులు ధారాదత్తం చేశారని విమర్శించారు.

ఎమ్మెల్యే నసీర్ అడిగిన అంశాలపై వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ సానుకూలంగా స్పందించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో ఎన్టీఆర్ వైద్య సేవ కింద 13.42 మంది లబ్ధి పొందారని వెల్లడించారు.

## బీజేవైఎం ఆధ్వర్యంలో 'నమో యువరన్'



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):** భారతీయ జనతా యువమోర్చా ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 10 గంటలకు గుంటూరు ఎన్టీఆర్ స్టేడియం వద్ద నుంచి 'నమో యువరన్' కార్యక్రమం ఘనంగా ప్రారంభం కానుంది. యువతను విస్తృతంగా భాగస్వామ్యం చేయాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని బీజేవైఎం గుంటూరు జిల్లా అధ్యక్షులు మైల హరికృష్ణ సమన్వయంతో నిర్వహిస్తున్నారు. డ్రగ్స్ రహిత దేశమే ధ్యేయంగా ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను గుంటూరు జిల్లా బిజెపి అధ్యక్షులు చెరుకూరి తిరుపతిరావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత మత్తుపదార్థాలకు బానిసలుగా మారి భవిష్యత్తు అంధకారంలోకి నెట్టబడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చెడు మార్గాలను విడిచి సత్మార్గంలో ముందుకు సాగాలని, పెద్ద ఎత్తున 'నమో యువరన్'లో పాల్గొని డ్రగ్స్ వ్యతిరేక ఉద్యమానికి తోడ్పడాలని యువతను పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో యువమోర్చా నాయకులు చల్ల కౌశిక్, గుంటూరు జిల్లా యువమోర్చా ప్రధాన కార్యదర్శి తుంగ యశ్వంత్, బిజెపి గుంటూరు జిల్లా ప్రధాన కార్యదర్శి బజరంగ్ రామకృష్ణ, బిజెపి జిల్లా సేవా పక్వాడ కార్యక్రమం కన్వీనర్ చరక కుమార్ గౌడ్, యువమోర్చా జిల్లా కార్యదర్శి రాజా, కోశాధికారి మల్లెల గోపి, నాయకులు సాయి తదితరులు పాల్గొన్నారు.

## డ్రోన్ సాయంతో పేకాటరాయుళ్ల ఆట కట్టించిన రూరల్ పోలీసులు



- 12మంది అరెస్ట్, 1,62,450 నగదు స్వాధీనం

**తెనాలి,(జర్నలిస్ట్ ఫైల్)** రూరల్ పోలీసుల డ్రోన్ కెమెరా నిఘా నీడన 12 మంది పేకాట రాయుళ్ళ నుండి, 1,62,450 నగదు స్వాధీనం చేసుకున్న ఉదంతం వెలుగు చూసింది. మండలంలోని సంఘం జాగర్లమూడి గ్రామంలో గల సంగమేశ్వర స్వామి ఆలయానికి సమీపంలో గల, రైల్వే ట్రాక్ ప్రక్కన, చెట్ల పొదల మధ్య పేకాట జోరుగా సాగుతున్నట్లు లభించిన సమాచారం మేరకు, రూరల్ పోలీసులు డ్రోన్ కెమెరాతో నిఘా పెట్టారు. ఈక్రమంలో శుక్రవారం 12 మంది పేకాట రాయుళ్ళను అరెస్ట్ చేసి, వారి వద్ద నుండి 1,62 ,450 నగదు, రెండు మోటార్ బైక్ లను స్వాధీనం చేసుకున్నట్లు రూరల్ సి ఐ ఉమేష్ తెలిపారు పేకాటను నిర్వహించే దుర్గా అనే వ్యక్తితోపాటు, మరో నలుగురు పరారీలో ఉన్నట్లు, మొత్తం 17 మందిపైన కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సి ఐ ఉమేష్ తెలిపారు.

## 22 నుంచి దసరా నవరాత్రి ఉత్సవాలు



**బ్రహ్మంగారిమఠం (జర్నలిస్ట్ ఫైల్)** శ్రీ దేవి శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని బ్రహ్మంగారిమఠంలోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయంలో జరుగు శరన్నవరాత్రి ఉత్సవాల పోస్టర్లను శుక్రవారం ఆర్యవైశ్య సభ నూతన అధ్యక్షులు అయ్యపు వెంకటసురేష్ ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు మహిళామూర్తుల మధ్య ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేవి నవరాత్రి మహోత్సవాలు ఈనెల 22న ప్రారంభమై అక్టోబర్ 3 వరకు నిర్వహించబడుతుందన్నారు. కావున ఈ కార్యక్రమానికి ప్రతి ఒక్కరూ హాజరై శ్రీ దేవి నవరాత్రి మహోత్సవాలు వైభవంగా జరిగేటట్లు చూడాలని ఆయన కోరారు. కార్యక్రమంలో మాజీ ఉపాధ్యక్షులు ముచ్చెర్ల శేషయ్య గౌరవ సలహాదారులు పత్తి వెంకటేశ్వర్లు కార్యదర్శి సుంకు సురేష్ బాబు కోశాధికారి దుగ్గిశెట్టి వెంకటేశ్వర్లు యువజన సంఘం అధ్యక్షులు యాదాళ్ళ వెంకటసుబ్బయ్య సుంకు నాగేశ్వరరావు సుబ్బారావు గురుబ్రహ్మం పబ్బతి నాగేశ్వరరావు యాదాల సురేంద్ర బింగి సురేంద్ర మహిళా మండలి అధ్యక్షురాలు పబ్బతి లక్ష్మీదేవి తదితరులు హాజరయ్యారు.

## ప్లాస్టిక్ వ్యర్థాలపై ఉక్కుపాదం మోపాల్సిన సమయం ఆసన్నమైంది

- ఎమ్మెల్యే గళ్లా మాధవి
- ప్లాస్టిక్ నిషేధం పక్కాగా అమలు చేయడం కోసం టాస్క్ ఫోర్స్ ఏర్పాటు చేస్తామన్న ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్
- ప్లాస్టిక్ పై అసెంబ్లీలో చర్చ జరగాలన్న ఉప ముఖ్యమంత్రి



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):** గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి శుక్రవారం జరిగిన అసెంబ్లీ వర్షాకాల సమావేశాల్లో ప్రశ్నోత్తరాల సమయంలో ప్లాస్టిక్ కాలుష్య సమస్యను గట్టిగా లేవనెత్తారు. పర్యావరణం, ప్రజారోగ్యం రెండింటికీ ఇది తీవ్రమైన ముప్పుగా మారిందని ఆందోళన వ్యక్తం చేసిన ఆమె, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించేందుకు కఠినమైన చర్యలు తీసుకోవాలని ఉప ముఖ్యమంత్రి, పర్యావరణ శాఖ మంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ ని కోరారు. ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ "ప్లాస్టిక్ మన జీవితాల్లో చాపకింద నీరులా ప్రవేశించి, ప్రతి ఇల్లు, ప్రతి వీధిని ఆక్రమించింది. గుంటూరులోనే రోజుకు సుమారు 17 టన్నుల ప్లాస్టిక్ వ్యర్థాలు ఉత్పత్తి అవుతున్నాయి. అందులో 30% బయోడీగ్రేడ్ కాని పాలిథిన్ కవర్లే. ఇటీవల కురిసిన చిన్నపాటి వర్షానికే నగర డ్రైన్లు మునిగి పొంగిపోవడం, వీధులు జలమయం కావడం కూడా ఈ ప్లాస్టిక్ వ్యర్థాల వలననే. ఉప్పలపాడు బర్డ్ శ్యాంక్చురీ ఒకప్పుడు ఎనిమిది అడుగుల లోతు ఉండేది. కానీ పర్యాటకులు, ప్రజల నిర్లక్ష్య ప్లాస్టిక్ వాడకం వల్ల ఇప్పుడు అది ఐదు అడుగులకు మాత్రమే తగ్గిపోయింది. ముఖ్యమంత్రి శ్రీ చంద్రబాబు నాయుడు గారు కూడా గుంటూరును ఎయిర్ పొల్యూషన్ హాట్‌స్పాట్‌గా పేర్కొనడం చాలా ఆందోళనకరం" అని తెలిపారు.

**ఫోటోలు చూపిస్తూ, అధికారుల నిర్లక్ష్యాన్ని ఎత్తిచూపిన ఎమ్మెల్యే గళ్ళా మాధవి**

'ప్రదర్శనలు, ర్యాలీలకే పరిమితం కాకుండా, ప్రభుత్వం ఏర్పాటు చేసిన టాస్క్ ఫోర్స్‌లను సమర్థంగా వినియోగించి ప్లాస్టిక్ పై ఉక్కుపాదం మోపాలి. ఇటీవల సచివాలయంలో ప్లాస్టిక్ వాటర్ బాటిల్స్ స్థానంలో గాజు సీసాలు వాడుతున్న నిర్ణయం అభినందనీయం. ఇదే తరహాలో రాష్ట్రంలోని అన్ని దేవాలయాలు, పర్యాటక కేంద్రములను నో ప్లాస్టిక్ జోన్‌లుగా ప్రకటించాలి. ఫుడ్ ప్యాకేజింగ్, పార్సిలింగ్‌కి పర్యావరణహితమైన ప్రత్యామ్నాయాలను తప్పనిసరిగా ప్రోత్సహించాలి" అని సూచించారు. "ప్రకృతి మనం ఇచ్చింది తిరిగి మనకు ఇస్తుంది. పర్యావరణాన్ని ప్లాస్టిక్‌తో నింపేస్తే, రేపు మనం ప్లాస్టిక్ పీపీఈ కిట్లు వేసుకొని బ్రతకాల్సిన పరిస్థితి వస్తుంది. కరోనా సమయంలో ఎదుర్కొన్న కష్టాలు మళ్లీ మానవాళి మీద రాకుండా ఉండాలంటే ప్రజల్లో అవగాహనతో పాటు కఠిన నిబంధనల అమలు తప్పనిసరి" అని గౌరవ ఉప ముఖ్యమంత్రిని విన్నవించారు.

**ఎమ్మెల్యే గళ్ళా మాధవి అడిగిన ప్రశ్నకు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ స్పందిస్తూ....**

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా ఒక్కసారి మాత్రమే వినియోగించే ప్లాస్టిక్ నిషేధానికి కట్టుబడి, సచివాలయాన్ని ప్లాస్టిక్ రహిత జోన్‌గా ప్రకటించింది. దసరా తర్వాత ఎమ్మెల్యే గళ్ళా మాధవి మా దృష్టికి తీసుకొని వచ్చిన ఉప్పలపాడు బర్డ్ శ్యాంక్చురీను దసరా తర్వాత నేను స్వయంగా వెళ్ళి పరిశీలిస్తాను. గాజు సీసాలు, బయోడిగ్రేడబుల్ ప్రత్యామ్నాయాల వాడకాన్ని ప్రోత్సహిస్తూ, ప్లాస్టిక్ రీసైక్లింగ్ యూనిట్లు, సర్క్యులర్ ఎకానమీ పార్కులు ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. కలెక్టర్ల ఆధ్వర్యంలో టాస్క్‌ఫోర్స్ కమిటీలు ఏర్పడి, ప్లాస్టిక్ విక్రయాలపై తనిఖీలు చేపడతాయి.

ప్లాస్టిక్ వల్ల పర్యావరణం, మానవ ఆరోగ్యం, పశువులపై తీవ్రమైన ప్రభావాలు పడుతున్నాయని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు. పౌరులు కూడా ప్రభుత్వ విధానానికి భాగస్వామ్యం కావాలని, ఫ్లెక్సీల బదులు బయోడిగ్రేడబుల్ ఆప్షన్స్ ఆలోచించాలని సూచించారు. అలాగే స్వచ్ఛ ఉద్యమం, ప్లాస్టిక్ ఫ్రీ తిరుమల వంటి కార్యక్రమాలు ప్రజలలో అవగాహన పెంచుతున్నాయని వివరించారు.

పంచాయతీల్లో డంపింగ్ యార్డ్స్ ఏర్పాటు, ప్లాస్టిక్ రహిత గ్రామాలకు ప్రోత్సాహకాలు, రాగ్‌పికర్స్ (చెత్తను సేకరించి అమ్మే వ్యక్తులు)కు ఉపాధి అవకాశాలు కల్పించే చర్యలు కొనసాగుతున్నాయని, రాబోయే అసెంబ్లీ సమావేశంలో పర్యావరణంపై ప్రత్యేక చర్చ జరగాలని కోరారు.

## 'నిర్మల ఫార్మసీ కళాశాల' స్వచ్ఛతాహి సేవ అవగాహన ర్యాలీ




**మంగళగిరి (జర్నలిస్ట్ ఫైల్):** మంగళగిరిలోని నిర్మల ఫార్మసీ కళాశాలలో మంగళగిరి–తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్ భాగస్వామ్యంతో స్వచ్ఛతాహి సేవ–2025 కార్యక్రమం పురస్కరించుకొని అవగాహన ర్యాలీ నిర్వహించారు. సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 2 వరకు జరుగుతున్న ఈ కార్యక్రమంలో భాగంగా కళాశాల జాతీయ సేవా పథకం యూనిట్ మరియు ఫార్మకాలజీ, ఫార్మసీ ప్రాక్టీస్ విభాగం ఆధ్వర్యంలో ర్యాలీ చేపట్టారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి. పాముల రెడ్డి ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వచ్ఛత మన ఇల్లు, కళాశాల, ఊరు నుంచి ప్రారంభమై దేశమంతా వ్యాపించాలన్నారు. స్వచ్ఛమైన భారత్ అంటే ఆరోగ్య భద్రత కలిగిన దేశమని విద్యార్థులకు అవగాహన కల్పించారు. ర్యాలీ ఆత్మకూరు హైవే అండర్‌పాస్ వద్ద మానవహారంగా ఏర్పడి, విద్యార్థులు నినాదాలు చేస్తూ ప్రజల్లో స్వచ్ఛతపై సందేశాన్ని చాటి చెప్పారు. అనంతరం విద్యార్థులచే స్వచ్ఛత ప్రతిజ్ఞ చేయించగా, దానికి జాతీయ సేవా పథకం ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ రేఖా నరేష్ బాబు మార్గనిర్దేశం చేశారు. కార్యక్రమంలో డాక్టర్ లక్ష్మయ్య, డాక్టర్ జోయల్, వి. జోజి బాబు, పి. తేజశృతి పాల్గొన్నారు. మున్సిపల్ కార్పొరేషన్ తరఫున ఎన్విరాన్మెంటల్ సెక్రటరీ సుబ్రహ్మణ్యం, శానిటేషన్ సూపర్వైజర్ నజ్మా తదితరులు హాజరయ్యారు. దేశ ఆరోగ్య భద్రతను లక్ష్యంగా పెట్టుకుని జరుగుతున్న ఈ కార్యక్రమంలో విద్యార్థుల చురుకైన భాగస్వామ్యాన్ని సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ రేవ. సిస్టర్ జి. నిర్మల జ్యోతి అభినందించారు. ర్యాలీ నిర్వహణలో జాతీయ సేవా పథకం స్టూడెంట్ కోఆర్డినేటర్స్ ఎస్. బ్లెస్సి, ఎస్. రేవంత్ సాయి, ఎం. భార్గవి ప్రియ, టి. సుస్మిత, జి. హర్షవర్ధన్, బి. తేజ వివేక్, జాన్ వెస్లీ తదితరులు కీలక పాత్ర పోషించారు. కళాశాల విభాగాధిపతులు, అధ్యాపకులు, ఫార్మా డి, బి. ఫార్మసీ విద్యార్థులు పాల్గొన్నారు.

## ఎస్ఆర్ఎం వర్సిటీలో పర్యావరణ ఎగ్జిబిషన్

- పంజాబ్, బీహార్, తెలంగాణల నుంచి విద్యార్థులు
- ఆకట్టుకున్న శాస్త్రీయ పరిశోధనా ప్రదర్శనలు




**అమరావతి, (జర్నలిస్ట్ ఫైల్):** ఏపీ ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో శుక్రవారం పర్యావరణ సంబంధ పరిశోధనల ఎగ్జిబిషన్ జరిగింది. పంజాబ్, బీహార్, తెలంగాణ రాష్ట్రాలతో మన రాష్ట్రానికి చెందిన. 120 నుండి అండర్ గ్రాడ్యుయేట్ విద్యార్థులు తమ పరిశోధనా ప్రాజెక్టులతో కార్యక్రమానికి హాజరయ్యారు. స్థానిక అబ్దుల్ కలామ్ ఆడిటోరియంలో యూనివర్సిటీ ఇన్చార్జి వైస్ ఛాన్సలర్ డాక్టర్ సతీష్ కుమార్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రదర్శనను ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. సుస్థిరమైన, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని భావి తరాలకు అందించాలంటే ఇప్పటి నుంచి వర్యావరణ హిత అవిష్కరణల కోసం శ్రమించాలన్నారు. అభివృద్ధిని కాంక్షిస్తూ పర్యావరణాన్ని దెబ్బతీయడం శ్రేయస్కరం కాదన్నారు. సిక్కిం, భూటాన్ వంటి ప్రాంతాల్లో పర్యావరణ పరిరక్షణ నూరు శాతం అమలవుతుందనీ, ఈ దిశగా మన రాష్ట్రం కూడా ముందుకు సాగాల్సి ఉందన్నారు. యూనివర్సిటీ డీన్ డాక్టర్ సీవీ టామి మాట్లాడుతూ, టెక్నాలజీ పరంగా అభివృద్ధి చెందుతున్నా, పర్యావరణ పరిరక్షణ విషయంలో వెనుకబడుతున్నామన్న భావన కలుగుతుందన్నారు. ఇందుకోసం. విద్యార్థులు నూతన ఆలోచనలను అనుల్లో పెట్టి భవిష్యత్ తరాలకు మంచి వాతావరణాన్ని అందించాలన్నారు. సృజనాత్మక ఆలోచనలను పరస్పరం మార్చుకునేందుకు ఈ తరహా ప్రదర్శనలు దోహదపడతాయని కార్యకమ కో ఆర్డినేటర్ డాక్టర్ రంగభాస్యం సెల్వనెంబి పేర్కొన్నారు.

**ఆకట్టుకున్న ప్రదర్శనలు**

విద్యార్థులు శాస్త్రీయంగా తయారు చేసిన ప్రాజెక్టులు ఎందగానో ఆకట్టు కున్నాయి. విజయవాడ ఎస్ఆర్ఆర్ కళాశాల విద్యార్థులు తయారు చేసి ప్రదర్శించిన ఎయిర్ సాల్యూషన్ ప్రాజెక్టు, మెదక్ జిల్లా జహీరాబాద్ వాక్సెన్ యూనివర్సిటీ విద్యార్థులు ప్రదర్శించిన యూవీ లైట్ ప్రాజెక్టులు ఎంతగానో ఆకట్టుకున్నాయి. మొత్తం 44 పరిశోధనా ప్రాజెక్టులను విద్యార్థులు ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ సలహాదారు ఆచార్య సిఎస్ రావు, డాక్టర్ నవీన్ కుమార్ పాల్గొన్నారు.

## దీపం పథకం..2లో నగదు పడని లబ్ధిదారుల వివరాలపై సమీక్ష



**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్)** : దీపం పథకం – 2 ద్వారా జిల్లాలో 1257 మందికి సబ్సిడీ నగదు ఖాతాలలో నమోదు కావడం లేదని వచ్చిన ఫిర్యాదులకు సంబంధించి శుక్రవారం కలక్టరేట్ లోని డీఆర్సీ హాల్ నందు జిల్లా సంయుక్త కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ గ్యాస్ ఏజెన్సీ లు , డిస్ట్రిబ్యూటర్లు , సివిల్ సప్లయ్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా సంయుక్త కలెక్టర్ మాట్లాడుతూ గుంటూరు తూర్పు, పశ్చిమ , తెనాలి , మేడికొండూరు మండలాల్లో ఎక్కువగా సబ్సిడీ నగదు జమ కాలేదని ఫిర్యాదులు వచ్చాయన్నారు. 1257 మంది జాబితాను గ్యాస్ ఏజెన్సీ లు , డిస్ట్రిబ్యూటర్లకు పంపాలని జిల్లా సప్లయ్ అధికారికి సంయుక్త కలెక్టర్ సూచించారు. గ్యాస్ ఏజెన్సీ , డిస్ట్రిబ్యూటర్లు వినియోగదారులకు ఫోన్ చేసి వారికి ఎందుకు సబ్సిడీ నగదు పడలేదు అని తెలియజేయాలని , బ్యాంక్ లకు వెళ్ళి ఏ విధంగా సబ్సిడీ నగదు పొందలనే విషయంపై తెలియజేయాలన్నారు. ఈ ప్రక్రియను వచ్చే బుధవారం నాటికి పూర్తి చేయాలన్నారు. సబ్సిడీ నగదు జమ కాని వారు బ్యాంక్ లకు వెళ్ళినపుడు వారికి ప్రాధాన్యత ఇచ్చి పని పూర్తి అయ్యేలా చూడాలని ఎల్ డి ఏం కు సూచించారు. ఎల్ డి ఏం మహిపాల్ రెడ్డి మాట్లాడుతూ వీనియోగదారులు లేటెస్ట్ ఆధార్ కార్డు , అక్కౌంట్ పుస్తకం బ్యాంక్ కు తీసుకువెళ్ళి అక్కౌంట్ డీ లింక్ చేయించుకుని మళ్ళీ లింక్ చేయించాల్సి వుంటుందన్నారు. కొంత మందికి ఆధార్ ఇన్ ఆక్టివ్ అని వస్తున్నదని , వారికి పొరపాటున రెండు ఆధార్ వుంటే ఒక కార్డును ఇవ్వాలన్నారు. కొందరికి ఆధార్ బ్యాంక్ ఖాతాకు లింక్ కానందున సబ్సిడీ నగదు జమ కావడం లేదని తెలిపారు. 40 మంది ఖాతాదారులకు సంబంధించి ఫ్రీజ్ లేక బ్లాక్ అని వస్తున్నదని , వీరికి లోన్స్ వుండి సకాలంలో ఇఎంఐ చెల్లించకపోవడం వలన గాని లేదా ఈకెవైసీ చేయించుకోకపోవడం వలన గాని సబ్సిడీ జమ కావడం లేదన్నారు. ఇటువంటి వారు బ్యాంక్ లకు వెళ్ళి సరి చేయించుకోవాలన్నారు. మిస్లేనియస్ ఖాతాలు వున్నవారు ఈకెవైసీ చేయించాలన్నారు. ఆన్‌క్లైమేడ్ అక్కౌంట్ లకు క్రొత్త అక్కౌంట్ ను ఓపెన్ చేసుకోవాలన్నారు. పది సంవత్సరాల తరువాత ఆధార్ అప్ డేట్ చేయించుకున్న వారు గ్యాస్ ఏజెన్సీ లు , డిస్ట్రిబ్యూటర్లు అప్ డేట్ ఆధార్ వివరాలు తెలియజేయనందున అలాంటి వారు 1031 మంది వున్నారని , వారు ఆధార్ అప్ డేట్ వివరా లు అందివ్వలన్నారు. అన్ని బ్యాంకుల వారికి సబ్సిడీ నగదు జమకై వచ్చే వినియోగదారులకు సేవలు అందించేలా చూడాలని సూచించడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా సంయుక్త కలెక్టర్ మాట్లాడుతూ గ్యాస్ డెలివరి చేసే వారు మహిళలతో అనుచితంగా ప్రవర్తించకూడదని , అధిక డబ్బు వసూలు చేయకూడదని ఆ విధంగా గ్యాస్ ఏజెన్సీ లు , డిస్ట్రిబ్యూటర్లు వారికి తెలియజేయాలన్నారు. బిల్ అమౌంట్ కంటే అధికంగా నగదు వసూలు చేయడం లేదని డిస్ట్రిబ్యూటర్లు తెలియజేశారు. డి ఎస్ ఓ కె. శ్రీనివాస్ మాట్లాడుతూ చనిపోయిన వినియోగదారుని పేరుపై వున్న గ్యాస్ ను లీగల్ హైర్ వున్న వారికి ట్రాన్స్‌ఫర్ చేయవలసిందిగా సూచించారు.

## గంజాయి సేవిస్తున్న 9 మంది అరెస్ట్



- 810 గ్రాముల గంజాయి స్వాధీనం

**మంగళగిరి (జర్నలిస్ట్ ఫైల్):** తాడేపల్లి మండలం ప్రాతూరు పరిధిలో కృష్ణ నది కరకట్ట సమీపంలో గంజాయి సేవిస్తున్న తొమ్మిది మందిని తాడేపల్లి పోలీసుల అరెస్ట్ చేశారు. తాడేపల్లి సీఐ వీరేంద్రబాబు కథనం ప్రకారం.. కృష్ణా నది కరకట్ట సమీపంలో కొందరు యువకులు గంజాయి సేవిస్తున్న సమాచారం రావటంతో పోలీసులు అక్కడికి చేరుకున్నారు. అక్కడ ఉన్న యువకులు గంజాయి సేవిస్తున్నారని గుర్తించారు. వారి వద్ద నుండి 810 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. వీరికి గంజాయి ఎవరు విక్రయించారు అనే అంశం మీద పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. నిందితులను అరెస్టు చేసి మంగళగిరి కోర్టులో హాజరుపరచనున్నట్లు సీఐ వీరేంద్రబాబు తెలిపారు.

## తురకపాలెం గ్రామంలో నీరు సురక్షితమే



- నీటి పరీక్షల్లో వెల్లడి

**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్):** తురకపాలెం నీటి పథకాలు నుండి సరఫరా చేస్తున్న తాగు నీరు, బోరు బావులు సురక్షితమే అని లాబ్ పరీక్షలలో తేలిందని గ్రామీణ నీటి సరఫరా విభాగం పర్యవేక్షక ఇంజనీర్ కళ్యాణ చక్రవర్తి తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. తురకపాలెంలో ఆరు బోరు బావులు, 90 వేలు లీటర్లు, 40 వేలు లీటర్లు సామర్థ్యం గల రెండు తాగు నీటి పథకాలు ఉన్నాయన్నారు. 4.95 కిలో మీటర్ల మేర పైప్ లైన్లు వేసి నీటిని సరఫరా చేస్తున్నామని చెప్పారు. గ్రామంలో 10 చేతి పంపులు పనిచేస్తున్నాయని అన్నారు. వీటి నుండి 16 నమూనాలు సేకరించి వాటర్ టెస్టింగ్ లాబ్ కు రసాయన, బాక్టీరియా సంబంధిత విశ్లేషణకు పంపించామని తెలిపారు. లాబ్ నివేదికలు ప్రకారం అన్ని అంశాలు నిర్ణీత పరిమితిలోనే ఉన్నాయని, కోలి ఫామ్ బాక్టీరియా, ఇ – కోలి వంటి అంశాలు లేవని తేలిందని ఆయన వివరించారు. వైద్య ఆరోగ్య శాఖ లాబ్ కూడా తమ లాబ్ లో చేసిన పరీక్షల మేరకు తాగు నీటి పథకాలు నుండి సరఫరా చేస్తున్న నీరు సురక్షితమే అని నిర్ధారించిందన్నారు. ముందస్తు జాగ్రత్త చర్యలలో భాగంగా సెప్టెంబర్ 6వ తేదీ నుండి తాగు నీటి సరఫరా చేయడం జరిగిందని వివరించారు.

## నేడు బీసీ సంక్షేమ హాస్టల్ ప్రారంభం



- హాజరుకానున్న మంత్రులు, ఎమ్మెల్యేలు
- 450 విద్యార్థులకు వసతి సదుపాయాలు

**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్) :** ఎన్నో ఏళ్లుగా వెనుకబడిన తరగతుల విద్యార్థులు ఎదురుచూస్తోన్న బీసీ సంక్షేమ హాస్టల్ నేడు ప్రారంభం కానుంది. గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ కృషితో సీఎం చంద్రబాబు నాయుడు సహకారంతో స్థానిక కోడిగుడ్డు సత్రంలోని బీసీ సంక్షేమ హాస్టల్ 450 విద్యార్థుల సామర్థ్యంతో నిర్మాణం పూర్తయింది. ఎమ్మెల్యే నసీర్ ప్రమాణ స్వీకారం చేసిన వెంటనే బీసీ సంక్షేమ హాస్టల్ నిర్మాణం కోసం అవిశ్రాంతంగా పట్టుబట్టి మరీ నిధులు సాధించారు. ఈ నేపథ్యంలో అన్ని సదుపాయాలతో బీసీ హాస్టల్ ప్రారంభానికి సిద్ధమైంది. కార్యక్రమానికి కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాల వీరాంజనేయులు, మాజీ మంత్రి, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు నక్కా ఆనంద్ బాబు, గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్, ప్రజాప్రతినిధులు హాజరు కానున్నారు.

## స్వస్థ నారి స్వశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి



**తెనాలి,(జర్నలిస్ట్ ఫైల్)** స్వస్థ నారి స్వశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తెనాలి ఉప వైద్య మరియు ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఈరుగుల అన్నపూర్ణ కోరారు. తెనాలిలో మంగళవారం విలేకరుల సమావే శంలో డాక్టర్ ఈరుగుల అన్నపూర్ణ కార్యక్రమ వివరాలను వెల్లడించారు. ఆరోగ్యవంతమైన మహిళ శక్తివంత కుటుంబాన్ని సమర్థవంతంగా నిర్వహించును) అను కార్యక్రమంను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా కుటుంబ సంక్షేమ శాఖ ద్వారా సెప్టెంబర్ 17 నుండి అక్టోబర్ 2 వ తేదీ వరకు రెండు వారాల పాటు నిర్వహించనున్నట్లు తెలిపారు . "స్వస్థ నారి స్వశక్తి పరివార్ అభియాన్"( ఆరోగ్య వంత మైన మహిళ– శక్తి వంత మైన కుటుంబం) అను సమగ్ర ఆరోగ్య ప్రచార్ మరియు సేవా కార్యక్రమము నిర్వహించ వలసినదిగా ఆరోగ్యశాఖ ఆదేశాలు జారీ చేయడం జరిగిందన్నారు. మహిళల ఆరోగ్యాన్ని కాపాడి కుటుంబం బలపరిచే లక్ష్యం తో ప్రణాళికలు సిద్ధం చేయడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యం అని అన్నారు.. దానితోపాటు మహిళ ఆరోగ్యం పై అవగాహన పెంచడం. మహిళలకు సమయానుకూల వైద్య సేవలు అందించడం. పోషకాహారాన్ని ప్రోత్సహించడంకుటుంబాలను స్వశక్తి చేయడం. లక్ష్యంగా ప్రభుత్వం కార్యక్రమం ఏర్పాటు చేసింది అని తెలిపారు. మహిళ ఆరోగ్యం బలపడితే కుటుంబం మొత్తం సంతోషంగా ఉంటుందనీ, 2. తల్లి ఆరోగ్యంగా ఉంటే తన పిల్లలు ఆరోగ్యం గా పెరుగుతారనీ 3. మహిళా శక్తి సమాజ శక్తికి పునాది అవుతుందన్నారు.

INK OF TRUTH
జర్నలిస్ట్ ఫైల్
తెలుగు దినపత్రిక
జర్నలిస్ట్ ఫైల్ దినపత్రిక
చందాదారులుగా చేరాలని
అనుకుంటున్నారా?
అయితే ఈ నెంబర్‌కు ఫోన్ చేయండి
సర్క్యులేషన్ మేనేజర్
76 61 80 59 68

# రాయచోటి నియోజకవర్గం రైతులకు శుభవార్త



- ఫేజ్-1లో రూ.450 కోట్ల నిర్మాణ పనులు త్వరలో టెండర్ల ద్వారా రాయచోటి, చిన్నమండెం, సంబేపల్లి మండలాల్లో 25 వేల ఎకరాలకు అందనున్న సాగునీరు
- సీఎం చంద్రబాబు నాయుడుని కలిసిన వినతి పత్రం అందజేసిన మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి

**అమరావతి ,(జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖల మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుని అసెంబ్లీ లో మర్యాదపూర్వకంగా కలిశారు. శ్రీనివాసపురం మండిపల్లి నాగిరెడ్డి హంద్రీ-నీవా మెయిన్ కెనాల్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ముఖ్యమంత్రికి మంత్రి వినతి పత్రం అందజేశారు.

**25 వేల ఎకరాలకు సాగునీటి లాభం**

ఈ ఆయకట్టు నిర్మాణం పూర్తయితే రాయచోటి, చిన్నమండెం, సంబేపల్లి మండలాల్లోని 25 వేల ఎకరాలకు సాగునీరు అందడంతో పాటు భూగర్భ జలాల నిల్వలు పెరుగుతాయని మంత్రి వివరించారు.

**త్వరలో ప్రారంభం కానున్న రూ.450 కోట్ల నిర్మాణ పనులు**

హంద్రీ-నీవా మెయిన్ కెనాల్ ఫేజ్-1లో భాగంగా రూ. 450 కోట్ల నిర్మాణ పనులకు త్వరలోనే టెండర్లు పిలిచి పనులు ప్రారంభించాలని ముఖ్యమంత్రిని మంత్రి కోరారు.

**సీఎం హామీ :** ఈ అంశంపై సానుకూలంగా స్పందించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారు, హంద్రీ-నీవా మెయిన్ కెనాల్ నిర్మాణ పనులను త్వరలోనే ప్రారంభిస్తామని మంత్రికి హామీ ఇచ్చారు.

# 22 నుంచి దసరా సెలవులు



- విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ వెల్లడి

**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్):** ఏపీలో పాఠశాలలకు ఈ నెల 22 నుంచి అక్టోబర్ 2 వరకు దసరా సెలవులు ఇస్తున్నట్లు మంత్రి నారా లోకేశ్ శుక్రవారం ప్రకటించారు. ఈ నెల 22 నుంచి దసరా సెలవులు ఇవ్వాలని ఉపాధ్యాయులు కోరారన్నారు. ఈక్రమంలో విద్యాశాఖ అధికారులతో చర్చించి నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఈమేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు మంత్రి వెల్లడించారు.

# సచివాలయ ఉద్యోగుల సమస్యలపై మంత్రిని కలిసిన ఐక్యవేదిక నాయకులు



**అమరావతి ,(జర్నలిస్ట్ ఫైల్) :** ఆంధ్రప్రదేశ్ గ్రామ-వార్డు సచివాలయ ఉద్యోగుల ఐక్యవేదిక రాష్ట్ర కమిటీ ప్రతినిధులు సచివాలయాల శాఖ మంత్రి డా. డోలా బాల వీరాంజనేయ స్వామిని శుక్రవారం భేటీ అయ్యారు.

రాష్ట్ర ఛైర్మన్ షేక్.మొహమ్మద్ జాని పాషా, రాష్ట్ర సెక్రటరీ జనరల్ విప్పర్తి నిఖిల్ కృష్ణ, రాష్ట్ర కన్వీనర్ షేక్ అబ్దుల్ రజాక్, కో%-%ఛైర్మన్లు బత్తుల అంకమ్మరావు, యువ షణ్ముఖ్ నేతృత్వంలో జరిగిన ఈ భేటీలో ఉద్యోగుల సమస్యలపై సుమారు అరగంట పాటు చర్చ జరిగింది.

సచివాలయ ఉద్యోగులను ప్రధానంగా వాలంటీర్ల విధుల నుండి విముక్తి కల్పించాలన్నది, మాతృ శాఖలు మరియు ఇతర ప్రభుత్వ శాఖల్లో విలీనం చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా నోషనల్ ఇంక్రిమెంట్లు మంజూరు చేయాలని, ఆరు సంవత్సరాలు ఒకే క్యాడర్‌లో పనిచేసిన ఉద్యోగులకు స్పెషల్ ఇంక్రిమెంట్ ఇవ్వాలని, జూనియర్ అసిస్టెంట్ క్యాడర్ కల్పించి సంబంధిత పే స్కేల్ అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు.

పెన్షన్ నిలుపుదల అంశంపై ఐక్యవేదిక పిలుపు ఇవ్వలేదని మంత్రికి స్పష్టంగా తెలియజేశారు. అన్ని అంశాలపై స్పందించిన మంత్రి డా. డోలా బాల వీరాంజనేయ స్వామి ఉద్యోగులు సంయమనంతో ఉండాలని, త్వరలోనే పదోన్నతులు కల్పిస్తామని, ప్రయోజనాలు కూడా లభిస్తాయని భరోసా ఇచ్చారు. ఉద్యోగులకు మంచి భవిష్యత్తు ఉంటుందని ఆయన హితవు పలికారు.

## ప్రభుత్వానికి ఉద్యోగుల ప్రయోజనాలు పట్టవా?

- కేబినెట్ లో ఒక్క ఆర్థిక అంశం ప్రస్తావన లేకపోవడం బాధాకరం!!
- ఏపీటీఎఫ్

**అమరావతి ,(జర్నలిస్ట్ ఫైల్) :** ప్రభుత్వం ఏర్పడి 15 నెలలు గడిచినప్పటికీ ఉపాధ్యాయ, ఉద్యోగ, పెన్షనర్ల సంఘాల ఒక్క ఆర్థిక సమస్య పరిష్కారం చేయకపోవడంతో ఉద్యోగ వర్గాల్లో తీవ్ర నిరసన వ్యక్తం అవుతుంది.

ఎప్పటికప్పుడు పెరుగుతున్న నిత్యావసర ధరలు, వైద్య ఖర్చులు, పిల్లల విద్యకోసం ఫీజులను దృష్టిలో పెట్టుకొని ఉద్యోగులకు రావలసిన ఆర్థిక డిమాండ్లను ప్రభుత్వం ఏ మాత్రం పట్టించుకోవడం లేదని ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు జి.హృదయ రాజు, ఎస్. చిరంజీవి అన్నారు. ధరల సూచీ లకు అనుగుణంగా కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన 4 డి.ఏ లలో కనీసం రెండు డి.ఏ లు కూడా మంజూరు చేయకపోవడం, 1.7.2023 నుండి అమలు కావలసిన 12 వ పీఆర్సీ కి సంబంధించి కనీసం కమీషన్ కూడా నియమించలేదని , 12 నెలల జీతాల్లో రెండు నెలల వరకు ఇన్కమ్ టాక్స్ కట్ కావడం ఇలా ఇన్ని ఇబ్బందుల మధ్య ఉపాధ్యాయుడు , ఉద్యోగి ఉన్నారని అసంతృప్తి వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాక ముందు ఇచ్చిన హామీలు ఏమయ్యాయని ప్రశ్నిస్తున్నారు. కేబినెట్ సమావేశంలో ఒక్క ఆర్థిక అంశం కూడా ఉపాధ్యాయులు, ఉద్యోగులు , పెన్షనర్లకు సంబంధించి ప్రస్తావన లేకపోవడం బాధాకరం అని ఏపిటిఎఫ్ నాయకులు వాపోయారు.

# పశువైద్యుల నియామక భర్తీని పాతరేసిన వైసీపీ

- గతంలో చంద్రబాబు చొరవతో స్థానాలను భర్తీ చేశామన్న మంత్రి అచ్చెన్నాయుడు
- గత ఐదేళ్లలో పశుసంవర్ధక శాఖలో అభివృద్ధి లేదు
- త్వరలోనే వెటర్నరీ సర్జన్ పోస్టుల భర్తీ
- వ్యవసాయ మంత్రి అచ్చెన్న వెల్లడి



**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్) :** వైసీపీ పాలనలో ఐదు సంవత్సరాల పాటు పశుసంవర్ధక శాఖకు తాళాలు వేసి పశువైద్యుల నియామక భర్తీకి సంబంధించి ఒక్కపోస్టు కూడా భర్తీ చేయలేదని, పాడి రైతులు, పశువుల సంరక్షణ పూర్తిగా నిర్లక్ష్యానికి గురైందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు దుయ్యబట్టారు. శుక్రవారం అసెంబ్లీలో మంత్రి మాట్లాడుతూ 2014-2019 సమయంలో సీఎం చంద్రబాబు చొరవతో పశువైద్యుల నియామక భర్తీకై నోటిఫికేషన్ ఇచ్చి 2017 సంవత్సరంలో 303, 2018లో మరొక నోటిఫికేషన్ ఇచ్చి 223 వెటర్నరీ డాక్టర్స్ పోస్టులు బర్తీ చేశామని తెలిపారు. 2024 ఎన్నికల అనంతరం రాష్ట్రంలో ఎన్ని పోస్టులు ఖాళీ ఉన్నాయి, ఎలా రిక్రూట్ చేయాలనేది ఆర్థిక శాఖకు నివేదిక అందచేశామని, ఆదేశాలు రాగానే ఖాళీగా ఉన్నటువంటి పశువైద్య డాక్టర్ల పోస్టులకు నోటీఫేకషన్ ఇచ్చి భర్తీ చేస్తామన్నారు. అప్పటివరకు రాష్ట్రంలో పశువైద్యానికి ఇబ్బందులు ఎదుర్కోకూడదని ప్రత్యామ్నాయంగా గ్రామస్థాయిలో దాదాపుగా 6137 మంది వెటర్నరీ అసిస్టెంట్స్ చే వైద్యసేవలు అందచేస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలో పశువైద్యుడు లేడనే మాట రాకుండా, పశు వైద్యానికి ఇబ్బంది లేకుండా ఏర్పాట్లను చేశామని, ప్రస్తుతానికైతే ఏ సమస్య లేకుండా చర్యలు చేపట్టామని తెలియజేశారు. పశుసంవర్ధక సహాయకులు గ్రామస్థాయిలో రైతు సేవా కేంద్రాల్లో చురుగ్గా పనిచేస్తున్నారని, అందుబాటులో ఉన్న పశువైద్యుల సాంకేతిక మద్దతుతో సేవలు అందిస్తున్నారని అన్నారు.

**వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ ల ఖాళీలు భర్తీకి ప్రణాళిక**

కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ ల 293 ఖాళీలు భర్తీ చేసేందుకు 258 పోస్టులను నిర్ధారించి ఆర్థిక శాఖకు ప్రతిపాదించడం జరిగిందని మంత్రి అచ్చెన్న తెలిపారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని దృష్టిలో ఉంచుకొని 24.84 కోట్లతో ప్రతిపాదనలు సత్వరమే చేపట్టాలని ఆర్థిక శాఖకు తెలియజేశామని, ఆదేశాలు రాగానే రిక్రూట్మెంట్ చేస్తామని అన్నారు. అదేవిధంగా తిరుపతిలోని వెంకటేశ్వర పశువైద్యశాలలో అండర్ గ్రాడ్యుయేషన్ , పీజీ, పిహెచ్డి విద్యార్థులకు అందచేసే స్టైఫండ్ చివరిసారిగా 2013 వ సంవత్సరంలో పెంచడం జరిగిందని, పది సంవత్సరాల తర్వాత కూటమి ప్రభుత్వంలోనే ఇటీవలే ఈ మూడు విద్యార్థులకు స్టైఫండ్ కూడా పెంచడం జరిగిందన్నారు. ప్రస్తుతం యూజీ విద్యార్థులకు 7000 నుంచి 10,500 , పీజీ వాళ్లకు 9000 నుండి 13,500, పీహెచ్డీ వాళ్లకి 10,000 నుండి 15,000 రూపాయలకు పెంచి వారి చదువుకి ఇబ్బంది లేకుండా చేశామని తెలిపారు.

రాష్ట్రంలో కొన్ని పశువైద్యశాలలు మరమ్మత్తులకు గురయ్యాయని, కొన్ని చోట్ల ప్రైవేట్ బిల్డింగులలో హాస్పిటల్స్ నిర్వహిస్తున్నారన్న విషయం తన దృష్టికి వచ్చిందని మంత్రి అచ్చెన్న తెలిపారు. ఆధునీకరణ చేయాల్సిన పశు హాస్పిటల్స్ ఎన్నో గుర్తించి, 434 పశు హాస్పిటల్స్ కి భవనాలు అవసరమని ఇందుకు ఆర్ ఐ డీఎఫ్ కింద, నాబార్డ్ కి ప్రతిపాదనలు పంపించామని, త్వరితగతిన అనుమతులు పొంది పనులు పూర్తిచేస్తామని తెలిపారు. కొవ్వూరు నియోజకవర్గంలోని తాళ్లపూడి మండలంలో పశువులు వింత వ్యాధితో చనిపోతున్నాయన్న సమాచారం తెలిసిన వెంటనే అప్రమత్తమై అధికార యంత్రాంగంతో మాట్లాడామని, 7 పశువులు చనిపోయాయని, సాంపిల్స్ కలెక్ట్ చేసామని తెలిపారు. వ్యాధి ఎలా సోకుతుందో అందుకు కారణాలు అన్వేషించి నివారణ చర్యలు చేపడతామని మంత్రి అచ్చెన్న హామీ ఇచ్చారు. 2014-2019 సమమంలో 3 నెలలకొకసారి పశువులకు ఇచ్చే వ్యాక్సిన్ ను, ప్రతి నెల గ్రామాలలో నిర్వహించే పశు వైద్య శిబిరాలు, దాణా అందచేత వైసీపీ హయాంలో నిలిపివేశారని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం ఏర్పడినాక మళ్లీ ఈ సదుపాయాలను పాడి రైతులకు అందచేస్తూ పాడిపరిశ్రమ అభివృద్ధిని గాడిన పెడుతున్నామని మంత్రి అచ్చెన్న తెలిపారు. ప్రతి కుటుంబం పశుపోషణను ప్రోత్సహించాలని దాని వలన ఆర్థిక పరిస్థితి మెరుగుపడుతుందని అన్నారు.

# రైల్వే స్టేషన్లను అద్భుతంగా తీర్చిదిద్దుతున్న ప్రధాని

- కేంద్ర గ్రామీణ అభివృద్ధి శాఖసహాయ మంత్రి పెమ్మసాని వెల్లడి
- గుంటూరు రైల్వే స్టేషన్ సబ్ వేని పరిశీలించిన మంత్రి



**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్) :** దేశంలో రైల్వేస్టేషన్ల ను. అదునాతనమైన వసతులతో తీర్చిదిద్దేందుకు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ కృషి చేస్తున్నారని కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. ఇటీవల వర్షాలకు గుంటూరు రైల్వే స్టేషన్ లోని సబ్ వేలో నీరు లీకేజీ కావడం పట్ల దాన్ని పరిశీలించి ఆయన సంబంధిత అధికారులపై శుక్రవారం ఆగ్రహం వ్యక్తం. చేశారు.

ప్రధానమంత్రి మోదీ ఎయిర్ పోర్ట్ లు ఏర్పాటు చేసినంత అద్భుతంగా అమృతభారత్ రైల్వే స్టేషన్ పేరిట రైల్వే స్టేషన్ల.ను. తీర్చిదిద్దేందుకు. కృషి చేస్తుగుంటూరు రైల్వే స్టేషన్ లోని సబ్ వేని శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూగుంటూరు రైల్వే స్టేషన్ లో కూడా ఇటీవలే సబ్ వే నిర్మాణం అందుబాటులోకి వచ్చిందన్నారు. అయితే ఇటీవల కురిసిన భారీ వర్షాలకు సబ్ వే లో లీకులు ఏర్పడి ప్రయాణికుల రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడుతున్నట్లు తన దృష్టికి వచ్చిందన్నారు. ఈ మార్గం గుండా రాకపోకలు సాగించే వారికి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.. గతంలో కూడా తాను.పరిశీలనకు వచ్చినప్పుడు ఇలాంటి ఇబ్బందులే కనపడితే అప్పుడు కూడా అధికారులను హెచ్చరించినట్లు చెప్పారు. అయినా ఇంకా పూర్తిస్థాయిలో అప్రమత్తం కాలేదు. దీనిపై తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు..పూర్ క్వాలిటీ వర్కులు ఉంటే తక్షణమే చర్యలు. చేపడతామని స్పష్టం చేశారు. ఈ పరిశీలనలో మేయర్ కోవెలమూడి రవీంద్రబాబు (నాని) డిఆర్ఎం సుదేశ్న సేన్ , డిప్యూటీ మేయర్ షేక్ సజీల , గుంటూరు జిల్లా జనసేన అధ్యక్షులు వెంకటేశ్వరరావు పశ్చిమ నియోజకవర్గం జనసేన ఇన్చార్జ్ బోనబోయిన శ్రీనివాస్ , టిడిపి నాయకులు ముత్తినేని రాజేష్ , కార్పొరేటర్ పోతురాజు సమత తదితరులు పాల్గొన్నారు.

# శాసన మండలిలో గందరగోళం



**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్టు ఫైల్):** ఏపీ శాసనమండలి గందరగోళం నెలకొంది. వైద్యశాలల అంశంపై చర్చించాలంటూ వైకాపా సభ్యులు ఆందోళనకు దిగారు. శుక్రవారం మండలి ఛైర్మన్ మోషేనురాజు ప్రశ్నోత్తరాలు చేపడుతున్న సమయంలోనూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఛైర్మన్ పోడియం వద్దకు వెళ్లి ప్లకార్డులు ప్రదర్శించారు. మరోవైపు తెదేపా సభ్యులు కూడా వైకాపాకు పోటీగా నినాదాలు చేశారు. వైకాపా ఆరోపణలను తిప్పికొడుతూ ప్లకార్డులు ప్రదర్శించారు. ఈ క్రమంలో ప్రశ్నోత్తరాలు పూర్తయినట్లు ఛైర్మన్ ప్రకటించారు. వైద్యకళాశాలలపై స్వల్ప చర్చ చేపట్టాలని బీఏసీ సమావేశంలో నిర్ణయించామని.. సభ సజావుగా జరిగేలా సహకరించాలని వైకాపా సభ్యులను ఆయనను కోరారు. మరోవైపు జీఎస్టీ సంస్కరణల అంశంపై స్టేట్‌మెంట్ ఇవ్వాలని ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్‌ను మండలి ఛైర్మన్ కోరారు. సభలో ఆర్డర్‌లో ఉంచాలని పయ్యావుల విజ్ఞప్తి చేశారు. వైకాపా సభ్యులు తమ ఆందోళనను కొనసాగించడంతో మండలి ఛైర్మన్ మోషేనురాజు సభను సోమవారానికి వాయిదా వేశారు.

# మంత్రి లోకేష్ స్పందన - నోబుల్ టీచర్స్ అసోసియేషన్ ఆనందం



**అమరావతి ,(జర్నలిస్ట్ ఫైల్) :** ఉపాధ్యాయుల అభ్యర్థనపై రాష్ట్ర విద్యా శాఖ వెంటనే స్పందించి దసరా సెలవుల షెడ్యూల్‌ను ముందుకు తీసుకువచ్చింది. ఈ నిర్ణయం పట్ల నోబుల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర శాఖ మంత్రి నారా లోకేష్ బాబుకు కృతజ్ఞతలు తెలిపింది. ముందుగా 24 సెప్టెంబర్ నుండి 2 అక్టోబర్ వరకు దసరా సెలవులు ఉండగా, నవరాత్రులు 21న ప్రారంభమవుతుండటంతో 22 నుండి సెలవులు ఇవ్వాలని అసోసియేషన్ ప్రతినిధులు, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీలు విజ్ఞప్తి చేశారు. దీనిపై మంత్రి లోకేష్ బాబు సానుకూలంగా స్పందించి కొత్త షెడ్యూల్ ప్రకటించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు కొండూరు శ్రీనివాసరాజు, ప్రధాన కార్యదర్శి బొనిగల హైమారావు ఒక ప్రకటనలో మాట్లాడుతూ, "ఉద్యోగుల సమస్యలను వినడానికి సిద్ధంగా ఉన్న ప్రభుత్వం ఉందని మళ్లీ నిరూపితమైంది. ఆలస్యమైనా రావలసిన లాభాలు తప్పకుండా అందిస్తామని మంత్రి హామీ ఇచ్చారు. సమస్యలు పరిష్కారం దిశగా వెళ్లేలా కూటమి ప్రభుత్వం కృషి చేస్తోంది" అని తెలిపారు .

# దేవరపల్లికి మ్యాన్ ఆఫ్ ఎక్స్ లెన్స్ అవార్డు

- డాక్టర్ దాసరి నారాయణ రావు స్మారక అవార్డు అందుకొన్న సురేష్ బాబు



**అమరావతి ,(జర్నలిస్ట్ ఫైల్) :** తెలంగాణకు చెందిన ఫ్రెండ్షిప్ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో వివిధ రంగాలలో విశేష సేవలు అందిస్తున్న వ్యక్తులకు ఇచ్చే డాక్టర్ దాసరి నారాయణరావు స్మారక అవార్డుకు ఎస్సీ,ఎస్టీ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు దేవరపల్లి సురేష్ బాబు ఎంపికయ్యారు. ఈ మేరకు శనివారం మ్యాన్ ఆఫ్ హ్యూమానిటీ అండ్ ఎక్సలెన్స్ 2025 అవార్డును హిమాయత్ నగర్, హైదరాబాద్ లో నిర్వాహకులు సురేష్ బాబుకు అందజేశారు. సురేష్ బాబు 20 సంవత్సరాల కు పైగా సమాజంలో ఉన్న వివిధ సామాజిక సమస్యలపై స్పందిస్తూ, ప్రజాప్రతినిధులు, అధికారులతో సమన్వయం తో పనిచేస్తూ సమస్యల పరిష్కారానికి నిత్యం కృషి చేస్తున్నారు. ఉద్యోగ సంఘ నేతగా, సామాజిక ఉద్యమకారునిగా అనేక సమస్యల పరిష్కారంలో సురేష్ బాబు తన ప్రత్యేకత చాటుకుంటున్నారు. సురేష్ బాబు నిబద్ధత, సామాజిక స్పృహతో చేస్తున్న పలు కార్యక్రమాలను పరిశీలించిన ఫ్రెండ్షిప్ మినిస్ట్రీస్ నిర్వాహకులు సురేష్ బాబును కార్యక్రమంలో విశిష్ట అతిథిగా ఆహ్వానించి అవార్డునుచేశారు.

ఈసందర్భంగా సురేష్ బాబు మాట్లాడుతూ తన పని తీరును గుర్తిస్తూ అవార్డుకు ఎంపిక చేసిన నిర్వాహకులకు ధన్యవాదాలు తెలిపారు. చేసే ప్రతి పనిలో సామాజిక బాధ్యత కలిగి ఉండాలని, ప్రతి ఒక్కరూ కుటుంబంతో పాటు సమాజాన్ని కూడా ప్రేమించే తత్వం ఉన్నప్పుడే సమాజహిత కార్యక్రమాలు చేయడం సాధ్యపడుతుందని తెలిపారు.

సురేష్ బాబు అవార్డును అందుకోవడం పట్ల పలువురు వర్షం వ్యక్తం చేశారు.

# మహాకవి బోయి భీమన్న ప్రాతఃస్మరణీయులు : మంత్రి కందుల దుర్గేష్

- పద్మ భూషణ్ డా. బోయి భీమన్న 114వ జయంతి వేడుకల్లో పాల్గొన్న మంత్రి కందుల దుర్గేష్
- 2025 బోయి భీమన్న పురస్కార గ్రహీత డా.జి.వి.పూర్ణచందును శాలువాతో సత్కరించి, రూ. 2 లక్షలు నగదు పురస్కారాన్ని అందించిన మంత్రి కందుల దుర్గేష్



**విజయవాడ (జర్నలిస్ట్ ఫైల్):** అంబేద్కర్ భావజాలానికి సాహిత్య ప్రతిఫలమే మహాకవి పద్మభూషణ్ డా. బోయి భీమన్న సాహిత్యం అని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. శుక్రవారం ఎన్టీఆర్ జిల్లా విజయవాడ కలెక్టరేట్ కార్యాలయంలోని పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో ఆంధ్రప్రదేశ్ భాషా సాంస్కృతిక శాఖ ఏర్పాటు చేసిన డా. బోయి భీమన్న 114వ జయంతి వేడుకల్లో మంత్రి కందుల దుర్గేష్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా బోయి భీమన్న సతీమణి, సుప్రసిద్ధ కవయిత్రి హైమావతిని శాలువాతో సత్కరించారు. పాలేరు నుంచి పద్మశ్రీ వరకు బోయి భీమన్న అని బోయి హైమావతి రాసిన కథనం నేటికీ సజీవంగా నిలిచిందన్నారు. 2025 బోయి భీమన్న పురస్కార గ్రహీత డా.జి.వి.పూర్ణచందును శాలువాతో సత్కరించి, రూ. 2 లక్షలు నగదు పురస్కారాన్ని మంత్రి కందుల దుర్గేష్ అందించారు. ఈ సందర్భంగా రాయలనాటి కథలు, గాథలతో కూడిన డా.జి.వి.పూర్ణచందు రచించిన భువన విజయం పుస్తకాన్ని మంత్రి దుర్గేష్ ఆవిష్కరించి బహుమతిగా స్వీకరించారు. ఈ సందర్భంగా దళిత, మానవ హక్కుల గురించి బోయి భీమన్న ఎదుర్కొన్న సవాళ్లను,ఆయన సాహితీ ప్రస్థానాన్ని మంత్రి కందుల దుర్గేష్ వివరించారు.

ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ అంబేద్కర్ భావజాలాన్ని సాహిత్య రూపంలో తీసుకొచ్చిన బోయి భీమన్న ప్రాతస్మరణీయులు, చిరస్మరణీయులని మంత్రి తెలిపారు. సమాజంలోని రుగ్మతలను ఎత్తిచూపడానికి తన రచనావ్యాసాంగాల ద్వారా భీమన్న సృష్టించిన ఒరవడి అద్వితీయం, అజరామరం అన్నారు . ఆయన రచనలన్నింటిలోనూ అంతర్లీనంగా ఉన్న విషయం ఒక్కటే "భారతజాతి ఏకత్వం" అని తెలిపారు. డా. బోయి భీమన్న జయంతి వేడుకల్లో మంత్రిగా పాల్గొనడం రెండవసారి అని పేర్కొన్నారు. సమాజ హితం కోరే వ్యక్తుల విశిష్టతను ఈ తరానికి తెలపాల్సిన అవసరాన్ని వివరించారు.

తెలుగు జాతి గొప్పదనాన్ని, తెలుగు సాహితీ సౌరభాన్ని ప్రజలందరికీ అందించిన మహాకవి, పద్మభూషణ్ డాక్టర్ బోయి భీమన్న అని మంత్రి దుర్గేష్ అభివర్ణించారు. సాహిత్యాన్ని వేదికగా చేసుకుని కుల నిర్మూలనని చీల్చి చెండాడిన వ్యక్తి కీర్తి శేషులు ఆయన అని తెలిపారు. కుల, మత, వర్గ విభేద రహితమైన భారత జాతి ఆవిర్భవించాలనేదే తన ధ్యేయం అంటూ ప్రకటించి తన దశబ్దాల సాహిత్యాన్ని అంకితం చేసిన మహోన్నత వ్యక్తి భీమన్న అని కొనియాడారు. జాతీయవాదం తో పాటు దళిత వాదాన్ని కూడా సమ్మిళితం చేసిన మహోన్నత వ్యక్తి బోయి భీమన్న అని మంత్రి అన్నారు. తన పదునైన రచనల ద్వారా అస్పృశ్యత పారద్రోలాలని ఆలోచించి జనాలను జాగృతం చేశారని గుర్తుచేశారు. జానపదుని జాబులు అనే రచనల ద్వారా బోయి భీమన్న అద్భుతమైన ఆలోచన చేశారన్నారు. తన సాహిత్యం ప్రజలను రంజింప చేయడమే కాకుండా ఆలోచింపజేస్తుందన్నారు. సామాజిక చైతన్యంతో రచనలు చేసి తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నం చేసిన గొప్ప వ్యక్తి ఆయన అన్నారు. ఆయన చేసిన జనజాగృత కార్యక్రమాలు అనుసరణీయం అన్నారు. తన రచనలతో సమాజం నుండి సత్ఫలితాలు పొందారన్నారు. ఆయన రాసినజయ జయ అంబేద్కర్ గీతం దళితులకు జాతీయ గీతంగా మారిందన్నారు. ఎన్నో రాష్ట్ర, జాతీయ అవార్డులు అందుకున్న ఆయన దారిలో మనం ప్రయాణించాల్సిన అవసరం ఉందని సూచించారు. సమాజంలో మార్పు కోరిన ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత ప్రభుత్వంతో పాటు అందరిపై ఉందన్నారు. అలా తీసుకెళ్తేనే తాము ఈ పదవులకు అర్హులం అన్నారు.

ఈ సందర్భంగా కార్యక్రమంలో పాల్గొన్న వక్తలు స్వతహాగా రంగస్థల నటులైన మంత్రి కందుల దుర్గేష్ ను, సాహిత్య, కళా రంగాలకు ఆయన చేస్తున్న కృషిని కొనియాడారు.

కార్యక్రమంలో మంత్రి కందుల దుర్గేష్, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి.లక్ష్మీశ, సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మల్లిఖార్జున రావు, నాటక అకాడమీ ఛైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ, జానపద కళలు మరియు సృజనాత్మకత అకాడమీ ఛైర్మన్ గంగులయ్య, బోయి భీమన్న సతీమణి హైమావతి,మేనకోడలు మధుగీత, బోయి భీమన్న కుటుంబ సభ్యులు,2025 బోయి భీమన్న పురస్కార గ్రహీత డా.జి.వి.పూర్ణచందు, భాషా సాంస్కృతిక శాఖ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

Edited, Printed and Published by D.Ajay at Express Printers and Publishers D.No. 3-28-1, Brundavan Gardens, Guntur (A.P)-522006. RNI No. 52813/1993.
Administration Office : 126-352, Between 4th & 5th lanes , Kodandarama Nagar, Gorlavaripalem Donka, Gorantla, Guntur (AP)-522034. Ph 8106539118, 7416812467